అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
శనివారం 02-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 61 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50



## మారణహోమం
- గాజాలో 112 మందిపై ఉచకోత
- ఇజ్రాయిల్ హత్యాకాండపై ప్రపంచదేశాల ఆగ్రహం 13లో



## మళ్లీ బండ బాదుడు
- వాణిజ్య గ్యాస్‌పై రూ.25 పెంపు
- న్యూ ఇయర్ కానుకంటూ తగ్గించి..ఇపుడు కుమ్ముడు
- హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ ధర రూ.2,027 13లో


## ఇజ్రాయిల్ ఆర్మీ హత్యాకాండ
### సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో దిగ్భ్రాంతి
13లో
- అమెరికాకు వంతపాడే వైఖరిని మోడీ ప్రభుత్వం వీడాలని డిమాండ్






## దేశానికే కేరళ ఆదర్శం
### సీఎం రేవంత్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- వాస్తవాలను విస్మరించి మాట్లాడ్డం అభ్యంతరకరం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి
13లో

# ఏది నిజం?
## నీళ్లు, ప్రాజెక్టుల చుట్టూ రాష్ట్ర రాజకీయం
- పోటాపోటీగా సందర్శనలు
- జనాన్ని నమ్మించేందుకు పాట్లు
- 'నవతెలంగాణ' వాస్తవాల విశ్లేషణ


వివరాలు 3లో

రాష్ట్ర రాజకీయం నీళ్లు, ప్రాజెక్టుల చుట్టూ తిరుగుతుంది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. తప్పు మీదంటే...కాదు మీదంటూ ఒకరిపై ఒకరు కారాలు మిరియాలు నూరుకుంటున్నారు. పోటీలు పడి ప్రాజెక్టుల సందర్శన పేరుతో ఎవరి బలం వారు నిరూపించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఆటలో అరటిపండు లాగా వీళ్లిద్దరి మధ్య బీజేపీ 'దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి' అంటూ బంతిని తన కోర్టులోకి లాక్కునే ప్రయత్నం చేస్తుంది. మంచో చెడో... ఒక రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో, కేంద్ర అనుమతులు లేకుండా రూ.లక్ష కోట్లకు పైగా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తుంటే, మోడీ సర్కారు పదేండ్లు నిద్ర నటించింది. ఇప్పుడే మేల్కొన్నట్టు... అసలు మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదమే తెలుపలేదంటూ 'కొంగ జపం' లోంచి ఇప్పుడే మెలుకొచ్చినట్టు చెప్పుకొస్తున్నది. గడచిన పదేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని 'కాగ్' ఆక్షేపణలు చేస్తూనే ఉంది. మోడీ సర్కారు శ్రవణ దోషం పాటిస్తూనే ఉంది. అసలు ఈ ప్రాజెక్టుల కథ ఏంటి? కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల వాదనల్లో బలమేంటి? ఈ రెంటినీ ఒకే చోట...వేర్వేరుగా పాఠకుల ముందు ఉంచే ప్రయత్నాన్ని 'నవతెలంగాణ' చేస్తుంది.



## ప్రజలపైనే భారాలు
### సారంపల్లి మల్లారెడ్డి
సాగునీటిరంగ నిపుణులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర రైతాంగానికి నీరు కావాలి. ప్రజలకు తాగునీరు కావాలి. ప్రభుత్వాల నిర్ణయాలు దానికి తగినట్టు ఉండాలి. శాస్త్రీయత లేకుండా ప్రాజెక్టులు కడితే ప్రజలపైనే అంతిమంగా ఆర్థిక భారాలు పడతాయి. రీ డిజైనింగ్ వల్ల ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగింది. ఒక్క ఎకరాకు సాగునీటి వ్యయం రూ.46,364 కి చేరింది. రాజకీయపార్టీలు ఈ అంశంలో ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. ఫలితంగా వాస్తవాలు మరుగున పడిపోతున్నాయి. 'కాళేశ్వరం'పై 'కాగ్' పదేండ్లుగా మొత్తుకుంటూనే ఉంది. పట్టించుకున్న నాధుడులేడు. అప్పుడే కాగ్ నివేదికను విశ్లేషించుకొని ఉంటే, పరిస్థితులు మరోలా ఉండేవి. ప్రజలపై ఆర్థిక భారాలు ఉండేవి కావు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఎత్తిపోతలకే 4,800 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది.

## ఎలివేటెడ్ కారిడార్లకు
# లైన్‌క్లియర్
### భూముల బదలాయింపునకు రక్షణ శాఖ ఓకే
- హైదరాబాద్- రామగుండం-నాగ్‌పూర్ హైవేకూ గ్రీన్‌సిగ్నల్
- ఉత్తర తెలంగాణకు విస్తరించనున్న రవాణా సదుపాయాలు
- కేంద్ర రక్షణ శాఖ మంత్రికి సీఎం రేవంత్ కృతజ్ఞతలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్- నాగ్‌పూర్ జాతీయ రహదారిపై ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ అనుమతి ఇచ్చింది. హైదరాబాద్‌లోని డిఫెన్స్ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి లైన్‌క్లియర్ అయింది. జనవరి 5వ తేదీన ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి డిఫెన్స్ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతించాలని లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఇందుకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి శుక్రవారం అంగీకరించింది. వెంటనే అనుమతులు జారీ చేసింది. హైదరాబాద్ నగర అభివద్ధికి అత్యంత కీలకమైన అనుమతులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్-రామగుండంను కలిపే రాజీవ్ రహదారిలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగు రోడ్డు జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల నిర్మాణానికి మొత్తంగా 11.30 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల భూమి అవసరమని రక్షణ శాఖ మంత్రికి విజప్తి చేశారు. నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్-44)పై కండ్లకోయ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ మొత్తంగా 18.30 కిలోమీటర్ల ...5లో



## రైతులకు దన్నుగా నిలవడమే ధ్యేయం
### సీఎం రేవంత్ రెడ్డి
- పీఎంఎఫ్‌బీవై సీఈవో, కేంద్ర సంయుక్త కార్యదర్శి రితేష్ చౌహాన్‌తో భేటీ
- ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలోకి తిరిగి తెలంగాణ

వివరాలు 3లో



## పగ, కోపం ఉంటే మాపై తీర్చుకోండి
### కాంగ్రెస్ ప్రభుత్వానిది చిల్లర ప్రచారం
### మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో చూపిస్తున్నారు..
- వరద వచ్చేనాటికి బ్యారేజీని పునరుద్ధరించాలి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రాజెక్టు పరిశీలించిన బీఆర్‌ఎస్ బృందం
- కుంగిన 20వ పిల్లర్‌ను పరిశీలించని నేతలు

నవతెలంగాణ-భూపాలపల్లి

"కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారం చేస్తోంది.. రాష్ట్రం, రైతులపై పగ పెట్టుకోవడం సరికాదు.. రాజకీయంగా తమపై కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయాలి.. వర్షాకాలం వరద వచ్చేనాటికి మేడిగడ్డ బ్యారేజ్‌ని పునరుద్ధరించాలి" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. నీళ్ల లేక ఎండిపోతున్న పంటలను కాపాడాలని, 1.6 కిలోమీటర్ విస్తీర్ణంగల బ్యారేజ్‌లో కేవలం 50 మీటర్ల పరిధిలో సమస్య ఉందని దానిని పరిష్కరించాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ బ్యారేజ్‌ను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ సందర్శించారు. కుంగిన 20వ పిల్లర్ దగ్గరకు చేరుకున్నప్పటికీ క్షుణ్ణంగా పరిశీలించకుండా వెనుతిరిగారు. అన్నారంలో మాజీ మంత్రి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రాజెక్టుపై పవర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ.. వాస్తవాలు తెలియజేసేందుకే చలో మేడిగడ్డ పర్యటనకు వచ్చామన్నారు. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ను సందర్శించామని చెప్పారు. 1.6 కిలోమీటర్ల ...5లో


13లో

## జెండా పాటకు భిన్నంగా ధర
### ఖమ్మం మార్కెట్లో మిర్చి రైతుల ఆందోళన
- ప్రధాన గేటు ఎదుట బైఠాయింపు
- నిలిచిన కొనుగోళ్లు..వ్యాపారుల తీరుపై ఆగ్రహం

14లో

## 1న జీతాలు పడ్డాయ్
### ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పింఛన్ జమ



## బీఆర్‌ఎస్ పాపాల్లో బీజేపీకీ పాత్ర
### అలయ్‌బలయ్‌తోనే లక్ష కోట్ల రుణం : మంత్రి ఉత్తమ్ విమర్శ
- ఎల్‌అండ్‌టీకి రూ.400 కోట్లు ఆపాం
- బాధ్యులపై క్రిమినల్ చర్యలు
- ఎన్‌డీఎస్‌ఏ విచారణను స్వాగతిస్తాం
- నెలలోనే ప్రాథమిక నివేదిక
- మరికొంత మంది ఇంజినీర్లపై చర్యలు
- వర్షాకాలానికి ముందే మరమ్మత్తులు
- ఆ రుణాలన్నీ కేసీఆర్,కేటీఆర్ కట్టాల్సిందే...

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్‌ఎస్ సర్కారు పాపాల్లో బీజేపీకి కూడా పాత్ర ఉందని రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు, అభివృద్ధి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఎమ్మెల్యే బి.లక్ష్మిరెడ్డితో కలిసి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆ రెండు పార్టీల మధ్య అలయ్‌బలయ్ ఉందనీ, అందుకే రూ. లక్ష కోట్ల రుణం వచ్చిందని గుర్తు చేశారు. మేడిగడ్డ నిర్మాణలోపం నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ కంపెనీకి చెల్లించాల్సిన రూ.400 కోట్ల బిల్లులను ఆపామని ప్రకటించారు. కాళేశ్వరంపై విజిలెన్స్ నివేదిక అందిందనీ, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. జరిగిన నష్టానికి ఇరిగేషన్‌లో ఉన్న రుణాలను కేసీఆర్, కేటీఆర్‌లే కట్టాలని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ వెళ్లిన బీఆర్‌ఎస్ లీడర్లు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.తుమ్మిడ హెట్టివద్ద నీళ్ల లేవని అసత్య ప్రచారం చేశారనీ, అక్కడ 160 టీఎంసీల మేరనీళ్లున్నట్టు సీడబ్ల్యూసీ చెప్పిందని అన్నారు. మేడిగడ్డ..ఓ బొందల గడ్డ ఏం పీకపోతరు అన్నారనీ, ఇప్పుడు ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ లీడర్లు కమీషన్లకు కక్కుర్తిపడి తెలంగాణ ప్రజలు, రైతుల భవిష్యత్‌ను పణంగా పెట్టారని అన్నారు. మేడిగడ్డ విచారణకోసం ఎన్డీఎస్‌ఏ కమిటీ వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎన్డీఎస్‌ఏ ఏ సమాచారం అడిగినా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తాను ...13లో





## ముగ్గురు కార్మికుల ఆత్మహత్యాయత్నం
### నల్లగొండ జిల్లా ఆస్పత్రిలో ఘటన
- సమస్య అంతా మంత్రిని కలవడం వల్లే..
- కక్షతో కార్మికులను తొలగించిన ఏజెన్సీ
- కాంట్రాక్ట్ ఏజెన్సీని తొలగించాలని సిబ్బంది డిమాండ్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అవినీతి, అక్రమాల విషయంతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. కొద్దిరోజుల కిందట జీజీహెచ్ సూపరింటెండెంట్ లచ్చు నాయక్ ఓ కాంట్రాక్టర్ నుంచి మూడు లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన వార్త రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తాజాగా శుక్రవారం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ముగ్గురు ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆత్మహత్యాయత్నం చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..

నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సాయి సెక్యూరిటీ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ కింద కార్మికులు పని చేస్తున్నారు. కొన్నేండ్ల నుంచి నల్లగొండ పట్టణానికి చెందిన వల్కి లలిత, మారం నాగమణి ...13లో

# అసంతృప్తులు..ఆధిపత్యపోరు
## అభ్యర్థుల ప్రకటన వేళ బీజేపీలో గందరగోళం

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటన సందర్భంగా చెలరేగిన మాదిరిగానే పార్లమెంట్ అభ్యర్థుల విషయంలోనూ బీజేపీలో నిరసనల పర్వం మొదలైంది. ఒకరిని అభ్యర్థిగా ప్రకటిస్తే మరొక నేత సహకరించని పరిస్థితిలో జాతీయ నాయకత్వం అభ్యర్థిత్వాలపై ఎటూ తేల్చలేకపోతున్నది. తన రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టి బీజేపీలో చేరిన ఈటల రాజేందర్ ఇప్పుడు అందరికీ టార్గెట్ అవుతున్నారు. ఆదిలాబాద్ సీటు నాకంటే నాకంటూ నలుగురు నేతలు పట్టుబడుతున్నారు. జహీరాబాద్, నాగర్‌కర్నూల్, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్ నుంచి చేరిన నేతలే అభ్యర్థులుగా ఉంటారనే చర్చ నడుస్తుండగా మొదటి నుంచీ పార్టీనే నమ్ముకుని పోటీ కోసం సన్నద్ధం అవుతున్న నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

- మల్కాజిగిరి హాట్‌టాపిక్..ఈటల టార్గెట్
- ఆదిలాబాద్ సీటుపై ముాదుముక్కలాట
- నాగర్‌కర్నూల్‌లో పాతనేతల అసంతృప్తి
- జహీరాబాద్ నియోజకవర్గ బరిలో బీఆర్‌ఎస్ తాజా ఎంపీ
- ఒకరికిస్తే మరొకరు సహకరించలేని పరిస్థితి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మల్కాజ్ గిరి నియోజకవర్గం బీజేపీలో హాట్ సీట్ గా మారింది. ఆశావాహ నేతలు సీటు తమకంటే తమకే దక్కుతుందంటూ అని ప్రచారం చేసుకుంటున్నారు. హేమాహేమీలు ఆ స్థానం కోసం పోటీ పడుతున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు సైలెంట్‌గా ప్రచారం, వాల్‌రైటింగ్ లాంటి పనులు చేసుకుంటూ పోతున్నారు. ఇటీవల ఈటల రాజేందర్ తనకే సీటు ఖరారైందని శామీర్ పేటలోని తన నివాసంలో పలువురు నేతలతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ పెట్టడంతో ఆయనపై స్థానిక నేతలు తిరుగుబావుట ఎగురవేశారు. సీటు ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీహోంమంత్రి దేవేందర్‌గౌడ్ కుమారుడు వీరేందర్‌గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు పన్నాల హరీశ్‌రెడ్డి, ప్రముఖ విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య, చాడ సురేశ్‌రెడ్డి, తదితర నేతలంతా ఈటలకు సీటు ఇవ్వొద్దనే చర్చను తెరపైకి తీసుకొచ్చారు. రెండు అసెంబ్లీ టికెట్లు ఇచ్చినా ఆయన గెలువలేకపోయాడనీ, మళ్లీ పార్లమెంట్ టికెట్ ఆయనకే ఇస్తే తమ పరిస్థితి ఏంటని పార్టీ నాయకత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారు. అంతిమంగా మల్కాజిగిరిలో ఎవ్వరికి సీటిచ్చినా మరొకరు మనస్ఫూర్తిగా సహకరించలేని ధైన్యపరిస్థితి నెలకొంది. ఈటలవైపే జాతీయ నాయకత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ రాష్ట్రంలోని కొందరు కీలక నేతలు ఈటలకు సీటు దక్కకుండా చక్రం తిప్పుతున్నారనే చర్చ నడుస్తున్నది. ఈ నేపథ్యంలో కమలం పార్టీ అధిష్టానం ఈ సీటును తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈటలను మెదక్‌కు పంపితే ఎలా ఉంటుందనే విషయంపైనా జాతీయ నాయకత్వం చర్చిస్తున్నట్టు తెలిసింది. తనకు సీటురాదనే స్పష్టతకొచ్చిన కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ ...3లో

## నిమిషం నిబంధన ఎత్తివేత
- ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్
- 8.45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి : విద్యార్థులకు ఇంటర్ బోర్డు సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు అమలు చేస్తున్న నిమిషం నిబంధనను ప్రభుత్వం ఎత్తేసింది. ఉదయం తొమ్మిది గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్ ఇస్తున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే నిర్దిష్ట కారణాల వల్ల ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షా ...5లో

## ఈసారి భగ భగే!
- తెలుగు రాష్ట్రాలు సహా పలుచోట్ల వడగాడ్పులు ఉధృతి
- భారత్‌లో ఎల్‌నినో పరిస్థితులపై వాతావరణ శాఖ అంచనాలు

5లో..

# నిధులివ్వరు.. పనులు సాగవు

## "పాలమూరు- రంగారెడ్డి" పురోగతిపై నీలినీడలు

### తొమ్మిదేండ్లు కావస్తున్నా పూర్తికాని పనులు

- ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా పూర్తి చేసేనా ?

మూడేండ్లలో పూర్తి చేస్తామన్న పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు పనులు మూడు ప్రభుత్వాలు ఏర్పాటైనా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. 2015 జూన్ 11న అప్పటి సీఎం కేసీఆర్ ప్రాజెక్టుకు భూత్పూరు మండలం కర్వేన దగ్గర భూమి పూజ చేశారు. ప్రాజెక్టు పూర్తయితే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, కరువు ఛాయలు దరిదాపుకే రావన్నారు. అయితే గత పాలకులు నిధుల కేటాయింపులో వివక్ష చూపడం వల్ల మూడేండ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు తొమ్మిదేండ్లయినా.. 60 శాతం పూర్తి కాలేదు. దక్షిణ తెలంగాణ ప్రాజెక్టుల్లో పురోగతి లేదని కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టుల సందర్శన చేసిన సందర్భంగా 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం.



**నిలిచిన పనులు**

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనులు నిధులు లేక నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వ మైనా చర్యలు తీసుకుంటుందేమోనని ఆశతో రైతు లు ఎదురు చూస్తున్నారు. వట్టెం దగ్గర రిజర్వాయరు పనులు నిలిచిపోయాయి. కట్ట పనులు సైతం ఆగి పోయాయి. కాల్వ పనులు జరగాల్సి ఉంది. తిమ్మాజీపేట వట్టెం మధ్య ఉన్న ప్రధాన కాల్వ బ్రిడ్జీల నిర్మాణం జరగాల్సి ఉంది. ఉద్దండపూర్ రిజర్వాయర్ పనులు పాక్షికంగా జరిగి నిలిచిపోయాయి. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులిస్తేనే పనులు పూర్తవుతాయి. బడ్జెట్‌లో కేటా యించిన నిధులను పూర్తిస్థాయిలో వినియో గిస్తే .. ప్రాజెక్టు పనుల్లో వేగం పెరిగే అవకాశాలున్నాయి.

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

90 టీఎంసీల సామర్థ్యం.. 12 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదలు పెట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్‌లో 7 లక్షల ఆయకట్టు, రంగారెడ్డి జిల్లాలో 2.7 లక్షలు, నల్లగొండ జిల్లాలో 0.3 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. రోజుకు ఒకటిన్నర టీఎంసీల చొప్పున 8 రోజులు 90 టీఎంసీలను ఎత్తిపోయాల్సి ఉంది. సముద్ర మట్టానికి 269.735 మీటర్ల ఎత్తున ఉన్న లక్ష్మీదేవిపల్లి వరకు నీటిని పంపింగ్ చేయాల్సి ఉంది. అయితే మొదటి రిజర్వాయరైన అంజనగిరి, రెండో రిజర్వాయరు ఏదులను పూర్తి చేశారు. వీటి పరిధిలో స్ట్రక్షర్, బ్రిడ్జీల నిర్మాణం జరగాల్సి ఉంది. నార్లాపూర్‌లో 8.51 టీఎంసీల రిజర్వాయరు పూర్తి చేసినా.. ఇంకా ఈ ప్రాంత వాసులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందజేయలేదు. ఏదుల సమీపంలో వీరాంజనేయ రిజర్వాయరును 8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. వట్టెం రిజర్వాయరును 16.74 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఇక్కడ 4,88,000 ఎకరాల ఆయకట్టు సాగవ్వాలి. కర్వేనా దగ్గర కురు మూర్తి రాయ రిజర్వాయర్‌ను 16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఇక్కడ 1.90 లక్ష ఎకరాల ఆయకట్టు ఉంది. ఉద్దండపూర్ రిజర్వాయరును 16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఆయకట్టు 4,88,000 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, వీటి పనులు ముందుకు సాగడం లేదు.

**ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలి**

పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల విషయంలో జాప్యం తగదు. నిధుల కేటాయింపులోనూ వివక్ష చూపుతున్నారు. ఇప్పటికైనా నిధులు కేటాయించాలి. నీళ్లు లేక భూములు బీళ్లుగా మారుతున్నాయి. రిజర్వాయర్లను నింపి ఆయకట్టుకు సాగు నీరవ్వాలి.

శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్


**FORM - IV**

**(Rule 8)**

Statement about ownership and other particulars about newspaper **NAVATELANGANA SAMAGRA TELUGU DINAPATRIKA.**

| | | |
|---|---|---|
| 1. | Place of publication | : **Karimnagar**, Hyderabad, Rangareddy, Khammam. |
| 2. | Periodicity of its publication | : Daily |
| 3. | Printer's Name | : Nandayala Narsimha Reddy |
| | Nationality | : Indian |
| | Address | : M.H.Bhavan, 1st Floor, Plot. No.21/1, Azamabad, Near RTC Kalyana Mandapam, Baghlingampally Hyderabad-500020, Telangana State. |
| 4. | Publisher's Name | : Nandayala Narsimha Reddy |
| | Nationality | : Indian |
| | Address | : M.H.Bhavan, 1st Floor, Plot. No.21/1, Azamabad, Near RTC Kalyana Mandapam, Baghlingampally Hyderabad-500020, Telangana State. |
| 5. | Editor's Name | : R. Sudha Bhaskar |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-549 and 549/1, Flat No. 504, Udaya Aditi Apts, Jawaharnagar, Musheerabad, Hyderabad-500020. Telangana State. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one percent of the total capital. | : Navatelangana Printers Pvt Ltd. 1. Mallareddy Sarampally S/o. S. Krishna Reddy # 1-1-2/D/F, Jawahar Nagar, Musheerabad, Hyderabad-500020. 2. Prabhakar Panguluri S/o. Krishnaiah #1-2-606/80, LIC Colony, Indira Park, Hyderabad-500080. 3. Ramulu Chukka S/o. CH. Narasaiah, # 2-1/73, Near Takie Town Theater, Widia Colony, Sundaraiah Nagar, Miyapur-500049. 4. M.H.Bhavan, 1st Floor, Plot. No.21/1, Azamabad, Near RTC Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State. 5. Nagaiah Gollapelli S/o. G. Veeraiah # 1-7-1831/153, Ambedkar Nagar, Balasamudram, Hanamkonda, Warangal-506001. |

I, **Nandayala Narasimha Reddy** hererby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**Nandayala Narasimha Reddy**
Publisher

Date: 01-03-2024




## కేటీఆర్ దమ్ముంటే నిజామాబాద్ ఎంపీగా పోటీ చేయ్..

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ- జగిత్యాలటౌన్

కేటీఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేయాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలోని ఇందిరా భవన్‌లో మీడియాతో ఎమ్మెల్సీ మాట్లాడారు. అధికారం కోల్పోయినా కేటీఆర్‌కు ఇంకా జ్ఞానోదయం కావడం లేదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ తన స్థాయి మరిచిపోయి సీఎం రేవంత్ రాజీనామా చేసి మళ్లీ పోటీకి రావాలంటూ సవాలు విసరడం హాస్యాస్పదం అన్నారు. ఎమ్మెల్యే పదవి, సీఎం పదవి ఒక్కటేనా అని నిలదీశారు. కేటీఆర్‌కు రేవంత్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు.

మొన్నటి వరకు బీఆర్ఎస్ మెదక్ ఎంపీ సీటు అయినా గెలుస్తుందేమో అని అనిపించేదని. ఇప్పుడు కేటీఆర్ వైఖరితో మెదక్ కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే పెన్షన్ రాదని అసత్య ప్రచారం చేశారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు టీఎంసీలు ఉపయోగించకుండా మరో అదనపు టీఎంసీ కోసం అనుమతులు లేకుండా చేపట్టడం నేరమని తెలిపారు. తుమ్మిడి హెట్టీ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఒక్క లిఫ్ట్‌తో ఎల్లంపల్లికి నీరు చేరేదని కేంద్ర జలవనరుల శాఖ నిపుణులు వేదిర శ్రీరామ్ నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. మెడిగడ్డ పిల్లర్లు కుంగడం టెక్నికల్ లోపమని, ఇకనైనా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు జ్ఞానోదయం కావాలని విమర్శించారు. సమావేశం అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థినికి గాయాలు

- చికిత్స చేయించి పరీక్షాకేంద్రానికి తీసుకెళ్లిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్



నవతెలంగాణ-బేగంపేట్

ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి ఓ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రథమ చికిత్స చేయిం చి సమయానికి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. వివరాల్లోకెళ్తే.. శుక్రవారం హైదరాబాద్‌లో ఓ విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాసేందుకు తండ్రితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. సికింద్రాబాద్ ఎంజీ రహదారిలోని తపస్య కళాశాల వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. దాంతో విద్యార్థిని తలకు గాయాలయ్యాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపాశంకర్ గమనించి వెంటనే తన వాహనంలో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడ ఆమెకు ఏడు కుట్లు పడ్డాయి. అనంతరం పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ అనుమతి తీసుకుని విద్యార్థినిని సమయానికి తిరిగి పరీక్ష కేంద్రంలో వదిలిపెట్టారు.

## జెడ్పీ ఆడిటింగ్ సెక్షన్‌లో అగ్నిప్రమాదం

- దగ్ధమైన ముఖ్యమైన ఫైళ్లు ..ఘటనపై పలు అనుమానాలు



నవతెలంగాణ -నల్లగొండ టౌన్

నల్లగొండ జెడ్పీ ఆడిటింగ్ సెక్షన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ముఖ్యమైన ఫైళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదమా.. లేదంటే కుంభ కోణాలు బయట పడకుండా అవినీతిపరులు చేసిన కుట్రనా అని పలువురు చర్చించుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ పట్టణంలోని పాత జిల్లా పరిషత్ భవనంలో ఆడిటింగ్ సెక్షన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ముఖ్యమైన రికార్డులతోపాటు ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయింది. సిబ్బంది గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘ టనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపుచేసింది. అప్పటికే రికార్డులు పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు పలు కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. గతంలో కూడా నల్లగొండ మున్సిపల్ ఆఫీస్‌లో అక్రమాలు బయట పడకుండా ఫైళ్లను తగలబెట్టారు. విషయాన్ని బయటికి పొక్కకుండా సిబ్బంది ప్రయత్నం చేశారు.

## ఈ నెల 15 వరకు మ్యానిఫెస్టోపై సలహాలు

- 9090902024కు సందేశాలు పంపొచ్చు : రాంచందర్ రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ మ్యానిఫెస్టో రూపకల్పన కోసం ఈ నెల 15 వరకు ప్రజల నుంచి సలహాలు, సూచనలను తీసుకుంటామనీ, ఆసక్తిగల వారు 9090902024 కు మిస్డ్‌కాల్ చేసి సందేశాన్ని పంపాలని బీజేపీ నేత రాంచందర్‌రావు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రజల నుంచి సూచనలను స్వీకరించేందుకు ఎల్ఈడీ వ్యాన్ తిరుగుతుందని చెప్పారు. బీజేపీ కార్యకర్తలతో కాకుండా మేధావులు, గ్రామ, కుల పెద్దలు, మహిళలు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ఇలా ప్రతి ఒక్కరినీ కలిసి అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. నమోయాప్‌లో కూడా సూచనలను నమోదు చేయవచ్చునన్నారు.

# ఉద్యోగాలిస్తామంటూ...

## వర్క్ ఫ్రమ్ హోం, పార్ట్‌టైం జాబ్స్ పేరుతో గాలం

- ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు
- ముగ్గురు సైబర్ నిందితుల అరెస్ట్




నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్క్ ఫ్రమ్ హోం, పార్ట్‌టైం పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు సైబర్ నిందితులను వేర్వేరు కేసుల్లో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి చెక్‌బుక్స్, క్రెడిట్, డెబిట్ కార్డ్స్, వివిధ బ్యాంక్‌లకు చెందిన చెక్‌బుక్స్, సిమ్ కార్డులు, ల్యాప్‌టాప్స్‌తోపాటు రూ.5లక్షలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ డి.కవిత వివరాలు వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన అబ్దుల్లా ఫరూక్ జుంజున్యా, ముంబయ్‌కి చెందిన మహమ్మద్ సోహ్యాబ్ బబ్లూఖాన్ ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. ప్రముఖ కంపెనీల్లో పార్ట్‌టైమ్, వర్క్ ఫ్రం హోం ఉద్యోగాలిపిస్తామని పలువురికి గాలం వేస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా కమీషన్లపై బ్యాంక్ ఖాతాలు సేకరిస్తున్నారు. ఉద్యోగం కోసం ఎవరైనా స్పందిస్తే నమ్మకం కుదిరేందుకు బోనస్‌గా రూ.500 పంపిస్తున్నారు. ఆ తర్వాత ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు. ఇదే తరహాలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని టార్గెట్ చేసిన సైబర్ నిందితులు వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా మెసేజ్ పెట్టారు. కొద్దిరోజులు చాటింగ్ చేశారు. నమ్మకం కుదిరేందుకు రూ.500ను బాధితునికి పంపించారు. దాంతో వారిని పూర్తిగా నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా చేశాడు. దాంతో సైబర్ నిందితులు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.2,38,405 కొట్టేశారు. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడిన నిందితులపై 42 కేసులున్నాయని, దాదాపు రూ.4.5కోట్లను కొట్టేశారని తెలిపారు. నిందితులపై తెలంగాణలో ఆరు కేసులు నమోదుకాగా, హైదరాబాద్‌లో మూడు కేసులు, రాచకొండలో ఒక కేసు, సైబరాబాద్ కమిషనరేట్ లో రెండు కేసులున్నాయని డీసీపీ తెలిపారు. దేశవ్యాప్తం గా మోసాలకు పాల్పడుతున్న నిందితులపై ఫిర్యాదు రావడంతో సీసీఎస్ పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. సమావేశంలో ఏసీపీ శివమారుతీ, ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐ శైలేందర్ ఉన్నారు.

**మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలు**

మల్టీనేషనల్ కంపెనీల్లో(ఎంఎన్‌సీ)లో ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసిన మరో నిందితుడిని కూడా సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. బాచుపల్లికి చెందిన కె.సీతయ్య ఆన్‌లైన్ గేమింగ్‌లో నష్ట పోయాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మోసాలపై దృష్టిసారించాడు. ఎరిక్సన్ గ్లోబల్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్ట్ ఉద్యోగాలున్నాయని పలువురిని నమ్మించాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన పవన్ కుమార్ నుంచి రూ.2.50లక్షలు దండుకున్నాడు. అతన్ని నమ్మించేందుకు నకిలీ జాబ్ ఆఫర్ లెటర్ పంపించాడు. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేశారు.

## ఎమ్మెల్యే లాస్య నందిత డ్రైవర్ ఎక్కడ..?

- అజ్ఞాతంలో డ్రైవర్ ఆకాష్!

నవతెలంగాణ-కంటోన్మెంట్




కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రమాదం సమయంలో ఆమె కారు నడిపిన డ్రైవర్ ఆకాష్ ఆచూకీ తెలియడం లేదు. ప్రస్తుతం అతను అజ్ఞాతంలో ఉన్నట్టు తెలుస్తోంది. రోడ్డు ప్రమాదం జరిగిన ప్పుడు తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఆకాష్ హైదరాబాద్ మియాపూర్ మదిన గూడా స్వీకర హాస్పిటల్‌లో చికిత్స పొంది గత ఆదివారమే డిశ్చార్జ్ అయ్యాడు. అయితే అప్పటి నుంచి అతను అజ్ఞాతంలోనే ఉన్నాడు. అతను ఎక్కడ ఉన్నా డు అనేది తెలియకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. పరిసర ప్రాంతాలలో ఉంటే తనకు ఎమ్మెల్యే అభిమానుల ద్వారా ఏమైనా ప్రాణా పాయం ఉంటుందన్న కారణంతో ఆకాష్ ఎవరికీ తెలియకుండా దూరంగా ఉంటున్నట్టు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే లాస్య నందిత సోదరి నివేదిత పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఆకాష్‌పై కేసు పెట్టిన విషయం తెలిసిందే. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## బీజేపీలో చేరిన ఎంపీ బీబీ పాటిల్

- జహీరాబాద్ ఎంపీగా రెండు సార్లు విజయం
- బీఆర్ఎస్‌కు బలమైన అభ్యర్థి దొరికేనా..?



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఓటమిని తట్టుకోలేకపోతున్నారు. అధికారంలో ఉంటే తప్ప తమ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలను కాపాడుకోవడం కష్టమనే భావనలో ఉన్నారు. ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. అధికారంలో ఉండేందుకు తమకు అనువైన పార్టీని ఎంచుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు పార్టీకి రాజీనామాలు చేశారు. ఇప్పటికే పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ ఎంపీలిద్దరూ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఒకరు కాంగ్రెస్, మరొకరు బీజేపీలో చేరారు. తాజాగా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. రాబోయే ఎన్నికల్లో కమలం పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

బీఆర్ఎస్ వరుసగా గెలుస్తూ వస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి సిట్టింగ్ ఎంపీలు పార్టీని వీడటం శ్రేణుల్ని సేతం కలవరపరుస్తోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన 9 మంది ఎంపీలకుగాను ఇప్పటికే ముగ్గురు ఎంపీలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు కొత్త అభ్యర్థుల్ని వెతుక్కునే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సొంత జిల్లా ఉమ్మడి మెదక్ పరిధిలో ఉన్న జహీరాబాద్, మెదక్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ ఎంపీల్లేకుండా పోయారు. దీంతో కొత్త అభ్యర్థుల్ని వెతుక్కోవాల్సి వచ్చింది. పార్టీ బలంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిపుష్టి, ప్రజాధరణ కల్గిన బలమైన అభ్యర్థుల్లేకపోతే పార్టీకి ఎదురు దెబ్బ తప్పదని పలువురు బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా సిర్పూర్‌కు చెందిన భీమారావు బసవంతరావు (బీబీ పాటిల్) 2014లో అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. 2014, 2019 ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి రెండుసార్లు గెలుపొందారు. మూడోసారి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆయన బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను కేసీఆర్‌కు పంపారు. పార్టీలో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే బీబీ పాటిల్ కొంత అసంతృప్తితో ఉన్నారు. పార్టీ ఓడిపోవడంతో కార్యక్రమాలకు మరింత దూరంగా ఉంటూ వచ్చారు. 2019 ఎన్నికల్లో ఆయన స్వల్ప ఓట్ల తేడాతోనే గెలిచారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం కోల్పోయినందున వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలవడం కష్టంగా భావించి.. ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు మొగ్గు చూపినట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

**ఎంపీ టికెట్.. వ్యాపార పరిరక్షణ**

జహీరాబాద్ ఎంపీగా రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నుంచి గెలిచిన బీబీ పాటిల్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీ టికెట్ కన్ఫమ్ చేసినట్టు తెలుస్తోంది. అందుకే ఆయన ఆ పార్టీలో చేరారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్‌తో పాటు బాన్సువాడ, జక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో బీఆర్ఎస్ జహీరాబాద్ ఎమ్మెల్యే సీటు మాత్రమే గెలిచింది. కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే గెలిచారు. ఏడు నియోజకవర్గాల్లోనూ లింగాయత్‌ల ఓట్లు బలంగా ఉన్నాయి. వీరంతా కూడా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారనే అంచనాలతో పాటిల్ కమలం పార్టీ వైపు అడుగులేశారంటున్నారు. రాజకీయ ప్రయోజనాలే కాకుండా ఆయన 'పాటిల్' కంపెనీకి మహారాష్ట్రలో అనేక వ్యాపారులున్నాయి. ఆర్థిక ప్రయోజనాల రీత్యా కూడా బీజేపీ సేఫ్‌గా బీబీ పాటిల్ భావించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# వైద్యారోగ్యశాఖలో విచారణల పర్వం

- ఉద్యోగుల మధ్య వివాదంపై ఎంక్వైరీ
- డీసీహెచ్ఎస్‌పై ఉద్యోగుల ఫిర్యాదుపైనా..

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ఖమ్మం

ఖమ్మం జిల్లా వైద్యారోగ్య శాఖలో విచారణల పర్వం కొనసాగింది. ప్రస్తుతం సెలవులో ఉన్న డీఎంహెచ్‌వో మాలతి హయాంలో శాఖలోని కొందరు ఉద్యోగుల మధ్య చోటుచేసుకున్న వివాదాల పై శుక్రవారం విచారణ నిర్వహించారు. మరోవైపు డీసీహెచ్ బి.వెంకటేశ్వర్లుపై వచ్చిన అభియోగాలపై మెడికల్ అండ్ హెల్త్ కమిషన్ అధికారులు విచారణ చేశారు.

**ఉద్యోగుల వివాదంపై..**

73% వైకల్యం పేరుతో 2018 నుంచి విధులు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్, ఆ సెక్షన్ (ఈ3)కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సీనియర్ అసిస్టెంట్ మధ్య నెలకొన్న వివాదంపై విచారణ చేశారు. సెక్షన్ ఇన్‌చార్జిపై ఆరోపణలు చేయడంతోపాటు తన భార్య చేత మైనార్టీ కమిషన్‌కు హెల్త్ సూపర్‌వైజర్ ఫిర్యాదు చేయించాడు. ఈ నేపథ్యంలో ఈ విచారణ బాధ్యతను గత డీఎంహెచ్‌వో డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులుకు అప్పగించారు. విచారణకు హాజరు కావాల్సిందిగా హెల్త్ సూపర్‌వైజర్, ఆయన భార్యకు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మూడుసార్లు నోటీసులు అందాయి. తొలి రెండు సందర్భాల్లో హెల్త్ సూపర్‌వైజర్ అనారోగ్య కారణాలు చూపగా.. ఆయన భార్య ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా విచారణకు హాజరు కాలేదు. ఈలోగా నకిలీ సర్టిఫికెట్లతో వైద్యారోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై 'నవతెలంగాణ'లో కథనం రావడం.. ఆ వెంటనే ఇంటెలిజెన్స్ విభాగం నిఘా పెట్టడంతో సంబంధిత నకిలీ ఉద్యోగులు, ఆ సర్టిఫికెట్లు జారీ చేసిన అధికారుల్లో వణుకు మొదలైంది. హెల్త్ సూపర్‌వైజర్ ఆయన భార్యతో సెక్షన్ ఇన్‌చార్జిపై అక్టోబర్‌లో ఫిర్యాదు చేయించారు. నాటి నుంచి తాను విధులకు హాజరుకావడం లేదు. విచారణకు కూడా రావట్లేదు. కానీ సెక్షన్ ఇన్‌చార్జి మాత్రం విచారణకు వస్తుండటంతో హెల్త్ సూపర్‌వైజర్ ఫిర్యాదు పై సందేహాలు నెలకొన్నాయి. ఇదే అంశంపై పత్రిక ల్లో కథనాలు రావడంతో ఇంటెలిజెన్స్ నిఘా పెట్టింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో హెల్త్ సూపర్‌వైజర్, ఆయన భార్య చివరగా మూడోసారి శుక్రవారం నిర్వహించిన విచారణకు హాజరయ్యారు. ఇరుపక్షాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారించారు. విచారణ నివేదికను కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సమర్పించనున్నట్టు తెలిసింది.

**డీసీహెచ్‌పైనా విచారణ**

ఉద్యోగుల ఉద్యోగోన్నతి, ఆ తర్వాత రివర్షన్‌పై జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్) బి.వెంకటేశ్వర్లుపై ఉద్యోగుల ఫిర్యాదు మేరకు మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్ అధికారులు, రంగారెడ్డి జిల్లా డీసీహెచ్ డాక్టర్ సునిత, టీఎస్ఎంఐడీసీ ఇంజినీర్ శ్రీనివా స్, ఇద్దరు క్లర్క్‌లు విచారణ చేపట్టారు. డిగ్రీ అర్హతతో ఉద్యోగానికి ఎంపికైన జూనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఇచ్చి.. నిర్దేశిత సమయంలో వారు అర్హత సర్టిఫికెట్లు సమర్పించని నేపథ్యంలో రివర్షన్ ఇచ్చారు. వీరితో పాటు ఇంటర్మీడి యెట్ అర్హతతో రికార్డు అసిస్టెంట్‌లకూ ఉద్యోగోన్నతి కల్పించి.. అర్హతున్న వారికి సైతం రివర్షన్ ఇవ్వడంపై సంబంధిత ఉద్యో గులు కోర్టును, కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపైనా శుక్రవారం విచారణ కొనసాగింది. ఇరు పక్షాలను రాత్రి పొద్దు పోయే వరకు అధికారులు విచారించారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

# ఏది నిజం?

- నీళ్లు, ప్రాజెక్టుల చుట్టూ రాష్ట్ర రాజకీయం • పోటాపోటీగా సందర్శనలు
- జనాన్ని నమ్మించేందుకు పాట్లు : 'నవతెలంగాణ' వాస్తవాల విశ్లేషణ



## ఇదీ ప్రాణహిత-చేవెళ్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,600 కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత- చేవెళ్ల పథకాన్ని చేపట్టారు. 180 టీఎంసీల నీటిని ఎత్తిపోసి తెలంగాణ ప్రాంతంలోని 16.40 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించాలన్నది లక్ష్యం.

- కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నియంత్రణలోని వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (వ్యాప్కోస్) సంస్థ ద్వారా సర్వే చేశారు. దీనిలో ప్రాణహితపై తుమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని అంచనా వేశారు.
- తుమ్మిడిహట్టి నుంచి 116 కిలోమీటర్ల దూరంలోని గోదావరి నదిపై ఎల్లంపల్లి వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు నుంచి 20 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందనీ, మొత్తం 180 టీఎంసీల నీరు సాగుకు లభిస్తుందని సర్వేలో అంచనా వేశారు.
- తుమ్మిడిహట్టికి ముందు పెన్‌గంగా, వార్ధ, వెన్‌గంగా నదులు కలిసిన తరువాత ప్రాణహిత నదిగా పేరు మారింది. ఈ మూడు నదులు కలిసిన చోట ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మించాలి.
- ఈ డిజైన్ వల్ల కేవలం 1,250 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతుంది. 152 మీటర్ల ఎత్తు వరకు నిర్మించాలని అంచనా వేయగా, మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దీనితో ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్ల ఎత్తుకు తగ్గించుకోవడం జరిగింది.
- తుమ్మిడిహట్టి బ్యారేజ్‌లో 4.5 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది.
- తుమ్మిడిహట్టి నుంచి కజ్రాల్లీ 15 కి.మీ దూరంలో ఉంది. అక్కడి నుంచి సుర్గపల్లే 28.5 కి.మీ దూరానికి లిఫ్ట్ చేయాలి. ఈ ప్రాజెక్టు కింద 20,500 ఎకరాలు సాగు అవుతుంది.
- ఇక్కడి నుంచి 71.5 కి.మీ., దగ్గర మైలారం ప్రాజెక్టు నిర్మాణం చేయాలి. దీని కింద 36 వేల ఎకరాలు సాగు అవుతుంది.
- అక్కడి నుంచి 116 కి.మీ., దగ్గర కాల్వ తీయడం ద్వారా ఎల్లంపల్లిలో తుమ్మిడిహట్టి నీరు కలుస్తుంది.
- ఎల్లంపల్లి 148 మీటర్ల ఎత్తులో ఉంది. అందువల్ల తుమ్మిడిహట్టి నుంచి పెద్దగా నీటిని లిఫ్ట్ చేయాల్సిన అవసరం లేదు.
- ఈ ప్రాంతం అంతా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించింది.
- ఆదిలాబాద్ తూర్పు ప్రాంతంలోని తుమ్మిడిహట్టి - ఎల్లంపల్లి కాల్వను విస్తృత పర్చడం ద్వారా మరో లక్ష ఎకరాలకు అదనంగా నీరు ఇవ్వవచ్చు.
- అలా మొత్తం 1.56 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సౌకర్యం కలుగుతుంది.

## ఆ తర్వాత..

పై మూడు ఎత్తిపోతలకు 4,800 మెగవాట్ల విద్యుత్ కావాలి. 2021, 2022లోనూ వచ్చిన గోదావరి వరదల్లో ఇక్కడ నీటిని నిల్వ పెట్టలేకపోయారు. మొత్తం కాల్వలో 175 టీఎంసీల నీటిని మాత్రమే లిఫ్ట్ చేశారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లో 18 నుంచి 21 నెంబర్ పియర్స్ మూడడుగుల లోతుకు కుంగిపోయాయి. దీనితో మేడిగడ్డ బ్యారేజ్ మీదుగా తెలంగాణ నుంచి మహారాష్ట్రకు వెళ్లే రహదారిని మూసేశారు.

అదే సమయంలో అన్నారం బ్యారేజీకి బుంగ పడి ప్రాజెక్టు వెనుకకు పెద్ద ఎత్తున నీళ్ళు వచ్చాయి. శాసనసభ ఎన్నికల్లో సరిగ్గా పోలింగ్ రోజు ఆంధ్రప్రదేశ్ పోలీసులు బ్యారేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనితో కేంద్రం జోక్యం సీఆర్‌పీఎఫ్ బలగాల్ని మోహరించి, డ్యాం పటిష్టతపై 'డ్యాం సేఫ్టీ అథారిటీ'కి సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత మేడిగడ్డ, అన్నారం పగుళ్ళు మరింత విస్తరించాయి.

అక్కడి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల ప్రాజెక్టుల రాజకీయం, మధ్యలో బీజేపీ ఆరంగేట్రంను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

## బీఆర్ఎస్ సర్కార్ రీ డిజైన్

తుమ్మిడిహట్టి- ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసింది. తుమ్మిడిహట్టి వద్ద 180 టీఎంసీల నీటి లభ్యత లేదనీ, మహారాష్ట్ర ప్రభుత్వం 148 మీటర్లకే అంగీకరిస్తున్నదనీ, తుమ్మిడిహట్టి ఎగువన 60 టీఎంసీల మిగులు జలాల్ని మహారాష్ట్ర వాడుకుంటున్నందున ప్రాణహిత


- చేవేళ్ల పథకానికి నీటి లభ్యత ఉండదనే అభిప్రాయానికి వచ్చింది.
- వ్యాప్కో సంస్థ ద్వారా తుమ్మిడిహట్టి వద్ద సర్వే చేయించి నీటి లభ్యత లేనందున రీ డిజైన్‌లో ఆ ప్రాంతాన్ని మార్చాలని నిర్ణయించారు.
- కానీ 2015లో ఐదుగురు ఇంజనీర్ల బృందం (1.అనంతరాములు, 2, వెంకట్రామారావు, 3. చంద్రమౌళి, 4.దామోదర్‌రెడ్డి, 5.శ్యాంప్రసాద్‌రెడ్డి)తో కూడిన కమిటీ, ప్రాణహిత-చేవెళ్ళ లిఫ్ట్ పనులు చేపట్టాలనీ, రీ-డిజైన్ ద్వారా మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కడితే రూ.24 వేల కోట్ల అదనపు వ్యయం అవుతుందని నివేదిక ఇచ్చారు.
- ప్రాణహిత- చేవెళ్ళ ప్రాజెక్టులోని మిడ్‌మానేర్ వరకు రూ.15,634 కోట్లు మాత్రమే వ్యయం అవుతాయని, మేడిగడ్డను ఎంచుకుంటే రూ.8,366 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందని సలహా ఇచ్చారు.
- ఏరియల్ సర్వే, టోపోస్టడీ నిర్వహించి మహారాష్ట్రలోని పట్టా భూముల్ని నివారించడానికి మేడిగడ్డ వద్ద 105 మీటర్ల ఫుల్ రిజర్వాయర్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) డిజైన్ మాత్రమే సాధ్యం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.
- పైగా భూమిలోపల నిర్మాణాలు చేయాల్సి వస్తుందనీ, తాడిచెర్ల బొగ్గు బ్లాకులతో పాటు సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల మీదుగా పనులు చేపట్టాల్సి ఉంటుందనీ ఇంజినీర్ల కమిటీ పేర్కొంది.
- కమిటీ నివేదిక స్పష్టంగా ఇచ్చినప్పటికీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టికి బదులు మేడిగడ్డనే ఎంచుకుంది.
- గోదావరి నదికి ప్రాణహిత వచ్చి కలిసిన తరువాత మేడిగడ్డ వద్ద నీటి లభ్యత అదనంగా ఉంటుందని మేడిగడ్డను ఎంచుకున్నారు.
- మేడిగడ్డకు ఎల్లంపల్లి 108 కి.మీ. దూరంలో ఉంటుంది.
- మేడిగడ్డ ప్రాజెక్టును గోదావరి నదిపై వంద మీటర్ల ఎత్తులో 16.17 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించారు.
- దానికి ముందు 46.5 కి.మీ., దూరంలో గోదావరిపై 121 మీటర్ల ఎత్తులో అన్నారం బ్యారేజీని నిర్మించారు. దీని నీటి నిల్వ సామర్థ్యం 10.87 టీఎంసీలు
- అన్నారం నుంచి 31.60 కి.మీ., దూరంలో 132 మీటర్ల ఎత్తులో సుందిళ్ల బ్యారేజీని 8.80 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించారు.
- సుందిళ్ల నుంచి 31 కి.మీ., దూరంలో 148 మీటర్ల ఎత్తులో 20.17 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు.
- మేడిగడ్డ నుంచి అన్నారంకు, అన్నారం నుంచి సుందిళ్లకు, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పంపుల ద్వారా నీటిని సరఫరా చేయాలి.
- ఈ నాలుగు ప్రాజెక్టులు గోదావరి నదిపై ఉంటాయి. ఈ విధంగా రీ-డిజైన్ చేసి ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారు.

# విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- బీటీఏ డైరీ ఆవిష్కరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు, బలహీన వర్గాల పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో బీటీఏ డైరీని ఆయన ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు ప్రతిభను కనబర్చాలని సూచించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. బీటీఏ అధ్యక్షులు కల్వదర్శి చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా ఉన్న అడిక్విసీ జీవో నెంబర్ రెండును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్‌లోనే పై



చదువులు చదవడానికి అడ్డంగా ఉన్న మెమోను సవరిస్తూ 342 జీవోను గతంలో మాదిరిగానే జారీ చేయాలని సూచించారు.

ఈ విషయంపై స్పీకర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సలహాదారులు నాగారం యాదయ్య, కావలి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీశైలం, నాయకులు బి రాజ్‌కుమార్, కావలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూళ్లలో నియామకాలు చేపట్టాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి పీఎంటీఏటీఎస్ విజ్ఞప్తి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నోటిఫికేషన్, గురుకులాల్లో టీజీటీ, పీటీజీ, జేఎల్ వంటి పోస్టుల ఫలితాలను ప్రకటించడం పట్ల పీఎంటీఏటీఎస్ హర్షం ప్రకటించింది. మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయుల నియామకాల కోసం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్లు దాటినా మోడల్ స్కూళ్లలో నియామకాలు చేపట్టలేదని తెలిపారు. జేఎల్ పోస్టును అప్‌గ్రేడ్ చేయాలనీ, పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాల్ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

# అసంతృప్తులు..ఆధిపత్యపోరు

(మొదటి పేజీ తరువాయి)

నేతలతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తున్నది.

**ఆదిలాబాద్‌లో మూడుముక్కలాట**

ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి అభ్యర్థిత్వ ఎంపిక మూడుముక్కలాటలా తయారైంది. కాంగ్రెస్ పార్టీని కాదనుకుని బీజేపీలో చేరి ఆ స్థానం నుంచి గత ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన తుడుందెబ్బ నేత, ఎంపీ సోయం బాపూరావుకు ఈసారి సొంతింటి పోరు ఎక్కువైంది. ఆయనకు వ్యతిరేకంగా ఢిల్లీలో బలమైన లాబీయింగ్ కొనసాగుతున్నది. మాజీ ఎంపీలు రమేశ్‌రాథోడ్, నగేశ్ కూడా తమకంటే తమకే సీటు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. రమేశ్‌రాథోడ్‌కు బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్ మద్దతు పుష్కలంగా ఉన్నట్టు తెలిసింది. ఇదే సీటు కోసం డాక్టర్ సుమలత, బైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ రమేశ్ కూడా పోటీపడుతున్నారు. ఆ ముగ్గురు నేతల్లో ఒకరికి సీటిస్తే మరో ఇద్దరు సహకరించని పరిస్థితి ఉంది.

**కరీంనగర్‌లోనూ కిరికిరి..జహీరాబాద్, నాగర్‌కర్నూల్‌లో అసంతృప్తి**

కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా తాజా ఎంపీ బండి సంజయ్‌కుమార్ పోటీ చేయడం దాదాపు ఖరారైంది. కానీ, ఆయన అభ్యర్థిత్వాన్ని కరీంనగర్ సీనియర్ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గత ఎన్నికల్లో బండి గెలుపు కోసం కష్టపడి పనిచేసిన వారిలో కొందరు వైరిపక్షంలో చేరారు. కిషన్‌రెడ్డికి సన్నిహితంగా ఉండే మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మరో నేత సుగుణాకర్‌రావు బండి అభ్యర్థిత్వాన్ని అస్సలు ఒప్పుకోవడం లేదు. ఈటల గ్రూపు కూడా సంజయ్‌కి సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు మాజీ కేంద్ర మంత్రి ఆలె నరేంద్ర కుమారుడు ఆలె భాస్కర్, మాజీ ఎంపీ బాణారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డి, మరో ఇద్దరు ముగ్గురు నేతలు ఆ సీటును ఆశించి స్థానికంగా పనిచేసుకుంటున్నారు. తాజాగా, బీఆర్ఎస్ ఎంపీ బీబీపాటిల్ టికెట్ హామీతో బీజేపీలో చేరిపోయారు. దీంతో ఆ సీటును ఆశిస్తున్న నేతలంతా అసంతృప్తితో రగిలిపోతున్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ సీటును తాజీ ఎంపీ రాములు లేదా అతని కుమారుడికి ఇస్తారనే ప్రచారంతో ఇన్నేండ్లు పార్టీ కోసం పనిచేస్తున్న బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ కుమార్తె బంగారు శృతి కూడా అసంతృప్తుల జాబితాలో చేరిపోయారు. హైదరాబాద్ సీటులో అభ్యర్థిత్వంపైనా సందిగ్ధత నెలకొంది. ఆ నియోజకవర్గం నుంచి సీటు ఆశిస్తున్న వారిలో విరించి ఆస్పత్రుల చైర్మెన్ మాధవీలత, డాక్టర్ భగవంతరావు ఉన్నారు. ఇక్కడ నుంచి రాజాసింగ్‌ను బరిలోకి దింపితే ఎలా ఉంటుందనే విషయాన్ని అధిష్టానం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరు దాదాపు ఖరారైనట్టు సమాచారం. అయితే, ఆమె అభ్యర్థిత్వాన్ని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి వ్యతిరేకిస్తున్నారు. తనకే పోటీచేసే అవకాశం కల్పించాలని పట్టుబడుతున్నట్టు తెలిసింది.

## బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి నీటి విడుదల



**నవతెలంగాణ-నిజామాబాద్**

తాగునీటి అవసరాల మేరకు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేసినట్టు ఎస్సారెస్పీ ఎఈఈ రవి తెలిపారు. బాబ్లీ ప్రాజెక్టు నుంచి సీడబ్ల్యూసీ అధికారుల సమక్షంలో మహారాష్ట్ర, తెలంగాణ ప్రాజెక్టుల అధికారులు శుక్రవారం బాబ్లీ గేట్లు తెరిచారు. 0.6 టీఎంసీల నీరు విడుదల చేసి మూసివేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మార్చి 1న దిగువకు 0.6 టీఎంసీల నీటిని తాగునీటి కోసం బాబ్లీ ప్రాజెక్టు నుంచి గోదావరి నది గుండా ఎస్సారెస్పీలోకి వదులుతారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఈఈఈ వెంకటేశ్వర్లు, బాబ్లీ ప్రాజెక్టు ఈఈ సిఆర్ బాన్సోధ్, ఎస్సారెస్పీ డిఈఈ గణేష్, ఎస్సారెస్పీ ఎఈఈ రవి, కడెం ప్రాజెక్టు డిఈఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు దన్నుగా నిలవడమే ధ్యేయం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రైతులకు దన్నుగా నిలుస్తూ సాగు రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సాగు రంగంలోని ప్రతికూలతలను తట్టుకుంటూ రైతులకు రక్షణగా నిలిచేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)లో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చేరింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పీఎంఎఫ్‌బీవై సీఈవో, కేంద్ర సంయుక్త కార్యదర్శి రితేష్ చౌహాన్‌తో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా పీఎంఎఫ్‌బీవైలో 2016 నుంచి 2020 వరకు తెలంగాణ ఉన్న విషయం, ఆ తర్వాత నాటి ప్రభుత్వం దాని నుంచి ఉపసంహరించుకున్న తీరుపై వారు చర్చించారు. పీఎంఎఫ్‌బీవైలోకి రాష్ట్ర ప్రభుత్వం తిరిగిచేరడంతో వచ్చే పంట కాలం నుంచి రైతులు పంటల బీమాను పొందనున్నారు. పీఎంఎఫ్‌బీవైతో రైతులకు ప్రయోజనం కలుగుతుందనీ, పంటలు నష్టపోయినప్పుడు సకాలంలోనే పరిహారం అందుతుందని రితేష్ చౌహాన్ ఈ సందర్భంగా తెలిపారు. సీఎం రేవంత్ స్పందిస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో రైతు కేంద్రిత విధానాల అమలుకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో రైతు, విద్యా కమిషన్లు

**కౌలు రైతుల సమస్యలపై అఖిల పక్షం**

- రైతు భరోసా లబ్ధిదారులపై విసృత చర్చ జరగాలి
- పంటల బీమాను అమలు చేస్తాం
- నియోజకవర్గాల్లో సంక్షేమ గురుకుల ప్రాంగణాలు ఏర్పాటు : పౌర సమాజ ప్రతినిధులతో సీఎం రేవంత్





**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

"త్వరలో రైతు, విద్యా కమిషన్లను ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుంది. రైతులు, కౌలు రైతుల సాధక బాధకాలు, సంక్షేమం, వ్యవసాయ రంగంలో సంస్కరణలకు సంబంధించి రైతు కమిషన్ తగిన సలహాలు సూచనలు అందిస్తుంది." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్‌తో కలిసి యోగేంద్ర యాదవ్, గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, విశ్వేశ్వర్ రావు, రమ మేల్కొటే, రియాజ్, పురుషోత్తం తదితర పౌర సమాజ ప్రతినిధులతో సీఎం ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే తమ ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్‌ను తెరిచామనీ, ప్రజా భవన్‌ను ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు అనువుగా అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలనీ, ఆర్థిక, విద్యుత్, సాగునీటి రంగాల స్థితిగతులపై పూర్తి వివరాలతో అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశామని చెప్పారు. మహిళలు, నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అందరి సూచనలు, సలహాల ఆధారంగా కౌలు రైతుల రక్షణ చట్టంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. పంటలకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా సాయాన్ని ఎవరికివ్వాలనే దానిపై విసృత చర్చ జరగాలని సీఎం చెప్పారు. నిస్సహాయులకు, నిజమైన లబ్ధిదారులకు అవసరమైతే చెప్పిన దానికంటే ఎక్కువ సాయం చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉందని చెప్పారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. రాష్ట్రంలో పంట మార్పిడి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందనీ, అన్ని పంటలు విస్తరించేలా సరికొత్త విధానాలను అనుసరించాలని రైతులకు సూచించారు. రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాలయాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని వారికి వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలను వేర్వేరు చోట్ల కాకుండా, ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో అలాంటి క్యాంపస్ నెలకొల్పుతామని అన్నారు. దశల వారీగా అన్ని నియోజకవర్గాలకు ఆయా క్యాంపస్‌లను విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల విద్యా సంస్థల్లో కుల, మత వివక్ష తొలిగిపోవడంతో పాటు, విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలు, పోటీ తత్వం పెరుగుతదని అన్నారు. తద్వారా గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా జరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందనీ, ఎవరికీ అనుమానాలు అక్కర్లేదని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేసినట్టు గుర్తు చేశారు. గ్రూప్ 1, మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు ఇప్పటికే విడుదలయ్యాయని చెప్పారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమనీ, అందు కోసం అందరి సలహాలు, సూచనలతో ముందుకు పోతామని చెప్పారు.

## గత ప్రభుత్వ వైఫల్యాలు సరే..

# మా కడుపు నిండేదెట్లా?

- మా పట్ల వివక్ష తగదు • ఆరోగ్య తెలంగాణలో మా పాత్ర కీలకం
- ఐదు నెల్లుగా పెండింగ్‌లో వేతనాలు • అప్పుల పాలవుతున్నాం..ఆదుకోండి..
- ధర్నాలో '104 ఉద్యోగుల ఆవేదన • స్పందించకపోతే ఉద్యమమే : పాలడుగు




**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

'గత ప్రభుత్వ వైఫల్యాలు సరే..మా కడుపు నిండేదెట్లా? అని 104 ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఐదు నెల్ల నుంచి చేసిన పనికి జీతాలు ఇవ్వటం లేదు. మా కుటుంబాలను సాకేదెట్లా? ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు జీతాలు తీసుకుంటున్నారు కదా? మరి మా జీతాలనే ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? మా పట్ల ఎందుకింత వివక్ష? మా పట్ల వివక్షను ప్రదర్శిస్తున్న మీరు ఆరోగ్య రాష్ట్రంగా ఎలా తీర్చిదిద్దుతారు?' అంటూ సర్కారుపై 104 ఉద్యోగులు ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలలనుంచి వచ్చిన ఉద్యోగులు తమ ఆవేదనను నినాదాల రూపంలో ప్రభుత్వానికి వినిపించారు. కొత్త ప్రభుత్వమైనా తమ బాధలు పట్టించుకోవాలని మొరపెట్టుకున్నారు.

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని విమర్శించారు. మాటలతో కాలం వెళ్లదీసిందని చెప్పారు. ఆ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు కార్మిక వర్గం తగిన బుద్ధి చెప్పిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను, ఆర్థిక లోటు పాట్లను వివరించటంతోనే ప్రస్తుత సర్కారు కాలం గడుపుతున్నదనీ, ఐదు నెల్లుగా 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వక పోతే ఎలా బతుకుతారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే..వైద్య ఆరోగ్య రంగంలో పని చేస్తున్న ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలన్నీ ఒకే సారి విడుదల చేయాలన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగాలని కోరారు. ఆ వాగ్దానాలను విస్మరిస్తే..పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఆర్థిక పరిస్థితి బాగో లేదని సన్నాయి నొక్కులు నొక్కొద్దనీ, ఖాళీ ఖజానా చూపి వెనక్కి తగ్గితే కుదరదన్నారు.

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ అజమాయిషీలో పని చేస్తున్న ఉద్యోగులకు ఎజన్సీల నుంచి వేతనాలు ఇప్పించటమేంటని ప్రశ్నించారు. ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఏదో ఒక రోజు పర్మినెంట్ కాకపోతుందా? అనే ఆశతో వివిధ రకాల సేవలందిస్తున్న 104 ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రకాల ఉద్యోగులకు నెల ప్రారంభంలో వేతనాలు పడుతుంటే..104 ఉద్యోగులకు మాత్రం ఎందుకు వేయటం లేదన్నారు.

సామాజిక బాధ్యతలో ఉన్న వీరి పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. 104 సేవలను గత ప్రభుత్వం రద్దు చేసిందనీ, అది విఫల పథకమంటూ ఆ ప్రభుత్వానికి ఎవరు రిపోర్టు ఇచ్చారో తెలియదని వాపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదికను బయట పెట్టాలన్నారు. వైఎస్ఆర్ ప్రారంభించిన 104 ఉద్యోగ వ్యవస్థను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకుపోవాలని సూచించారు. గత ఏడాది అక్టోబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్యదర్శులు ఫిసియుద్దీన్,యాదానాయక్, ఉపాధ్యక్షులు బలరాం, విద్యాసాగర్, వి విజయవర్ధన్ రాజు, నవీన్, సుభాష్ చంద్ర, శ్రీనివాస్, మన్మదరావు, రాజేశ్, రాజు తదితరులు మాట్లాడారు.

సంపాదకీయం

# ఉద్యమాలూ మెట్లెక్కుతాయి!

'నా జీతం పెంచాలి!' 'నాకూ బోనస్ కావాలి!' ఆకలి కేకలవి. జీవన సమర రాపిడిలో నుండి పుట్టిన నినాదాలవి. అప్పుడే పుట్టిన బిడ్డ కూడా ఏడ్చిగోల చేయకపోతే ఏ తల్లీ పాలివ్వదన్న సంగతి జగద్విదితమే. మార్కెట్‌లో జరిగే దోపిడీ కండ్లారా చూసి, సంపూర్ణంగా అనుభవించిన రైతాంగం, ప్రత్యేకంగా నాటి ఉమ్మడి రాష్ట్రంలో, గిట్టుబాటు ధర కోసం ఉద్యమించిన సందర్భం 1981లో చూశాం. గిట్టుబాటు ధరలు సాధించిన పరిస్థితినీ విన్నాం. ఆ ఉద్యమ రాజకీయ ప్రతిరూపమూ ఆ

**ముందు యంత్రాల్నే శత్రువులుగా భావించిన బ్రిటన్ కార్మికవర్గ లుడ్డైట్ వీరుల నుండి రైతాం గాన్ని బాసటగా నిలుపుకుని సోవియట్ రాజ్య స్థాపన చేసిన కార్మికోద్యమం వరకు ఎన్నో మెట్లెక్కింది కార్మికోద్యమం. "జనం భూమిలో సంఘాలు నాటడం" నేర్చుకోవడం ఒక ఎత్తు. దేశాన్ని తాకట్టుపెట్టే పాలకులను ఇంటిదారి పట్టించడం కీలకమెట్టు.**

తర్వాతి కాలంలో మనకి కన్పడింది. స్వాతంత్ర్యానంతరం మూడున్నర దశాబ్దాల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఓడి, ఎన్టీఆర్ నాయకత్వాన తెలుగుదేశం ప్రభుత్వ మేర్పడింది.

1974లో రైల్వే కార్మికుల సమ్మెపై ఇందిరాగాంధీ పాశవిక దమనకాండ సాగించింది. అది 1976 మధ్య కొచ్చే సరికి ఎమర్జెన్సీ రూపంలో కార్మిక హక్కుల పైనా యావత్ ప్రజాతంత్ర హక్కులపైనా దాడిగా సాగింది. ఆ పరిస్థితులు జనతా పార్టీకి పురుడుపోశాయి. దేశం ఊపిరి పీల్చుకుంది. స్వేచ్ఛా వాయువుల ఝుంఝూ మారుతం వీచింది. కార్మిక కర్షకోద్యమాలు రాష్ట్రంలోనే గాక, దేశంలోనూ రాజకీయ సోపానాలయిన పరిణామాలవి.

2020 నవంబర్‌లో రాజుకున్న రైతాంగ ఉద్యమం చివరికి అక్షరాల మోడీ మెడలు వంచడమే కాదు, మూడు కార్పొరేట్ అనుకూల చట్టాలనూ రద్దు చేయించుకోగలిగింది. అయితే ఒకవైపు సంపన్న దేశాలు, ముఖ్యంగా జీ7 దేశాలు, వాటి వత్తిడి. ఇటు రైతాంగ ఉద్యమ ఉధృతి. ఇటు సంఖ్యాబలం. అటు కార్పొరేట్‌ల వజన్. కొత్తగా కలిసిన కార్మికశక్తితో మొన్న ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్, కార్మిక సమ్మెలో పాల్గొన్న ఇరవై కోట్ల మందికి పైగా శ్రమజీవులు మోడీ సర్కార్‌కు దాని భవిష్యత్ ఎలా ఉండబోతోందో మచ్చుకి రుచి చూపించారు.

నేడు ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి బయటికి రావాలంటూ ఢిల్లీని గేరి వేసిన రైతాంగం సమర నినాద మిస్తే, అది దేశమంతా ప్రతిధ్వనిస్తోంది. వామపక్ష ఆర్థిక వేత్తలే కాదు, అమర్త్యసేన్ వంటి నోబెల్ గ్రహీతలు, పెట్టు



బడిదారీ విధానం కూలిపోకుండా చూసుకోవాలనుకునే జోసెఫ్ స్టిగ్లిడ్జ్‌లు, థామస్ పిక్కెట్టీలు కూడా ప్రపంచంలో పెరుగుతున్న అసమానతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలతాయనడానికి కారణాలౌతాయంటున్నారు. మన దేశ వ్యవసాయాన్నే తీసుకుంటే 1965 - 85 మధ్యకాలంలో చేసుకున్న విపరీతమైన రీసెర్చ్ ఫలితంగా దేశంలో వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత సుమారు ఐదు రెట్లు పెరిగింది. ఇదంతా హరిత'విప్లవ' ఫలితం. ఒకపక్క ఎమ్.ఎస్. స్వామినాథన్‌కు 'భారతరత్న' ఇచ్చి సేంద్రియ వ్యవసాయం వైపు మోడీ సర్కార్ మళ్లిస్తోంది. ఆ పేరున శ్రీలంక మునిగిన అనుభవం మనకండ్లెదుటే ఉంది.

డబ్ల్యూ.టి.ఓ. ఆదేశంతోనే మూడు వ్యవసాయ చట్టాలను మోడీ సర్కార్ ప్రతిపాదించింది. నేడు వాటిని ఉపసంహరించుకుంటున్నామని ప్రభుత్వం చెప్పినా మద్దతు ధరకు (ఎంఎస్‌పి కి) గ్యారంటీ లేకపోయేసరికి రైతాంగం డబ్ల్యూ.టి.ఓ. నుండి బయటికి రావాలనే డిమాండును లంకించుకుంది. 1995 - 2005 మధ్య పాత సబ్సిడీల విధానం కొనసాగించుకునేందుకు అవకాశం ఉన్నా మొదట కాంగ్రెస్, ఆ తర్వాత బీజేపీ ప్రభుత్వాలు 'అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్నట్లు ఒకరిపై ఒకరు పోటీ పడి సబ్సిడీలను దిగ్గోశారు. దాంతో 1997 నుండి దేశంలో రైతుల ఆత్మహత్యలు ప్రారంభమైనాయి. ఉదాహరణకు జీ7 దేశాల ఆనతి మేరకు దిగుమతి సుంకాలు ఎత్తేయడం వల్ల మన దేశంలో చెరుకు పంట సాగు 5 కోట్ల ఎకరాల నుండి 2.5 కోట్లకి తగ్గింది. విదేశాల నుండి చక్కెర దిగుమతులు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా పాలు, మాంసం, గుడ్లు, పసుపు, మిరప, బియ్యం, గోధుమలు, పత్తి మొదలైనవి ఉత్పత్తి చేసే మన దేశంలో ఆరు నెలల క్రితం కోసి, ఐస్‌లో ఫ్రీజ్ చేసిన కోడి భాగాలు వంటివి, పాల ఉత్పత్తుల దిగుమతితో వ్యవసాయ అనుబంధ రంగాలన్నీ ధ్వంస మవుతున్నాయి.

ఒక పక్క మన ఎగుమతులను దెబ్బతీస్తూ జీ 7 దేశాల నుండి ఈ రకంగా మన దేశంపై వారి సరుకులను డంప్ చేస్తున్నాయి. అందుకే డబ్ల్యూ.టి.ఓ. నుండి బయటికి రావాలన్న డిమాండు నూటికి నూరుపాళ్లు సరైందే. పైగా దేశభక్తి యుతమైనది కూడా.

ముందు యంత్రాల్నే శత్రువులుగా భావించిన బ్రిటన్ కార్మికవర్గ లుడ్డైట్ వీరుల నుండి రైతాం గాన్ని బాసటగా నిలుపుకుని సోవియట్ రాజ్య స్థాపన చేసిన కార్మికోద్యమం వరకు ఎన్నో మెట్లెక్కింది కార్మికోద్యమం.

"జనం భూమిలో సంఘాలు నాటడం" నేర్చుకోవడం ఒక ఎత్తు. దేశాన్ని తాకట్టుపెట్టే పాలకులను ఇంటిదారి పట్టించడం కీలకమెట్టు.

# ప్రతిఘటనా స్వరం 'ప్రబీర్ పుర్కాయస్థ'



టీ.కే.రాజ్యలక్ష్మి

ప్రజాస్వామ్యం తనంతట తానుగా స్వేచ్ఛలకు హామీ ఇస్తుందా? లేక ఆ స్వేచ్ఛల కోసం పోరాడాల్సిన అవసరం ఉందా? భారతీయ మీడియాలో ప్రగతిశీల వర్గాల వారు పరిమిత మీడియాను, పరిమిత ప్రజాస్వామ్యం అని విశ్వసిస్తారు. 2014 లో నూతన ప్రభుత్వ ఏర్పాటు తర్వాత, రాజ్యాంగబద్ధంగా హామీ ఇవ్వబడిన స్వేచ్ఛల్ని కూడా అనుభవించలేక, వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని గడచిన దశాబ్దం రుజువు చేసింది. ఇది కూడా దేశంలోని జర్నలిస్టులు, విద్యావేత్తలు, కార్యకర్తలకు అత్యంత పరీక్షా సమయాలలో ఒక పరీక్షగా ఉంటుంది.

వ్యక్తుల్ని, జర్నలిస్టుల్ని లక్ష్యంగా చేసుకోవడం కొత్తేమీ కాదు, అయితే ఎమర్జెన్సీ కాలంలో చేసిన విధంగా రాజ్యం పక్షపాత ధోరణితో ఉన్నప్పుడు, అలాంటి లక్ష్యం ఒక భిన్నమైన దృక్పథాన్ని తీసుకుంటుంది. అమాయకులపై నేరాలు మోపడం లేక ఆర్థిక నేర్పాల్ని ఆరోపించి అనాగరిక చట్టాల కింద ప్రజల్ని నిర్బంధంలో ఉంచే శిక్ష ప్రక్రియగా మారింది. పాలక పార్టీ మద్దతు లేని అసమ్మతివాదులు జైలు నిర్బంధంలో లేనప్పుడు అధికారులు, ఏ స్థాయిలో ఉన్నవారినైనా భయపెట్టి లొంగదీసుకుంటారు.

ఈ సంవత్సరం జనవరి నెల మధ్యలో శిక్షణ పొందిన ఒక ఇంజనీర్, కొన్ని పరిస్థితుల కారణంగా మీడియా వ్యక్తిగా మారిన ప్రబీర్ పుర్కాయస్థ వంద రోజుల జైలు నిర్బంధాన్ని పూర్తి చేశాడు. "న్యూస్ క్లిక్" ఆన్లైన్ న్యూస్ పోర్టల్ సంస్థాపకుడైన పుర్కాయస్థను దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నిర్బంధంలో ఉంచారు. అధికారులు, అతని అరెస్ట్ ద్వారా మీడియాలో ముఖ్యంగా డిజిటల్ మీడియాలో పని చేస్తున్న వారికి హెచ్చరిక చేశారు.

**న్యూస్ క్లిక్, ప్రధాన స్రవంతి మీడియా అందించని నివేదికలు, అభిప్రాయాల్ని కూడా అందించింది. మీడియా లో కొన్ని రకాల నివేదికలు, బహుశా మీడియా వర్గ లక్ష ణాన్ని ఉద్దేశపూర్వకంగా మినహాయించడం గురించి వివ రిస్తూ, "కార్మికులు నగరంలో ప్రదర్శనలు చేస్తుంటే, ఆ కార్మికుల డిమాండ్ల గురించి కంటే కూడా ఆ ప్రదర్శ నల వల్ల కలిగే ట్రాఫిక్ జామ్ గురించి వార్తలు ఎక్కు వగా రాస్తుండడం తాను గమనించానని పుర్కాయస్థ పేర్కొంటాడు.**

రాజకీయ వేధింపులు, సమాజానికి ప్రమాదం అనుకునే వారి కోసం చేసే గాలింపులు (విచ్ హంట్స్) పుర్కాయస్థకు కొత్తేమీ కాదు. స్వాతంత్ర్య భారతదేశానికి ఉన్నంత వయసున్న 75 ఏళ్ళ జర్నలిస్ట్, లెఫ్ట్ వర్డ్ వారు ప్రచురించిన రచనలో తన రాజకీయ ప్రస్థానాన్ని వివరించాడు. ఎమర్జెన్సీకి, ప్రస్తుత కాలం లక్షణాన్ని వివరించే "అప్రకటిత ఎమర్జెన్సీ" గా పిలువబడే ప్రస్తుత పరిస్థితికి మధ్య ఉన్న సమాంతర రేఖల్ని పుర్కాయస్థ తన మాటల్లో వివరించాడు. అప్పుడూ, ఇప్పుడు కూడా అదే నిరంకుశత్వం ఉనికిలో ఉంది. అప్పుడు కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల్ని ఉపయోగించారు, ఇప్పుడు కూడా వాటిని కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటుంది. అప్పుడు మీడియాలో ఒక పెద్ద విభాగం ఫిర్యాదులు చేసింది, నేడు మీడియాలోని మొత్తం ప్రధాన స్రవంతి కొన్ని ముఖ్యమైన మినహాయింపులు తప్ప.

నాటి ఎమర్జెన్సీ 1.0 మీసా (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ ఆక్ట్)ను ఉపయోగిస్తే, నేటి ఎమర్జెన్సీ 2.0లో కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన 'ఊపా' చట్టాన్ని నేటి ప్రభుత్వం బలోపేతం చేసి వినియోగంలోకి తీసుకొచ్చింది. 2019 చట్టానికి చేసిన సవరణలు, నేరం చేయలేదని రుజువు చేసుకునే భారాన్ని నిందితునిపై మోపుతూ బెయిల్‌ను నియమం కంటే కూడా మినహాయింపును చేసింది.


ఎమర్జెన్సీని ప్రకటించిన 3 నెలల తర్వాత సెప్టెంబర్ 25, 1975 న జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్న పుర్కాయస్థను ఢిల్లీ పోలీసులు లాక్కొని వెళ్ళారు. అతడు ఓ విద్యార్థి సంఘం కార్యకర్త, జేఎన్‌యూ విద్యార్థి సంఘంలో విద్యార్థి కౌన్సిలర్‌గా ఉన్న వ్యక్తికి (తరువాత ఆమెను పెళ్లి చేసుకున్నాడు) దగ్గరి స్నేహితుడు. ఇది ఒక కిడ్నాప్ కేసు. పోలీసులు విద్యార్థి సంఘ అధ్యక్షుడు డీ.పీ.త్రిపాఠీ కోసం వెతుకుతూ పొరపాటున ప్రబీర్ పుర్కాయస్థను ఎత్తుకెళ్లారు. డీపీటీగా పిలువబడే త్రిపాఠీ, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళడానికి, ఆ తరువాత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు వామపక్ష విద్యార్థి రాజకీయాలకు సన్నిహితంగా ఉండేవాడు. ఆ తర్వాత పోలీసులు త్రిపాఠీని కూడా నిర్బంధించారు.

జేఎన్‌యూ వామపక్ష రాజకీయాల కోటగా ప్రసిద్ధి చెందింది. ముందు జాగ్రత్త చర్య పేరుతో నిర్బంధాలు, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు, నిరసనల అణచివేతకు, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా క్యాంపస్‌లో అన్ని వామపక్ష భావాలు గల విద్యార్థులు సమ్మెలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించే వారు. క్యాంపస్ లోపలికి పోలీసుల ప్రవేశం అంత తేలికేమీ కాదు. కానీ ఇతర విద్యార్థుల్ని తరగతులకు వెళ్ళనీయకుండా కొంతమంది విద్యార్థులు అడ్డుకుంటున్నారనే సాకుతో పోలీసులు క్యాంపస్ లోపలికి ప్రవేశించారు.

ఈ ప్రత్యేక కేసులో నాడు అండర్ గ్రాడ్యు యేట్ విద్యార్థినిగా ఉన్న మేనకాగాంధీ ఫిర్యాదుపైనే పోలీసులు క్యాంపస్‌లోకి ప్రవేశించారు. త్రిపాఠీ అనుకొని పొరపాటుగా అరెస్ట్ చేసినప్పటికీ పుర్కాయస్థ 'మీసా' చట్టం కింద సంవత్సరం పాటు జైలుశిక్ష అనుభవించాడు. అంతేకాక ఆయనను ఏకాంత కారాగారంలో ఉంచారు. నిర్బంధంలో ఉండడం ఆయనకిది మొదటి పర్యాయం. సురేంద్రమోహన్ లాంటి సోషలిస్టుల నుండి జనసంఘ్ సభ్యుల దాకా ఒక స్థాయి రాజకీయ నాయకుల్ని కలిసే అవకాశం తానకెలా వచ్చిందో తన స్వీయ జ్ఞాపకాలలో వివరించాడు. జనసంఘ్‌కు చెందిన కీ.శే. అరుణ్ జైట్లీ, మురళీ మనోహర్ జోషి లాంటి కొందరు నాయకులు కేంద్ర మంత్రులయ్యారు, కీ.శే.ఓ.పీ.కోహ్లీ లాంటి వారు రాజ్యసభ సభ్యులయ్యారు. తన కార్యకర్తల్ని ముందుగానే విడుదల చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆర్ఎస్ఎస్ రాయబారాలు, రాజీ ప్రయత్నాల గురించి తన రచనలో పుర్కాయస్థ వివరించాడు.

కొన్ని సంవత్సరాలుగా తన అవగాహనను రూపొందించిన మొత్తం అనుభవాల్ని ఈ రచన వివరిస్తుంది. సౌకర్యవంతమైన మధ్య తరగతి బెంగాలీ కుటుంబానికి చెంది, తన స్వంత పరివర్తనతో అతని ప్రయాణం ప్రారంభమైంది. ఆయన ప్రస్థానాన్ని గుర్తించి, ఆయన సభ్యునిగా కొనసాగుతున్న సీపీఎం పార్టీలో కార్యకర్తగా మారడానికి తోడ్పడిన ప్రాపంచిక ఆలోచనల్ని ఈ పుస్తకం బహిర్గతం చేసింది. "మీరు ఏ చరిత్ర వైపు ఉన్నారో దాని గురించిందే అసలు ప్రశ్న" అని ఆయన రాస్తాడు. "నైతిక పోరాటం" అంటే ఏమిటి లేక నైతిక పోరాటాన్ని కొనసాగించడం ఎందుకు అవసరం, ఎవరు నైతిక పోరాటం చెయ్యాలనేది ఆయన వేస్తున్న కొన్ని ప్రశ్నలు. తనకు వార్తల్లో నిలిచి పోవాలనే కోరిక ఏమీ లేదనీ, "నైతిక పోరాటం" తనతోనే మొదలై, తనతోనే అంతం కాని విషయం స్పష్టమని ఆయన అంటాడు.

**పుర్కాయస్థ 'న్యూస్ క్లిక్'ను 2009 లో ప్రారంభిం చాడు కానీ దానిని ఒక ప్రత్యేకమైన సంస్థగా భావించలేదు. ఇతర కొన్ని డిజిటల్ వేదికలు, ప్రధాన మీడియా స్రవంతి వలె "ప్రజలపై దాడులు, జీవనోపాధి, హేతుబద్ధత" కు ముప్పు వాటిల్లినపుడు ప్రతిస్పందనగా వచ్చిన ప్రజల నిరసనల్ని న్యూస్ క్లిక్ కూడా ప్రపంచానికి తెలియ జేస్తుంది. ఈ సంఘటనల్లో అనేకం రచయితలు, కళాకారులు, విద్యావేత్తలు, మేధావి వర్గానికి చెందిన ఇతరుల్ని వారి సురక్షిత వలయాల నుండి బయటకి వచ్చే విధంగా ప్రోత్సాహించాయి. పుర్కాయస్థ భాగస్వామిగా ఉన్న శాస్త్ర విజ్ఞాన రంగం కూడా తన వంతు పాత్రను పోషించింది.**




న్యాయం, శాస్త్రీయ విచారణ, సమదృష్టి లాంటి లక్షణాలు గల వ్యక్తిగా ఆయన పరిణామక్రమాన్ని, వ్యక్తిగత, రాజకీయ జ్ఞాపకాలతో కూడిన ఈ పుస్తకం గుర్తిస్తుంది. పుస్తకం రెండు కాలాల మధ్య ఉన్న తేడాల్ని చూపించినప్పటికీ, "75 ఏళ్ళ లౌకిక, వైవిధ్య ప్రజాస్వామిక, రాజ్యాంగ నిర్దేశిత భారత గణతంత్ర సందర్భాన్ని" దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని పుర్కాయస్థ పేర్కొంటాడు.

హేతువాది నరేంద్ర దభోల్కర్, స్కాలర్ ఎంఎం కాల్బుర్గి, కార్మిక సంఘం నాయకుడు, హేతువాదీ అయిన గోవింద పన్సారే, ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ లాంటి వారి హత్యల్ని, భీమా కోరేగావ్ కేసులో ఉపా చట్టం కింద జైల్లో నిర్బంధంలో ఉన్న మేధావులు, కార్యకర్తల అరెస్టును ఆయన గుర్తు చేసుకుంటాడు. హత్యకు గురైన వారు, నిర్బంధంలో ఉన్నవారు వారివారి మార్గాల్లో నిరసించే ప్రజాస్వామిక హక్కు, హేతుబద్ధత కోసం నిలబడి, ప్రతిఘాత, మతవాద, మితవాద హిందూత్వను సవాల్ చేశారు. ఈ మితవాద ఆధిపత్య కాలంలో గోరక్షణ పేరుతో, మతాంతర వివాహాలు చేసుకునే వారిపై, మైనార్టీలపై జరుగుతున్న దాడులు వారి చర్యల్లో భాగమయ్యాయి.

పుర్కాయస్థ 'న్యూస్ క్లిక్'ను 2009 లో ప్రారంభించాడు కానీ దానిని ఒక ప్రత్యేకమైన సంస్థగా భావించలేదు. ఇతర కొన్ని డిజిటల్ వేదికలు, ప్రధాన మీడియా స్రవంతి వలె "ప్రజలపై దాడులు, జీవనోపాధి, హేతుబద్ధత" కు ముప్పు వాటిల్లినపుడు ప్రతిస్పందనగా వచ్చిన ప్రజల నిరసనల్ని న్యూస్ క్లిక్ కూడా ప్రపంచానికి తెలియ జేస్తుంది. ఈ సంఘటనల్లో అనేకం రచయితలు, కళాకారులు, విద్యావేత్తలు, మేధావి వర్గానికి చెందిన ఇతరుల్ని వారి సురక్షిత వలయాల నుండి బయటకి వచ్చే విధంగా ప్రోత్సాహించాయి. పుర్కాయస్థ భాగస్వామిగా ఉన్న శాస్త్ర విజ్ఞాన రంగం కూడా తన వంతు పాత్రను పోషించింది.

న్యూస్ క్లిక్, ప్రధాన స్రవంతి మీడియా అందించని నివేదికలు, అభిప్రాయాల్ని కూడా అందించింది. మీడియాలో కొన్ని రకాల నివేదికలు, బహుశా మీడియా వర్గ లక్షణాన్ని ఉద్దేశపూర్వకంగా మినహాయించడం గురించి వివరిస్తూ, "కార్మికులు నగరంలో ప్రదర్శనలు చేస్తుంటే, ఆ కార్మికుల డిమాండ్ల గురించి కంటే కూడా ఆ ప్రదర్శనల వల్ల కలిగే ట్రాఫిక్ జామ్ గురించి వార్తలు ఎక్కువగా రాస్తుండడం తాను గమనించానని పుర్కాయస్థ పేర్కొంటాడు.

ఇంతకుముందు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ప్రధాన స్రవంతిలోని కొన్ని మీడియా వర్గాలు గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కోవిడ్-19 వల్ల సంభవించిన అదనపు మరణాల గురించి నివేదించాయి, దానికి ప్రతి ఫలంగా, తమ కార్యాలయాలపై ఆదాయ పన్నులశాఖ దాడులతో అవి భారీ మూల్యాన్ని చెల్లించాయి.

ఈ పుస్తకంలో 7 అధ్యాయాలు, 2 అనుబంధాలు, లలితా రామ్‌దాస్ ముందుమాట ఉన్నాయి. పుర్కాయస్థ ఈ పుస్తకాన్ని రచిస్తున్నప్పటికే మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం కింద న్యూస్ క్లిక్‌పై రెండు పర్యాయాలు దాడులు జరిగాయి. ఆరోపణలను సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్ళారు. అక్టోబర్ 3, 2023న పుర్కాయస్థ తన సహచరునితో సహా అరెస్ట్ అయ్యాడు. ఆ అరెస్టును కూడా కోర్టులో సవాల్ చేశారు. రెండు వారాల అనంతరం, న్యూస్‌క్లిక్ సిబ్బంది జీతాల్లేకుండా ఉండే విధంగా కంపెనీ ఖాతాల్ని స్తంభింప చేశారు.

పదేపదే తన జ్యుడీషియల్ కస్టడీని పొడిగించిన తరువాత పుర్కాయస్థ ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. ఆయనకు అనారోగ్య సమస్యలున్నాయి కానీ ఆయన స్ఫూర్తి మాత్రం చెదరలేదు. న్యూస్ క్లిక్ సంస్థ నిధుల్ని స్తంభింపజేసినప్పటికీ కూడా వార్తల్ని అందించే పనిని కొనసాగిస్తూ ఉంది. న్యూఢిల్లీలోని ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియాలో పుస్తకాన్ని ఆవిష్కరించిన రోజున, హాలు స్నేహితులు, సహచరులు, సానుభూతిపరులతో నిండిపోయింది.

పుర్కాయస్థ తెలిసిన వారందరికీ ఆయన చమత్కారం గురించి తెలుసు. ఆయన రచనలో ఉదారమైన మోతాదులో భారత ప్రజలపై తప్పు పట్టలేని విశ్వాసం కనిపిస్తుంది. ప్రస్తుత సమయంలో దాడి తీవ్రత ఎక్కువగా ఉంటే అదే స్థాయిలో ప్రతిఘటన కూడా ఉంటుంది. 1977 ఎమర్జెన్సీ తిరస్కరణలో సాధారణ ప్రజలే ప్రధాన పాత్రధారులు. "నాయకులు, అనుమతించిన దానికి మించి వ్యవహరిస్తే అదే ప్రజలు నాయకులకు తగిన గుణపాఠం చెప్తారని" ఆయన అన్నాడు.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451



## యుద్ధం ఆగితేనే ఉక్రెయిన్‌లో శాంతి

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం శనివారంతో మూడవ సంవత్సరంలోకి ప్రవేశించింది. ఈ యుద్ధం సమీప భవిష్యత్తులో ఆగిపోతుందన్న ఆశ పెట్టుకోలేమని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యర్థులకు భారీ నష్టం వాటిల్లిందని ఇరు వర్గాలు చెబుతున్నాయి. తనకు జరిగిన నష్టాన్ని, తన దేశంలో చోటుచేసుకున్న విధ్వంసాన్ని ఎవరూ వెల్లడించరు. ఇప్పటికే 2,00,000 మంది మరణించారని, వీరిలో చాలా మంది రష్యన్ సైనికులు ఉన్నారని పాశ్చాత్య వర్గాలు చెబుతున్నాయి. గత రెండేళ్లలో 14 లక్షలకు పైగా ఉక్రేనియన్లు శరణార్థులుగా మారారని ఐ.రా.స అంచనా వేసింది. జనాభాలో దాదాపు మూడింట ఒక వంతు (65 లక్షల మంది) ఉక్రేనియన్లు ఇప్పటికే 11 తూర్పు యూరోపియన్ దేశాలలో శరణార్థులుగా బతుకీడ్చుతున్నారు. ఉక్రెయిన్‌లోని మరిన్ని ప్రాంతాలు రష్యా ఆధీనంలో ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఉక్రేనియన్ దళాలు గత వారం తూర్పు పట్టణం అవ్దివ్కా నుండి ఉపసంహరించుకోవలసి వచ్చింది. గత మే నెలలో బఖ్‌ముత్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత రష్యా ఇదే అతి పెద్ద విజయంగా భావిస్తోంది.


ఉక్రెయిన్‌లో 2022 ఫిబ్రవరి 24న రష్యా ఉక్రెయిన్‌లో సైనిక చర్య చేపట్టింది. పశ్చిమ దేశాలు, అమెరికా నేతత్వంలోని సైనిక కూటమి 'నాటో' ఉక్రెయిన్‌కు ఆయుధాలు, డబ్బు ఇచ్చి రష్యాకు వ్యతిరేకంగా ఎగదోయడంతో అది యుద్ధంగా మారింది. మొదటి నుండి, పాశ్చాత్య దేశాలు, వాటి నియంత్రణలో ఉన్న అంతర్జాతీయ మీడియా రష్యాను దురాక్రమణదారుగా చిత్రీకరించడానికి, ఒంటరిని చేయడానికి ప్రయత్నించాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో జరిగిన అతి పెద్ద యుద్ధానికి రష్యాను బాధ్యురాలిని చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. గత ఫిబ్రవరిలో మ్యూనిచ్‌లో జరిగిన భద్రతా సదస్సులో రష్యాకు వ్యతిరేకంగా జరిగే చర్యలకు ప్రపంచ మద్దతు లభించదని వారు విశ్వసించారు. రష్యాపై ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని అమెరికా, యూరోపియన్ యూనియన్ నిర్ణయించాయి. యుద్ధంలో తటస్థంగా ఉన్న చైనాపైనా, యూరోపియన్ యూనియన్ ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది. మిలిటరీ టెక్నాలజీని రష్యాకు బదిలీ చేశారన్న ఆరోపణలపై మూడు చైనా కంపెనీలపై ఎగుమతి నిషేధం విధించాలని యూరోపియన్ యూనియన్ తాజాగా నిర్ణయించింది. మరోవైపు, యునైటెడ్ స్టేట్స్, ఇతరులు ఉక్రెయిన్‌కు వేల బిలియన్ డాలర్ల ఆయుధ సాయం అందిస్తున్నాయి.

యుద్ధం ప్రారంభమై రెండేండ్లు గడిచాయి. నిజానికి ఉక్రెయిన్-రష్యా వివాదం దశాబ్ద కాలంగా కొనసాగుతోంది. ఉక్రెయిన్‌కు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు విక్టర్ యనుకోవిచ్ పాశ్చాత్య మద్దతుతో జరిగిన తిరుగుబాటులో పదవీచ్యుతుడైనప్పుడు రష్యా-ఉక్రెయిన్ సంబంధాలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో రిఫరెండం నిర్వహించి క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా తన ఆధీనంలోకి తీసుకుంది. తదనంతరం, రష్యా- ఉక్రెయిన్ దేశాలు జర్మనీ-ఫ్రాన్స్ మధ్యవర్తిత్వంతో మిన్స్క్‌లో చర్చలు జరిపి రెండు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. అయితే ఉక్రెయిన్ ఈ ఒప్పందాలను కూడా ఉల్లంఘించింది. క్రిమియాతో సహా కోల్పోయిన భూభాగాలను తిరిగి పొందేందుకు సైనిక శక్తిని పెంపొందించడానికి ఉక్రెయిన్‌కు సమయం ఇవ్వడానికి ఈ ఒప్పందాలు ఉద్దేశించినట్లు మధ్యవర్తులు తర్వాత వెల్లడించారు. అదనంగా, 'నాటో'లో ఉక్రెయిన్ సభ్యత్వాన్ని అందించడానికి పాశ్చాత్య కూటమి నిరంతర ప్రయత్నాలు రష్యాకు ఆమోదయోగ్యం కాదు. ఈ విధంగా రష్యాను చుట్టుముట్టడానికి ఒక దశాబ్దానికి పైగా అమెరికన్లు కొనసాగించిన రెచ్చగొట్టుడు చర్యలు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి కారణమయ్యాయి.

పశ్చిమ దేశాలు ఈ ప్రాంతంలో ఆధిపత్య భ్రమలను విడనాడి రష్యాను ఆందోళనకు గురిచేస్తున్న అంశాలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటేనే శాంతి లభిస్తుంది. యుద్ధ పిపాసి అమెరికా, దాని మిత్రదేశాలు అందుకు ప్రధాన అడ్డంకిగా వున్నాయి. మితవాద జాత్యహంకార ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్స్కీ వారి ఆయుధంగా వున్నాడు. ఉక్రెయిన్‌లో పాశ్చాత్య ఎత్తుగడలను ప్రపంచం అర్థం చేసుకున్నందున ఇక్కడ వారి ఆటలు సాగడంలేదు.

('దేశాభిమాని' సంపాదకీయం)

# భాష వెనకాల దాగిన భావజాలం



కె.ఆనందాచారి
99487 87660

'వాడు ఓ పద్ధతిగా కొట్టాడ్రా!' అని ఓ సినిమా డైలాగ్. అలాగే తిట్టడానికీ సవాళ్లు విసురుకోవడానికి కూడా ఓ పద్ధతి ఉండాలి. అదీ ముఖ్యంగా ఈ సమాజాన్ని తీర్చిదిద్దటానికి, అభివృద్ధి పరచటానికి పనిచేస్తున్న నాయకులకు చాలా అవసరం. మనం చాలా కాలాల్ని, సమాజాల్ని దాటి వచ్చాం. బానిస వ్యవస్థ, రాచరిక వ్యవస్థలు దాటి ప్రజాస్వామిక వ్యవస్థలో, సమానత్వం, సౌభ్రాతృత్వం భావనల నాగరిక సమాజంలో జీవిస్తున్నాం. మన భేదాభిప్రాయాలను, కోపాలను, తప్పులను వ్యక్తీకరించుకోవటానికి ఒక సభ్యత, సంస్కారం గల భాషను వాడాలి. ప్రయత్నపూర్వకంగానే దాన్ని అలవరచుకోవాలి. అదీ బాధ్యతగల స్థానాల్లో ఉన్నవారు మరింత ఉన్నతంగా సంభాషించాలి. కానీ నేటి రాజకీయ సంవాదాలలో ఇది తీవ్రంగా దిగజారిపోతున్నది.

బానిసకాలపు పరిణామంగా వచ్చిన బూతు కూడా చట్టసభలలోనూ చోటుచేసుకుంటున్న ఘటనలు మనం చూస్తున్నాం. అడ్డగోలుగా, హీనమైన భాషను ఉపయోగిస్తున్నారు. వీటి వెనకాల ఆధిపత్య భావజాలం దాగి ఉంటుంది. వివక్షతలు నిండి వుంటాయి. తరచుగా ఎవరినైనా కించపరచటానికి షాక్ చేయటానికి అవమానించటానికి ఉద్దేశపూర్వకంగానే చెడు పదాలను ఎంపిక చేసుకుంటారు. ఆ పదాల వెనకాల కొన్ని వర్గాలను, హీనంగా చూసే దృక్పథమూ దాగి ఉంటుంది. ముఖ్యంగా కులాలను, మతాలను, లింగ పరమైన భేదాలను తిట్లుగా చెలామణి చేయడం నేటి సమాజ గమనంలో సరైనది కాదు.

మొన్న చేవెళ్లలో ఓ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'నువ్వు మగాడివైతే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో మీ పార్టీకి ఒక్క సీటు గెలిపించి చూపించు' అని సవాలు విసిరారు. ఏమిటీ భాష. విజయం సాధించేవాళ్ళు, పోరాడే సామర్థ్యమున్నవాళ్లు మగవాళ్లేనా? ఆడవాళ్లు ఇవేమీ చేయలేని బలహీనులా? వీరత్వం, పౌరుషం మగవాళ్ల సొత్తా! వీరత్వానికి, పోరాట పటిమకు ఉదాహరణగా స్త్రీలు ఎవరూ లేరా? బాధ్యతగల హోదాలో వున్నవాళ్లు మాట్లాడేటప్పుడు ఇవేమీ ఆలోచించకుండా మాట్లాడవచ్చా! ఇక ఈయన గారికి ప్రతి సవాలు విసురుతూ మాజీ మంత్రి కడియం ఏమన్నా రంటే... 'రాష్ట్రంలో 17స్థానాలు గెలిచి రేవంత్ రెడ్డి తన మగతనాన్ని నిరూపించుకోవాలని' సెలవిచ్చారు. సీ.ఎం. అయినా తన భాష మార్చుకోలేదని విమర్శిస్తూనే, తానూ అదే భాషను ప్రయోగించాడు. మగతనముంటే 17 సీట్లు గెలుస్తారా? మగతనానికి, రాజకీయానికి, పరిపాలనకు ఏమిటి సంబంధం? ఇది దుర్మార్గమైన పోలిక. మహిళలను చిన్నచూపు చూసే, హీనంగా చూసే అలవాటు నుంచి వచ్చే భావనలు. పురుషాధిక్య సమాజపు ధోరణి. భూస్వామికసమాజంలో స్త్రీని బానిసగా చేసి, వంట ఇంటికి, పిల్లల్ని కనే సేవకురాలిగా చేసిన దుర్వ్యవస్థ దుష్పరిణామపు భావజాలమిది. నేటి స్త్రీలోకం అన్నింటిలోనూ పురుషులకు సమానంగా పనిచేయగలుగుతున్నారు. ఎందులో లేరు స్త్రీలు? రాజకీయాలలో చూసినా వీరనారులెందరో కనిపిస్తారు. రాణి రుద్రమదేవి పరిపాలన చేయలేదా! యుద్ధంలో పాల్గొన లేదా! ఝాన్సీ లక్ష్మీబాయి వీరవనిత కాదా? కేప్టెన్ లక్ష్మిసెహగల్, స్వాతంత్ర్యం కోసం సుభాష్ సైన్యంలో కమాండర్‌గా చేసి తుపాకి పట్టింది కదా! ఇవి కొన్ని ఉదాహరణలే. ప్రతి రంగంలోనూ మహిళలు, పురుషులకు ధీటుగా పనిచేస్తున్నారు, రాణిస్తున్నారు. ఇంకా ఇప్పటికీ వారిని చులకన చేసే పదజాలాన్ని వాడటం ఎంతమాత్రమూ సహించరానిది. మన నరనరాన జీర్ణించుకుపోయిన ఈ భావజాలాన్ని వొదిలించుకో వాల్సిన అవసరం ఉంది.

ప్రతి సందర్భంలోనూ, కోపం, కసి పెరిగినపుడు, ఎదుటి వాళ్లను కించపరచడం, అది కూడా ఆడవాళ్లు కేంద్రంగా బూతులు ప్రయోగించడం తరచూ వింటాము. మనలో లోపల ఉన్న పురుషస్వామ్య భావజాలమంతా బయటికి వచ్చేస్తుంది. ప్రతి విషయంలోనూ అమ్మ... ఆలి... మొదలు పెడతారు. కుల వివక్షతలతోనీ తిడుతుంటారు. మనం పొందిన చదువు, వివేకం, విలువలు ఏమై పోయినట్లు!

తీవ్రమైన భావావేశాలు కలిగినపుడు వాటిని విచక్షణతో అంతే తీవ్రంగా పదునైన మాటలల్లో చెప్పగలిగే వివేకాన్ని



**సమాజంలో నేడు రెండు రకాల భాషా ప్రయోగాలు సంధించబడుతున్నాయి. ఒకటి విద్వేష భాష. ఇది మనుషుల మధ్య విభజన, ద్వేషం పెంచే పదజాలం రెచ్చగొట్టబడుతోంది. రెండోది వివక్షాపూరిత భాష. ఇది కుల, లింగ అసమానతలను కించపరుస్తున్న భాష. ఈ రెండూ మానవీయ సమాజ పురోగమనానికి తీవ్ర విఘాతాన్ని కలిగిస్తాయి. ద్వేషాల్ని, రగిలిస్తాయి.**

పెంపొందించుకోవాలి. మాటలల్లో తీవ్రత అంటే, బూతులు, స్త్రీలను కించపరచే తిట్లు కాదు. నాగరికత, చదువు, సంస్కారవంతమైన భావనలు వచ్చాక కూడా ఈ రకమైన భాషను వాడటమా! లింగ, కుల భేదాలను కూడా ఉచ్చనీచాలుగా పరిగణించడం. నాగరిక సమాజంలో సిగ్గుచేటయిన విషయం.

'మగా'నుభావులు ఇంకా అనాగరికంగానే ఉన్నారనిపిస్తోంది. ఇది కేవలం పైన ఉదహరించిన నాయకులకు సంబంధించినదే కాదు. అనేకమంది అదే తరహాలో స్త్రీలను అవమానిస్తూనే వున్నారు. చాలామంది మాటలని గమనించండి. 'నేనేమీ గాజులేసుకుని లేను' అనే వాక్య ప్రయోగాన్ని వింటుంటాం. అంటే గాజులేసుకునే స్త్రీలు ఏమీ చేయలేని బలహీనులని దాని భావం. ఇప్పటికీ స్త్రీలను అబలగానే చూడటం అత్యంత దారుణం. సినిమాలలో, సమాజంలో, టి.వి. సీరియళ్లలో ఇలాంటి భావజాలమే కొనసాగుతున్నది. ఇంకో ఉదాహరణ. 'అతడు' సినిమాలో తనికెళ్ల భరణి, మహేశ్‌బాబు చేస్తున్న ఫైట్‌ను చూసి, 'ఆడు మగాడ్రా బుజ్జీ' అనే డైలాగ్ ఎంత ఆదరణ పొందింది! ప్రతి సినిమాలోనూ స్వాతంత్ర్య వ్యక్తిత్వం లేనిదానిగానే నాయికను చూపిస్తారు. ఇది మారాలి. ఇక ఒకసారి మన ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రేణుకా చౌదరిని ఉద్దేశించి పార్టీ మిత్రులతో, 'ఈ పార్టీలో వున్న ఏకైక మగాడు' అని ఆమెకున్న గుండె ధైర్యాన్ని గురించి చెప్పాడని అంటారు. ఇది ఆమెను పొగిడినట్లా! స్త్రీగా ఆమెను కించపరచినట్లా! ఇక మీసాలు మెలెయ్యడానికి, పౌరుషంగా బతకడానికి ఏమైనా సంబంధముందా! అలా ఆలోచిస్తే, మన దేవతల రూపాలకు పురుష దేవతలందరికీ మీసాలే ఉండవు. అంటే పౌరుషహీనులా? బలం, పౌరుషం, సామర్థ్యం, విజ్ఞానం, ఇవేవీ స్త్రీ పురుషులకు విభజించబడి, వేరువేరుగా ఉండవు. స్త్రీలకు వాడుకునే వస్తువులుగా చేసి కట్టేసి పడేసిన భూస్వామిక ఆధిపత్య భావజాలం నుండి పురుడు పోసుకున్నాయి. అవే ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

ఈ వివక్షతా భావజాలం పురుషులలోనే కాదు, సమాజమంతా విస్తరించి అందరిలోనూ ఉంది. సమాజంలో వున్న స్త్రీలు సైతం పురుషాధిక్య భావజాలానికి ప్రభావితమై ఉన్నారు.

మన కావ్యాలను, పురాణాలనూ చదివిపట్లయితే అంతటా ఈ వివక్ష అసమానతా కనబడుతుంది. ఆడవాళ్లు సైతం తాము బలహీనులమనే మానసికంగా స్థిరపడి వుంటారు. వీరులు, బలవంతులు పురుషులనే నిశ్చితాభిప్రాయమూ ఉంటుంది. నెల్లూరును పాలించిన మనుమసిద్ధి రాజు సైన్యంలో ఖడ్గ తిక్కన ఉండేవాడు. అతనొకసారి రాజుగారి తరపున యుద్ధం లో పాల్గొన వలసి వచ్చింది. కొంతకాలం యుద్ధం చేశాక, మనం యుద్ధం ఓడిపోతామనే భయంతో పారిపోయి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన అతన్ని చూసి, అతని భార్య అక్కడ ఒక మూలకు ఒక నులక మంచం నిలబెట్టి, దానిమీద చీరకప్పి ఒక పళ్లెంలో పసుపు ముద్ద, పెట్టి స్నానం చేయమనిందట. తిక్కన అదేమిటి పసుపు ముద్ద, మంచం పెట్టావు? అని అడిగాడట. అందుకు ఆమె బదులిస్తూ -

'పగరకు వెన్నిచ్చినచో
నగరే మగతనంపు నాయకులంతా
ముగురాడు వార మైతిమి
వగపేటికి జలకమాడ వచ్చిన చోటన్' అని అందట.

మగతనం ఉన్నవాళ్లంతా, శత్రువుకు వెన్నుచూపి వస్తుంటే నవ్వరా? అని భర్తను ఎగతాళి చేసింది భార్యే. ఇప్పటికి కూడా ఆడవాళ్లు తమ కోపాన్ని, ఆక్రోశాన్ని ప్రదర్శించడం కోసం పురుషాధిక్య భావజాలపు పదప్రయోగాన్నే చేస్తుంటారు. మొన్నొక రచయిత్రుల సమావేశంలో మగవాళ్లను తిట్టటానికి మళ్లీ మేము స్త్రీలను కించపరచే పదజాలాన్నే వాడాల్సి వస్తున్నందుకు ఎంతో బాధగా ఉందని ఆవేదన చెందారు. మగవాళ్లను తిట్టటానికి మనం కొత్త తిట్లను సృష్టించాల్సి వుందని కూడా అంటున్నారు.

సమాజంలో నేడు రెండు రకాల భాషా ప్రయోగాలు సంధించబడుతున్నాయి. ఒకటి విద్వేష భాష. ఇది మనుషుల మధ్య విభజన, ద్వేషం పెంచే పదజాలం రెచ్చగొట్టబడుతోంది. రెండోది వివక్షాపూరిత భాష. ఇది కుల, లింగ అసమానతలను కించపరుస్తున్న భాష. ఈ రెండూ మానవీయ సమాజ పురోగమనానికి తీవ్ర విఘాతాన్ని కలిగిస్తాయి. ద్వేషాల్ని, రగిలిస్తాయి. స్త్రీలకు కూడా పురుషులతో సమానంగా పోరాడే ధైర్యం, తెగువ, సామర్థ్యాలు ఉంటాయి. ఒకింత ఎక్కువగానే వుంటాయి కూడా. ధైర్యం, శక్తి కలిగి వున్న మగాళ్లకు కూడా జన్మనిచ్చేది ఒక మహిళే, అసమానతలను, అవమానాలను పెంచి పోషించే పదజాలాలను వాడటం, నేటి నాగరిక సమాజంలో చేయకూడని పని. ముఖ్యంగా రాజ్యాంగంలో అందరూ సమానమని, వివక్షతలు చూపకూడదని రాసుకున్నట్లుగా, దాని ఆధారంగా పాలన చేస్తున్న వారి నోటి నుంచి ఇలాంటి మాటలు రాకూడదు. ఇక ముందయినా నాయకులు ఆలోచించి మాట్లాడాలి.

'మగాడు మగాడని, మగాడు పుట్టాలని, పుట్టాడని, నువ్వు మగాడివంటూ నూరిపోశాక, వాడేం చేస్తాడు! 'నువ్వు మనిషివి, మనిషివని గుర్తు చెయ్యనపుడు' అని ఆవేదన చెందుతుంది కవయిత్రి ఇందిర. అవును మగాళ్లనయినా, ఆడవాళ్లనయినా, ముందు మనుషులుగా చూడాలి.

## ఏ-స్కాన్ ప్రారంభించిన డీఎఫ్ఓ


సన్మానిస్తున్న బోర్డు సభ్యులు


**నవతెలంగాణ - కరీంనగర్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాధేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ డీఎఫ్ఓ సీహెచ్.బాలమణి కొత్తగా కొన్న ఏ-స్కాన్‌ను ప్రారంభించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను సందర్శించారు. ఆస్పత్రిలోని శుభ్రత ప్రయివేటు హాస్పిటల్స్‌కు ధీటుగా ఉందన్నారు. ఆస్పత్రి ఆవరణలోని పచ్చదనం చూసి ముగ్ధులయ్యారు. పేషెంట్స్‌కు గొప్ప సేవ చేస్తున్నారని, చక్కగా మెయింటెయిన్ చేస్తున్నారని, అవసరార్థులు చక్కటి సేవ చేస్తున్నారని అభినందించారు. తమ అటవీ శాఖ సహకారం అందచేస్తామని, ఆస్పత్రి ఆవరణలో హరితహారం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతామని, ఆస్పత్రిని సుందరంగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. చైర్మెన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ.. పేదవారికి కంటి ఆపరేషన్ చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. 2వేలు చెల్లించి ఒక పేదవాడికి దృష్టి దానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు డాక్టర్ టీ.మురళీధర్ రావు, కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

# టార్గెట్... మెగా డీఎస్సీ

## పరీక్షల్లో నెగ్గేందుకు బుక్‌స్టాల్స్, లైబ్రరీలకు పరుగులు

- బాసటగా నిలుస్తున్న ప్రభుత్వ స్టడీసర్కిళ్లు.. రాత్రింబవళ్లూ ప్రిపరేషన్
- ఇన్నాళ్లూ మూతపడి.. ఇప్పుడిప్పుడే తెరుచుకుంటున్న కోచింగ్‌సెంటర్లు
- ఎంపీ ఎన్నికలకు ముందే భర్తీ చేస్తేనే ప్రయోజనం...
- లేదంటే కోచింగ్, పుస్తకాల కొనుగోలు ఖర్చుల భారం



టార్గెట్.. మెగా డీఎస్సీ.. ఉద్యోగార్థులంతా ఈ పోటీ పరీక్షల్లో నెగ్గేందుకు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర సర్కారు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయగా ఈనెల 4 నుంచి దరఖాస్తులు స్వీకరించబోతోంది. అందులోనూ గతంలో విడుదల చేసిన పోస్టులకు మరిన్ని పెంచి మరీ నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. దీంతో శుక్రవారం నుంచే బుక్‌స్టాళ్లు, లైబ్రరీల్లో సందడి మరింత పెరిగింది. మరోవైపు ఇన్నాళ్లూ మూతపడ్డ డీఎస్సీ కోచింగ్ సెంటర్లు మళ్లీ తెరుచుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఇంకోవైపు ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్టడీ సర్కిళ్లు బాసటగా నిలుస్తున్నాయి. అయితే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఎండాకాలంలోపు పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిజేస్తేగానీ ప్రయోజనం ఉండదనే భావన ఉద్యోగార్థుల్లో వ్యక్తం అవుతోంది.

*నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి*

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటన చేయడంతో ఆరేండ్లుగా అభ్యర్థుల నిరీక్షణకు తెరపడినట్టయింది. గత బీఆర్ఎస్ సర్కారు టెట్ నిర్వహించి ఫలితాలు వెల్లడించినా.. గతేడాది ఆగస్టులో ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించినా పరీక్ష నిర్వహించలేదు. ఇప్పుడు మళ్లీ నోటిఫికేషన్ విడుదల కావడం, గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మళ్లీ అప్లయి చేసుకోనక్కర్లేదనే మినహాయింపు ఇవ్వడం ఉద్యోగార్థుల్లో కొంత ఊరట లభించింది. అందులోనూ ఈసారి పోస్టుల సంఖ్య పెరగడం, అందులోనూ దివ్యాంగుల బాలల కోసం స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులను భర్తీ చేస్తుండటంతో మరిన్ని ఆశలు చిగురించాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 76 స్పెషల్ ఎడ్యూకేటర్ పోస్టులు సహా 747 ఉపాధ్యాయ పోస్టులు కలిపి 823 పోస్టులు భర్తీ కానున్నాయి.

### 4 నుంచి దరఖాస్తుల ప్రక్రియ...

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు ఈనెల 4 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని, కొత్త డీఎస్సీకి వారిని పరిగణనలోకి తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ స్పష్టం చేసిన విషయంతెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 11 పట్టణాల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ కేంద్రంగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 2022లో నిర్వహించిన టెట్ పరీక్షల్లో 12వేల మంది అర్హత సాధించగా.. ఇటీవల గతేడాది పరీక్షలో 9545 మంది అర్హత సాధించారు. 2017 నుంచి ప్రతియేటా టెట్ అర్హత సాధిస్తూ డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగార్థుల సంఖ్య కూడా భారీగానే పెరిగింది.

మరోవైపు గతేడాది గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్ పోస్టులను మాత్రమే గత ప్రభుత్వం నింపింది. ఏండ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దఎత్తున ఏర్పడ్డ ఖాళీలను నాలుగేండ్లుగా కనీసం విద్యా వాలంటీర్లతోనూ భర్తీ చేయకపోవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది. పని సర్దుబాటు పేరిట నెట్టుకొస్తున్నా పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. తాజాగా డీఎస్సీ ప్రకటనతో ఉపాధ్యాయులతో సర్కారు బడులు కళకళలాడనున్నాయి.

### హేతుబద్ధీకరణకుతోడు సకాలంలో భర్తీ చేస్తేనే...

మార్చి ఆఖరు నాటికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోఅనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన వెలువరించటంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యానిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు 'టెట్' నిర్వహించి ఉద్యోగోన్నతులు కల్పిస్తే చాలావరకు ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. ఇదే సమయంలో అన్ని రకాల పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించడం శుభపరిణామం. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశమున్న నేపథ్యంలో ఈ ప్రక్రియకు ఆటంకం కలగకుండా వేసవిలోనే పరీక్ష నిర్వహించి జూన్‌లో పాఠశాలల పున:ప్రారంభంనాటికి ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తి చేస్తేనే విద్యార్థులకు అధిక ప్రయోజనం చేకూరనుంది.

### లైబ్రరీ, బుక్‌స్టాళ్లలో సందడి..

తాజాగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో నిరుద్యోగులంతా ఉద్యోగ వేటకు బయలుదేరుతున్నారు. ఇన్నాళ్లూ మూతపడ్డ డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఒక్కొక్కటిగా తెరుచుకుంటున్నాయి. ప్రస్తుతం ఏ కోచింగ్‌సెంటర్‌కు వెళ్లినా... ఏ బుక్‌స్టాల్‌కు వెళ్లినా, ఏ లైబ్రరీకి వెళ్లినా.. ఉద్యోగార్థుల సందడి మొదలైంది. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న స్టడీ రూములలో గంటల తరబడి ప్రిపరేషన్‌లో నిమగ్నమవుతున్నారు. అభ్యర్థుల కోసం గ్రంథాలయ అధికారులు తాజా సమాచారం ఉన్న పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అందులోనూ టీచర్ పోస్టులపై నమ్మకం పెట్టుకున్న కొందరు యువత హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల్లోని కీలకమైన కోచింగ్ సెంటర్ల వైపు తొంగిచూస్తున్నారు. ఇదే సమయంలో తెలుగు అకాడమి పుస్తకాల కొరత ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి ప్రభుత్వం నోటిఫికేషన్ కంటే పోటీపరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాల్సి ఉంది. అలాంటి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో అభ్యర్థులు ప్రైవేటు పుస్తకాల షాపులలో వేలకు వేలు పెట్టి పుస్తకాలు కొనలేని పరిస్థితి నెలకొంది.

### బాసటగా నిలుస్తున్న ప్రభుత్వ స్టడీ సర్కిళ్లు

ఉమ్మడి జిల్లాలో బీసీ స్టడీసర్కిల్, ఎస్సీ స్టడీ సర్కిల్‌లో యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం బీసీలకు ప్రత్యేకంగా ఉచిత శిక్షణ ఇవ్వడం కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించింది. దానితో పాటు సంవత్సరం పొడవునా బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న పోలీసు, గ్రూపు ఉద్యోగార్థుల కోసం శిక్షణ ఇస్తున్నారు. విశాలమైన స్టడీ హాళ్లతో పాటు, ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇస్తున్నారు. నిపుణులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నారు. తాజాగా మైనారిటీ సంస్థ ఆధ్వర్యంలో కూడా యువతకు ఉచితంగా పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## సీజ్ చేసిన వాహనాలను వేలం వేస్తాం

### డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ పెద్దింటి పురుషోత్తం


వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్ పరిశీలిస్తున్న డీటీసీ

**నవతెలంగాణ - తిమ్మాపూర్**

కొన్ని ఏండ్లుగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో రవాణా శాఖ కార్యాలయంలో సీజ్ చేసిన వాహనాలను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తామని కరీంనగర్ ఉమ్మడి జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ పెద్దింటి పురుషోత్తం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఆయన డ్రైవింగ్ ట్రాక్ కార్యాలయంలో ఫిట్‌నెస్ రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరును పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న సీజ్ చేసిన వాహనాల లిస్టు తయారుచేసి వారం రోజుల్లోగా తనకు అందజేయాలని ఏఎంవీఐ స్రవంతిని ఆదేశించారు. అలాగే కార్యాలయానికి ఫిట్‌నెస్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చే భారీ వాహనాలకు, ఆటోలకు నాణ్యమైన రేడియం స్టిక్కర్లను ముందు వెనకాల వాహనదారులు తప్పకుండా వేయించాలని వాహనదారులకు సూచించారు. ఈ స్టిక్కర్ల వల్ల రాత్రి వేళల్లో జరిగే ప్రమాదాలను జరగకుండా నివారించవచ్చని అన్నారు. కొన్ని నెలలుగా ట్రాక్ నిర్మాణం పూర్తయినప్పటికీ ఇప్పటికీ ప్రజలకు ఉపయోగకరంగా లేదని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. డ్రైవింగ్ ట్రాక్ విషయమై ఇటీవల మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి నిధుల కోసం కోరినట్టు చెప్పారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సమకూర్చే విధంగా కృషి చేస్తానని తెలిపారని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయితే పనులు చేపట్టి రవాణా శాఖ మంత్రితో ప్రారంభించే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, సిబ్బంది శ్రీనివాస్, రహూఫ్, గౌస్ పాష పాల్గొన్నారు.

## 4న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్స్ సెలక్షన్ ట్రైల్స్

**నవతెలంగాణ - రామడుగు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్బాల్ ఆసోసియేషన్ ఆధ్వర్యములో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్స్, అండర్19 బాలుర సెలక్షన్ ట్రైల్స్ కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 8, 9, 10 తేదీల్లో వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సోమవారం సాయంత్రం మూడు గంటలకు పీఈటి శ్రీధర్, జిల్లా సంయుక్త కార్యదర్శి యస్.ప్రభాకర్, కోచ్ మూల వేంకటేష్‌కు రిపోర్ట్ చేయలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1.1.2004 తర్వాత పుట్టి ఉండాలని, చదువుకు సంబంధించిన ధృవపత్రాలు తీసుకొని రావాలని, మిగతా వివరాలకు 9441925807, 8978995730, 9550942180 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ప్రతిభను చాటుకున్న రాణి

## డిఎల్, జేఎల్ ఉద్యోగాలకు ఎంపిక

**నవతెలంగాణ - హుజురాబాద్**



నిరుపేద కుటుంబంలో జన్మించి తన ప్రతిభతో కష్టపడి ఉన్నత చదువులు చదవడం కాకుండా గురుకుల విద్యాసంస్థల్లో డిఎల్, జేఎల్ ఉద్యోగాలు పొంది హుజురాబాద్‌కు చెందిన చెంద్యాల రాణి తన సత్తా చాటింది. హుజురాబాద్ పట్టణంలోని మామిళ్లవాడకు చెందిన చెంద్యాల రాణి నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ చదువుపై మక్కువతో కష్టపడి ఎంఎస్సీ ఫిజిక్స్, బిఈడి చదివింది. తర్వాత జమ్మికుంట, హనుమకొండలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసింది. ఇటీవల మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉద్యోగం సంపాదించింది. ఒకవైపు ఉద్యోగం చేస్తూ మరోవైపు ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమయింది. ఇటీవల గురుకుల బోర్డు ప్రకటించిన ఫలితాల్లో డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా, జూనియర్ కళాశాల లెక్చరర్‌గా రెండు ఉద్యోగాలు సాధించింది. బాల్యంలో చదువు కోసం తాను కష్టపడ్డప్పుడు ఎలాగైనా భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని భావించి పట్టుదలతో రెండు ఉద్యోగాలు సాధించానని రాణి తెలిపింది.

## బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం




**నవతెలంగాణ - జమ్మికుంట**

బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం పర్యటన చంపినోడే సంతాప సభ పెట్టినట్టు ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నం ప్రవీణ్, సుంకరి రమేష్, మహమ్మద్ సజ్జు అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మూడు సంవత్సరాలలోపే పిల్లర్లు కుంగడం అనేది దేనికి సంకేతమో బీఆర్ఎస్ పార్టీ నాయకులే చెప్పాలన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బిజిగిరి శ్రీకాంత్, కారింగుల రాజేందర్, బుడిగె శ్రీకాంత్, ఏబూసి అజయ్, జియా, దిలీప్, భాను, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


## జమ్మికుంట మున్సిపల్ సర్వసభ్య సమావేశం

**నవతెలంగాణ - జమ్మికుంట**



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 24 అంశాలకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఎండీ ఆయజ్, కౌన్సిలర్లు, మేనేజర్ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**నవతెలంగాణ - చొప్పదండి**

చొప్పదండి పట్టణంలోని ప్రధాన రహదారిలో చిట్టి గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు ప్రారంభించారు. చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన చిట్టి గ్రూప్ సభ్యులను కమిషనర్ అభినందించారు. కమిషనర్‌ను సన్మానించారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్‌ని మల్లేశం, కుమార్, చాంద్, రవికాంత్, శ్రీనివాస్, మేనేజర్ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**నవతెలంగాణ - గంగాధర**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం కాసారం, వెంకంపల్లి, గోపాలారావుపల్లి, మల్లాపూర్, కురిక్యాల, ఉప్పరమల్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, గర్షకుర్తి, అచంపల్లి, చిన్న ఆచంపల్లి, గట్టుభూత్కూర్, హిమ్మత్ నగర్ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి సారించి ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేసిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనని అన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు పుల్కం నర్సయ్య, రామిడి రాజిరెడ్డి, గుండా రాజేశం, అన్నల్‌దాస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమరవీరులకు ఘనంగా నివాళులు


**నవతెలంగాణ - హుజురాబాద్**



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటంలో అసువులుబాసిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం మాట్లాడుతూ.. వర్గీకరణ చివరి దశలో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మారేపల్లి శ్రీనివాస్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, దేవునూరి రవీందర్, బొరగాల సారయ్య, డాక్టర్ తడికమళ్ళ శేఖర్, వేల్పుల ప్రభాకర్, బొరగాల రాజయ్య, తిప్పారపు భువనచంద్ర, బొల్లంపల్లి షద్రక్, దేవేందర్, సమ్మయ్య, తూర్పాటి రాజు, మిడిదొడ్డి సమ్మయ్య పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

### మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న



**నవతెలంగాణ - రామడుగు :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ మంత్రి కేటీఆర్‌కు లేదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నవెంకట్‌రాంరెడ్డి అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలల కిందట ఉన్న అధికారం ఇప్పుడు లేదన్నారు. మన దేశం బాగుండాలనే ఆలోచనతో ఆస్తి నంతటిని ఖర్చు చేసిన కుటుంబంలోని రాహుల్, ప్రియాంక గాంధీల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. పదేండ్లు సిరిసిల్ల నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకొని పెద్దలతో ఎలా మాట్లాడాలో నేర్చుకోవాలని హితవు పలికారు.

## హైకోర్టు ఏజీపీగా అరుణ్ కమార్



**నవతెలంగాణ - రామడుగు :** మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన మార్కొండ అరుణ్ కుమార్ హైకోర్టు ఏజీపీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నంతోనే కుల గణన సాధ్యమైంది

- 7న మంత్రి పొన్నం కు ఆత్మీయ సత్కారం
- బీసీ సంఘాల ఐక్యవేదిక ఆహ్వాన కమిటీ చైర్మన్ వైద్యుల అంజన్ కుమార్


మాట్లాడుతున్న అంజనీకుమార్

**నవతెలంగాణ - కరీంనగర్**

బీసీ కులగణన ఎంతో మేలు చేస్తుందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోనే ఇది సాధ్యమైందని బీసీ సంఘాల ఐక్యవేదిక ఆహ్వాన కమిటీ చైర్మన్ వైద్యుల అంజన్ కుమార్ తెలిపారు. నగరంలోనీ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కీలకమైన బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తామన్న హామీ మేరకు ఇటీవల అసెంబ్లీ సమావేశంలో బీసీ సమగ్ర కుల గణన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం చారిత్రక నిర్ణయం అన్నారు. ఈ మేరకు రాష్ట్ర రవాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని బీసీ సంఘాల ఐక్య వేదిక అధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఆరుగ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేస్తుందని తెలిపారు. కుల గణను పారదర్శకంగా జరిపిస్తారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. బీసీల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి పొన్నంను బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ నెల 7 న నగరంలోని ఇందిరా భవన్‌లో నిర్వహించే మంత్రి పొన్నం ఆత్మీయ సత్కారానికి బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్ కుమార్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, గౌడ సంఘం అధ్యక్షుడు పందాల వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, రజక సంఘం అధ్యక్షులు దుబ్బాక రమేష్, పూసాల సంపత్, గంగపుత్ర సంఘం నాయకులు మోసం అంజయ్య, గడప నరసింహస్వామి, మున్నూరు కాపు సంఘం నాయకులు నలువాల రవీందర్, కర్ర రాజశేఖర్, దొంతి గోపి, కుర్మ సంగం నాయకులు మీస బీరయ్య, కురుమ సంఘం ట్రస్ట్ చైర్మన్ చిగుళ్ల శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సింగిరాల వెంకటస్వామి, జక్కం సంపత్ జక్కం పుల్లయ్య, నాగరపు సత్యనారాయణ, మంచాల రవీందర్, మాడిశెట్టి భాస్కర్, గోదెల వీరేశం, నాంపల్లి శ్రీనివాస్, మడుపు మోహన్, గణేష్ బాబు, సురేందర్రావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జనరల్‌బాడీ మీటింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

### అవినీతి, భూ కబ్జాలపై విచారణ చేపట్టాలి

### కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య


మాట్లాడుతున్న పొనగంటి మల్లయ్య

**నవతెలంగాణ - జమ్మికుంట**

గత జనరల్ బాడీ మీటింగ్‌లో పెట్టిన అంశాలను ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకే రెండవసారి పెట్టి ఆమోదం తెలిపారని, అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై విచారణ చేపట్టాలని, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు రాకుండానే జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించిన తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ పొన్నగంటి మల్లయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో జనరల్ బాడీ మీటింగ్ ఉదయం 11గంటలకు ఉందని సమాచారం ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీకి చెందిన 14మంది కౌన్సిలర్లం వస్తున్నామని మున్సిపల్ కమిషనర్, మేనేజర్‌కు ఫోన్ చేసి 11.30 గంటలకు వచ్చామన్నారు. తాము వచ్చే వరకే 30 నిమిషాల్లోనే హాజరైన 11మంది కౌన్సిలర్లతో ముగించేసారని మండిపడ్డారు. కనీసం ఎజెండా అంశాలను కూడా చదవకుండానే ఆమోదం తెలపడం హాస్యాస్పదమన్నారు. దుర్వినియోగం అయ్యే బిల్లులను ఆమోదం తెలిపారని ఆరోపించారు. జనరల్ బాడీ మీటింగ్ మళ్లీ పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా కాపాడడానికి పోరాటం చేస్తామన్నారు. ఈ విషయాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కొత్తపల్లిలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని, స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని, మిషన్ భగీరథ వాటర్ రావడం లేదని అధికారులకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని కౌన్సిలర్ పిట్టల శ్వేత ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై మాట్లాడడానికి కౌన్సిలర్లు జనరల్ బాడీ మీటింగ్‌కు వస్తే మున్సిపల్ చైర్మన్ నియంతతంగా వ్యవహరిస్తూ, సమావేశం ముగిసిందని వెళ్లిపోవడం ఇందులో మున్సిపల్ కమిషనర్ కూడా బాధ్యత వహించాలని టీపీసీసీ మెంబర్ సాయిని రవి అన్నారు. కౌన్సిలర్ దిడ్డి రాము, కాంగ్రెస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎజెండాలో నాలుగు అంశాలు 89,184 రూపాయలు రెండవసారి రావడం జరిగిందని, వాటికి గతంలో తీర్మానం చేసామని, కానీ పేమెంట్ కాలేదని వాటిని రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ వివరణ ఇచ్చారు.

## కొత్తపల్లి ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా శ్రీహరి



**నవతెలంగాణ - జమ్మికుంట :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ఆటో యూనియన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా మంతిని శ్రీహరిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దర్గుల కుమార్, కోశాధికారిగా ఎస్.రంజిత్, ప్రధాన కార్యదర్శిగా దరామారావు, ప్రచార కార్యదర్శిగా రామస్వామి, సలహాదారులుగా శ్రీనాథ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## ఇసుక లారీలను అడ్డుకున్న ముత్తారం రైతులు

### పంట ధ్వంసమవుతున్నాయని ఆందోళన



లారీలను అడ్డుకుంటున్న రైతులు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలంలోని మానేరు నుంచి ఇసుకను తరలిస్తున్న లారీలను ముత్తారం రైతులు మండల కేంద్రం వద్ద శుక్రవారం అడ్డుకున్నారు. ఇసుక లారీల రాకపోకల వల్ల తమ పంట పొలాలు ధ్వంసం అవుతున్నాయని ఆందోళనకు దిగారు. వందలాది ఇసుక లారీలు ఉదయం సాయంత్రం వరకు రాకపోకలు కొనసాగించడంతో రోడ్డుపై ఉన్న దుమ్ము, దూళి లేచి పంట పొలాలపై పడి దిగుబడి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఇసుక లారీలను అడ్డుకున్న విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చ జెప్పారు. రోడ్లపై వాటర్‌తో స్ప్రే చేయించాలని ఎస్ఐ మధుసూదన్‌రావు ఇసుక క్వారీల గుత్తేదారులకు సూచించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

## మద్దులపల్లి నందగిరి గ్రామ మహిళా కాంగ్రెస్ కమిటీల నియామకం

నవతెలంగాణ -పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని మద్దులపల్లి నందగిరి గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ సింగసాని విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మద్దులపల్లె గ్రామ శాఖ మహిళా అధ్యక్షురాలుగా గుర్రం లత, ఉపాధ్యక్షురాలు అజ్మీర జ్యోతి, కోతి రాజవ్వ, ప్రధాన కార్యదర్శి ఆరెల్లిమమత,నందగిరి గ్రామ శాఖ మహిళ అధ్యక్షురాలు మాచర్ల నర్సవ్వ, ప్రధాన కార్యదర్శి గాజుల కవిత, ఉపాధ్యక్షురాలు సాంకిటి లావణ్యసహాయ కార్యదర్శి నక్క రాజేశ్వరి, కోశాధికారి కీర్తన లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 112 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను శుక్రవారం పెగడపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు తహసిల్దార్ శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో డిటి రాజశేఖర్, ఎంపీవో మహేందర్, సూపర్ డెంట్ చక్రధర్, ఎంపీటీసీలు సింగ సాని విజయలక్ష్మి స్వామి, మందపల్లి అంజయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి నష్టపరిహారం అందజేత

నవతెలంగాణ- పెగడపల్లి



చెక్కు అందజేస్తున్న అధికారులు

పెగడపల్లి మండల పరిధిలోని మ్యాకవెంకయ్యపల్లి గ్రామానికి చెందిన నల్ల రాజిరెడ్డి అనే రైతు మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తో ఏడు నెలల క్రితం మృతి చెందాడు. నష్టపరిహారంగా విద్యుత్ శాఖ నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం పెగడపల్లి మండల కేంద్రంలో కుటుంబ సభ్యులకు ఏడిఈ వరుణ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సాయం

నవతెలంగాణ- పెగడపల్లి



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

పెగడపల్లి మండల పరిధిలోని రాములపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం సుంకే మనమ్మ -లచ్చయ్యల ఒక్క నెల వయసున్న బాబు ఊపిరితిత్తుల జబ్బుతో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. వారి పరిస్థితుల్లో ఉండడంతో గ్రామానికి చెందిన దీకొండ మహేందర్ రాములపల్లి కుటుంబం అనే వాట్సాప్ గ్రూప్‌లో ఆపన్న హస్తం కోసం ఆశగా ఎదురుచూపు అనే మెసేజ్ పోస్ట్ చేశాడు. ఈ పోస్టుకు గ్రామస్తులు స్పందించి 30,190 విరాళాలు అందించారు. శుక్రవారం గ్రామస్థులతో కలిసి మహేందర్ నిరుపేద కుటుంబానికి 30,190 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమిరిశెట్టి మల్లారెడ్డి, వెంగాళాయిపేట ఎంపీటీసీ కడారి సుప్రియ-తిరుపతి, కట్ల శ్రీనివాస్, మాజీ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు నీరటి రాజేందర్, మాజీ ఉప సర్పంచ్ పుల్కమ్ జలపతి,పుల్కమ్ నారాయణ, దానవేణి లక్ష్మణ్,తోట భూమయ్య పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కోరుట్ల

మండలంలోని జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన పల్లికొండ నవీన్ (31) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్‌కు పెండ్లి జరిగి ఆరు ఏండ్లు అవుతుంది. సంతానం కలుగడం లేదని బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో తీవ్ర మన స్థాపం చెంది ఇంటో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-గోదావరిఖని:

బిజెపి మాజీ జాతీయ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ 10వ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్దపల్లి రవీందర్, బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీపాద రావు జయంతి వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-ముత్తారం:

రాష్ట్ర ప్రభుత్వం మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాద రావు జయంతి వేడుకలను అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో ముత్తారం మండల కేంద్రంలోని కేశనపల్లి గ్రామంలో గల శ్రీపాదరావు విగ్రహం వద్ద జయంతి వేడుకల ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి ఆశ లత అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. జయంతి వేడుకలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపిడిఓ లలిత, ఎంపిఓ బైరి వేణు మాదవ్ గ్రామస్తులున్నారు.

## రెండవ రోజు ఫస్టియర్ విద్యార్థులకు పరీక్షలు

నవతెలంగాణ-ముత్తారం:

ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు రెండవ రోజు శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంగా 194 మంది విద్యార్థులకు గాను 175 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 22 మంది విద్యార్థులకు గాను 18 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 4 గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదు.

## మధ్యప్రదేశ్ చీఫ్ సెక్రటరీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -మెట్ పల్లి



మెట్ పల్లి పట్టణంలోని మార్కండేయ మందిరం కమ్యూనిటీ మధ్యప్రదేశ్ చీఫ్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈకార్యక్రమంలో పద్మశాలి పట్టణ సంఘ అధ్యక్షుడు ధ్యానపెల్లి రాజారామ్, రాష్ట్ర పద్మశాలి నాయకుడు సంబారి ప్రభాకర్, భీమనాది సత్యనారాయణ, మర్రి భాస్కర్ ,గురుడు తిరుపతి, జగదీశ్వర్, భాస్కర్, వేణుగోపాల్ ,చాట్ల గణేష్, సతీష్ ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

## కార్యాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-గోదావరిఖని:

కార్యాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయాన్నే వచ్చి కమిషనర్‌తోపాటు అధికారులు, సిబ్బంది చీపురు పట్టి శ్రమ దానం చేశారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, ఎస్ఇ చిన్నా రావు, సెక్రెటరీ రాజు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు , సూపరింటెండెంట్ మనోహర్ ఉన్నారు.

## హామీలు ఇచ్చి నెరవేర్చని గత బిఆర్ఎస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు పరుస్తుంది
- మిగిలిన నాలుగు గ్యారెంటీలను రాబోయే రోజుల్లో అమలు చేస్తాం
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



చెక్కులను అందజేస్తున్న రామగుండం ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:

గత బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి నెరవేర్చలేదని రామగుండం ఎమ్మెల్యే మక్కాం సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామగుండం నియోజకవర్గ పరిధిలో 76 మంది లబ్ధిదారులకు మంజూరైన 76,08,816 రూపాయల విలువజేసే కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించిందని, ప్రజలంతా ఈ విషయాలను గమనించే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టబెట్టారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పథకం కింద పది లక్షల రూపాయల వరకు నిరుపేద కుటుంబాలకు ఆరోగ్య భీమా అందించే విధంగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఆరు గ్యారెంటీలలో భాగంగా 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందించబోతున్నామని, మిగిలిన గ్యారెంటులను రాబోయే వంద రోజుల్లో తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. అలాగే ప్రతి నిరుపేద కుటుంబం ఆర్థిక భారంతో బాధపడకుండా ఉండేందుకు ఆడపిల్లకు పెళ్లి చేసిన సందర్భంలో త్వరలోనే కళ్యాణ లక్ష్మి పథకం, షాది ముబారక్ పథకం కింద లక్ష రూపాయలతోపాటు ఒక తులం బంగారం అందజేస్తామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు భోజన వసతి ఏర్పాటు చేసి స్వయంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూ ర్ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామగుండం కార్పొరేషన్ కార్పొరేటర్స్, బీసీ సెల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు, మైనార్టీ సెల్ అధ్యక్షులు, మహిళా విభాగం అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్జీ 1 జిఎం కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

సిఐటియు అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధానమైన స్థానిక సమస్యలపై ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, ఆర్జీ 1 కార్యదర్శి మెండే శ్రీనివాస్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాల కార్మికుల కుటుంబాలకు మురుగునీరు అందుతుందని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేసిన ఫలితంగా ఆరో ప్లాంట్లు సాంక్షన్ చేసి ఐదు మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చారని, మిగతా 5 అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మంచినీటి శుద్ధి కేంద్రం 20 కోట్లతో ఆరు నెలల క్రితం టెండర్ అవార్డు అయినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభించలేదని, తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేయడం చేశారు. సిఎస్పి వన్ నుంచి బొగ్గు దుమ్ము విపరీతంగా కార్మికుల పనిచేస్తున్న జిడికె 1, 3, 2, 2ఎ అండర్ గ్రౌండ్ గనుల్లోకి వెళుతుందని, కార్మికుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని అన్నారు. హాస్పటల్ సౌకర్యం మెరుగుపరచాలని, డ్యూటీలకు వెళుతున్న కార్మికుల రోడ్లు అధ్వానమైన పరిస్థితిలో ఉన్నాయని, రోడ్లు బాగు చేయాలని డిమాండ్ చేశారు. 11 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిఎం పర్సనల్ లక్ష్మీనారాయణకు ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షులు ఆరేపెల్లి రాజమౌళి, ఆసరి మహేష్, ఎస్‌కె గౌస్, శంకరన్న, వంగల రాములు, తిప్పారపు రాజు, దాసరి సురేష్, సాయి కృష్ణ నంది నారాయణ, అన్నం శ్రీనివాస్, మల్లేష్, సమ్మయ్య, సాగర్, బండారి సత్తి, 150 మంది తదితరులున్నారు.

## సింగరేణి ఆర్జీ 1లో 129శాతం బొగ్గు ఉత్పత్తి

### ఉత్పత్తి వివరాలను వెల్లడించిన ఆర్జీ 1 జిఎం

### చింతల శ్రీనివాస్



నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ 1 ఏరియా నుంచి ఫిబ్రవరి మాసంలో 3,36,400 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంకు గాను 4,32,519 టన్నులతో 129శాతం ఉత్పత్తి సాధించామని ఆర్జీ 1జిఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 2023-24 సంవత్సరంకు ఆర్జీ 1 ఏరియాకు 43,80,000 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని జిఎం తెలిపారు. సింగరేణి సిఅండ్ఎండి ఎన్.బలరాం ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పినలో భాగంగా తిలక్ నగర్ డౌన్‌లోని సింగరేణి స్కూల్ పాత భవనాన్ని ఆధునికరించి స్కిల్ డెవలప్ మెంట్ ట్రెనింగ్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించుకోవటం జరుగుతుందని జిఎం తెలిపారు. ఆర్జీ 1లో ఇప్పటి వరకు 1630 మంది ఉద్యోగులు మెడికల్ ఇన్‌వాలిడేషన్ అవగా, 1406 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించటం జరిగిందని, అదేవిధంగా 128 మందికి 25 లక్షల చొప్పున లంసమ్ అమౌంట్ తీసుకోవడం జరిగిందని తెలిపారు. 13 మందికి ఎంఎంసి ద్వారా నెలకు 26 వేల చొప్పున ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఆర్జీ 1 ఏరియాలో మొత్తం 1547 మందికి లబ్ది చేకూరటం జరిగిందని జిఎం తెలిపారు. సిపిఆర్ఎంఎస్ ద్వారా ఇప్పటి వరకు 5505 మందికి మెడికల్ కార్డులను పదవీ విరమణ పొందిన కార్మికులకు అందించటం జరిగిందని జిఎం తెలిపారు. వాటిలో 4582 మంది తమ కార్డులు రెన్యూవల్ చేసుకున్నారని, 923 మంది ఇంకా రెన్యూవల్ చేయవలసి ఉందని తెలిపారు. త్వరలోనే సింగరేణి కాలనీలకు శాశ్వత తాగు నీరు అందించటంలో భాగంగా ర్యాపిడ్ గ్రావిటి ఫిల్టర్ నిర్మాణం కోసం భూమి పూజా చేయనున్నామన్నారు.

## కార్మికుల సమస్యలపై సీఎండీకి వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి కార్మికుల సమస్యలపై సిఅండ్ఎండి ఎన్.బలరాం నాయక్‌ను తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల సొంతింటి పథకం, ఐటి మినహాయింపు, సింగరేణి కార్మికుల పిల్లలకు సిబిఎస్ సిలబస్, కార్మికులకు 20 లక్షల ఇంటి రుణం కల్పించాలని వినతి అందజే శారు. దీనికి సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వంలో చర్చిస్తామని సిఅండ్ఎండి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కామర గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షులు దేవి సత్యనారాయణ, న్యాయ సలహదారులు వెంగళ కనకన్న, నాయకులు కిరణ్, అంజన్న, రాజు, ఆవునూరి గోపాల్ తదితరులున్నారు.

## రామగుండం కమిషనరేట్‌లో నిషేధాజ్ఞల కొనసాగింపు

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై, అనుమతి లేని డ్రోన్,డిజె సౌండ్స్‌పై నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్న పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను, చిన్నపిల్లలు, వద్దులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డిజె సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలను మార్చి 01 నుంచి ఏప్రిల్ 01వ తేదీ వరకు పొడిగిస్తున్నామని పేర్కొన్నారు. పరిస్థితుల ప్రభావం దష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు

## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ముత్తారం: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలుంటాయని ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు హెచ్చరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు చాలా మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు మైనర్స్ ద్విచక్ర వాహనాలపై రావడం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, ఇష్టానురీతి వాహనాలను నడుపుతూ పరీక్ష కేంద్రాలకు వస్తున్నారని, ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే వాహనం నడిపిన వారికే కాకుండా ఎదుటి వారి కూడా నష్టం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాలు ఇచ్చిన కూడా చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

## ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:

ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరి జన్మదిన వేడుకలను కార్పొరేటర్ అయిత శివ కుమార్ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పిటిసి, బిజెపి రాష్ట్ర నాయకులు కందుల సంధ్యారాణి, విశిష్ట అతిథిగా మిట్టపల్లి రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం కార్యక్రమంలో రిటైర్డు ఆర్మీ సైనికులు 25 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో పరికిపండ్ల రామన్న, మల్క రామస్వామి, హరి రామకష్ణ, వాసు, శ్యామ్, కన్నం తిరుపతి, చింతకింద నాగరాజు, శ్రీనివాస్, సతీష్, ప్రకాష్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు మైస రాజేష్, కొంకటి లక్ష్మణ్, ఇంగ్లీష్ వెంకట్, రిటైర్డ్ ఆర్మీ సైనికులు, ఆలయ ఫౌండేషన్ సభ్యులు, తదితరులున్నారు.

## విశాల సహకార సంఘ అధ్యక్షుడిపై అవిశ్వాసం

### హైకోర్టు స్టేతో అవిశ్వాస ప్రక్రియ సిల్డ్ కవర్లో హైకోర్టుకు

### డిసిఓ సత్యనారాయణ



అవిశ్వాస పరీక్షకు హాజరైన డైరెక్టర్లు

నవతెలంగాణ -మెట్ పల్లి

విశాల సహకార సంఘ అధ్యక్షుడు తీగల లింగారెడ్డిపై 8 మంది సంఘ డైరెక్టర్ లు ఫిబ్రవరి 12 న అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ డిసిఓ సత్యనారాయణకు అవిశ్వాస తీర్మానం అందించారు. ఫిబ్రవరి 13న సంఘ డైరెక్టర్‌లకు మార్చి 1న అవిశ్వాసం నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం సహకార సంఘ కార్యాలయం మెట్‌పల్లి లో బలపరీక్షను డిసిఓ నిర్వహించారు. కొందరు సహకార సంఘ సభ్యులు, అధికారులతో కలిసి అవినీతికి పాల్పడ్డారని దీనిపై నోటీసులు ఇచ్చినన్న కక్షతో కొందరు అవిశ్వాసం పెట్టారని అధ్యక్షుడు తీగల లింగారెడ్డి ఆరోపించారు. సంఘ డైరెక్టర్‌లు అయిన చర్లపల్లి హన్మాండ్లు గౌడ్ బినామీల పేర్లపై 6 లక్షల రూపాయలు 2015 సంవత్సరంలో తీసుకోని ఇంతవరకు చెల్లించలేదని వడ్డీతోకలిసి 16 లక్షల వరకు అయ్యాయని, అల్లకొండ శ్రీకాంత్ ధనలక్ష్మి పథకం కింద 2013లో 50 తీసుకొని చెల్లించలేదని వడ్డీతో కలిసి లక్ష 25 వేలు అయ్యాయని, జోగిన్ పల్లి రాజేందర్ 2013లో 50 వేలు తీసుకొని చెల్లించలేదన్నారు. అలాగే మాజీ సిఈఓ మరిశెట్టి 5 లక్షల వరకు సంఘ నిధులు వాడుకొని చెల్లించలేదన్నారు. వీరందరికి డబ్బులు చెల్లించాలని నోటీసులు ఇవ్వడంతో కక్షగట్టి మాజీ సిఈఓతో కలిసి అవిశ్వాసం పెట్టారని ఆరోపించారు. దీనిపై హై కోర్టు ను ఆశ్రహించగా అవిశ్వాసం జరిపిన ఫలితం విలువరించవద్దని ఉత్తర్వులు ఇచ్చిందని లింగారెడ్డి తెలిపారు.13 మంది సంఘ డైరెక్టర్‌లకు గాను 9 మంది డైరెక్టర్‌లు అవిశ్వాసంకు హాజరు అయ్యారు.హైకోర్టు ఆదేశాల మేరకు జరిగిన మొత్తం విషయాన్ని సిల్డ్ కవర్లో హైకోర్టు కు పంపించనున్నట్లు డిసిఓ తెలిపారు. సహకార సంఘం లో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని, పలువురు రైతులు కోరుతున్నారు. అవిశ్వాసం సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో చర్యలు చేపట్టారు.

## మత్స్యశాఖలో అవినీతిపై సిబిఐ విచారణ జరిపించాలి

### ఉద్యోగానియామకాలు, చేపలు, రొయ్యల పంపిణీలో అవినీతి

### డీఎఫ్సిఎస్ చీఫ్ ప్రమోటర్ ప్రవీణ్

నవతెలంగాణ -మెట్‌పల్లి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు మత్స్యశాఖలో జరిపిన ఉద్యోగాల నియామకం, చేపలు, రొయ్యల పంపిణీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు అనుమానం ఉందని, దీనిపై సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అడిగినా అధికారులు స్పందించడం లేదని డీఎఫ్సిఎస్ చీఫ్ ప్రమోటర్ ప్రవీణ్ అన్నారు. అవినీతి జరుగకపోతే ఎందుకు సమాచారం ఇవ్వడం లేదో మత్స్యశాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖలో జరిగిన ఉద్యోగాల నియామకంలో అవినీతి జరిగిన అవినీతి బయటకు రావాలంటే సిబిఐ తోగాని హై కోర్ట్ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. జగిత్యాల జిల్లాలో ఎక్కడ కూడా రొయ్య పిల్లలు పోయలేదని అయినప్పటికీ రొయ్య పిల్లలను చెరువులలో పోసినట్లు బిల్లులు చెల్లించరన్నారు.రొయ్యపిల్లలు, చేపల పంపిణీలో జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని జిల్లా కలెక్టర్ దీనిపై విచారించి బిల్లులను నిలిపివేయాలని కోరారు. ఈ సమావేశంలో రమేష్,వన్నెల నర్సయ్య, మురళి, గంగాధర్, సాయి, రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండలం ఇందుర్తి, బాయమ్మపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంఎన్ఆర్ ఈజీఎస్ నిధుల నుంచి ఇందుర్తి గ్రామంలో ఐదు లక్షలతో, బాయమ్మపల్లి గ్రామంలో ఐదు లక్షల రూపాయల నిధులతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ కోసం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఎంపీటీసీ తిప్పారపు శారద సంపత్,సింగిల్ విండో డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్,పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండెటి ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు.

## సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

### సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు



డ్యామును పరిశీలిస్తున్న కృష్ణారావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

నియోజకవర్గానికి పక్కనే ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరినది నీటిని నియోజకవర్గ పంట పొలాలకు అందిస్తాం అని అంతేకాకుండా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి మూల రంపూర్‌లోని సదర్‌మట్‌ను శుక్రవారం సందర్శించారు. కార్యక్ర మంలో మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేందర్, రమేష్‌రెడ్డి, వెంకట్ రెడ్డి ఉన్నారు

## ఐజీగా బాధ్యతలు స్వీకరించిన రామగుండం సిపి

నవతెలంగాణ-గోదావరిఖని:



గౌరవ వందనం స్వీకరిస్తున్న సిపి

రామగుండం పోలీస్ కమిషనర్‌గా డిఐజి హోదాలో ఎం.శ్రీనివాసులు శుక్రవారం ఐజీ హోదాలో కమిషనర్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సాయుధ పోలీసుల గౌరవాన్ని స్వీకరించిన పోలీస్ కమిషనర్ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తూ సంతకాలు చేశారు.

## సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం నగర అభివృద్ధికి టియుఎఫ్ఐడిసితో పాటు వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్ర పటానికి రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, పలువురు కార్పొరేటర్లు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జనగామ కవితా సరోజిని, బాల రాజ్‌కుమార్, ముస్తాఫా, మహమ్మద్, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, అడ్డాల రామస్వామి, సలీం, నీలం గణేష్, పొన్నం లక్ష్మణ్ గౌడ్, గణముక్కుల తిరుపతి తదితరులున్నారు.

## అనాథ పిల్లల ఆశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-గోదావరిఖని:



అన్నదానం చేస్తున్న నాయకులు

ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి జన్మదిన సందర్భంగా గోదావరిఖని విఠల్ నగర్‌లోని అమ్మపరివార్ ఆశ్రమంలో ఫౌండేషన్ సభ్యులు కోలుగురి వెంకటేష్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పిల్లల మధ్య కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మిట్టపల్లి రాజేందర్, రమేష్‌బాబు, వెంకన్న, నారమల్ల రమేష్, గుంపుల శ్రీధర్, అఫ్సర్, దీక్షిత్, సాగర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

## వివాహ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అమ్మపరివార్ అనాథ పిల్లల ఆశ్రమంలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) మనువడు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి తనయుడు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గడ్డం వంశీకృష్ణ రోషిని వివాహ వార్షికోత్సవ వేడుకలను కాంగ్రెస్ యువ నాయకులు మగ్గిడి దీపక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర పీసీసీ నాయకులు గుమ్మడి కుమారస్వామి పాల్గొన్నారు.

## విశ్వభారతిలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్

నవతెలంగాణ-గోదావరిఖని:



వేడుకలను ప్రారంభిస్తున్న ఎంవిఐ

ఎన్టీపీసీలోని విశ్వ భారతి హైస్కూల్లో విశ్వభారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో యూకేజీ విద్యార్థులకు కాన్వకేషన్ ప్రోగ్రాం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి రామగుండం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భీమ్ సింగ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో విశ్వ భారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ అధ్యక్షత వహించగా హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్, ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, కరాటే గ్రాండ్ మాస్టర్ మొండయ్య, ప్లే స్కూల్ ఇంచార్జ్ విజయ, సునీత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన తెలిపిన వివిధ సంఘాల ప్రతినిధులు




జ్ఞాపిక అందజేస్తున్న సంఘాల ప్రతినిధులు

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:

రామగుండం నియోజక వర్గం అభివద్ధి కోసం రూ.126 కోట్ల బడ్జెట్‌ను మంజూరీ చేయించినందుకు గాను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో వివిధ సంఘాల ప్రతినిధులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు, అభినం దనలు తెలిపారు. కలిసిన వారిలో వివిధ సంఘాల ప్రతినిధులు చింతల రాజిరెడ్డి, ట్రస్మా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కంది రవీందర్ రెడ్డి, గోదావరిఖని ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమ్మెంతల దేవేందర్ రెడ్డి ఉన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన గోపు ఐలయ్య యాదవ్

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:



ఆర్థిక సహాయం అందజేస్తున్న గోపు అయిలయ్య యాదవ్

గోదావరిఖని లెనిన్ నగర్‌లో నివాసముండే ఆటో డ్రైవర్ గాజుల చంద్రమౌళి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ అధ్యక్షులు గోపు ఐలయ్య యాదవ్ మృతుని కుటుంబాన్ని శుక్రవారం కలిసి పరామర్శించారు. మృతుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, కుటుంబానికి ధైర్యం చెప్పారు. తక్షణ సహాయంగా 5వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సీనియర్ నాయకులు ఈర్ల ఐలయ్య, నీలారపు రవి, రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి గాజుల రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరెల్లి విజయ్‌కుమార్, కోశాధికారి రేణికుంట్ల సురేష్, అధికార ప్రతినిధి ఎండి సర్వర్ పాషా, బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ నాయకులు ఎలకలపల్లి అంజయ్య, గాజుల ప్రభాకర్, ఈర్ల సారయ్య, శంకర్, అర్జున్, రవి తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
రాజన్న సిరిసిల్ల
శనివారం | మార్చి 02, 2024 | www.navatelangana.com

## పల్స్ పోలియోపై అవగాహనా సదస్సు


అవగాహన సదస్సులో పాల్గొన్న ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు.

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** మండలంలోని పోతుగల్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ వైద్యాధికారి గీతాంజలి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై ఏఎన్ఎంలకు ఆశా వర్కర్లకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల పిల్లల వరకు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని తెలిపారు. మార్చి మూడో తేదీన పోలియో చుక్కలు వేస్తారని చిన్నపిల్లలు ఉన్న తల్లిదండ్రులంతా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య సిబ్బంది ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కేటీఆర్ కృషితో సిరిసిల్ల అన్ని రంగాల్లో అభివృద్ధి

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యే కేటీఆర్ కృషితో రాజన్న సిరిసిల్ల జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ నాయకులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత కేటీఆర్ అని, ఆయనపై కెకె మహేందర్ రెడ్డి మాట్లాడిన తీరు సరైంది కాదన్నారు. సిరిసిల్ల అభివృద్ధికి వందల కోట్ల నిధులు కేటాయించి అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేటీఆర్ కృషితో సిరిసిల్ల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినదన్నారు. సిరిసిల్ల ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. సిరిసిల్ల అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే కేటీఆర్ ని విమర్శిస్తే ఊరకునేది లేదన్నారు. పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం హయాంలో ఎన్నికల ముందు 40 కోట్లు కేటాయించి, టెండర్లు పూర్తయ్యాయన్నారు. కానీ 40కోట్ల టెండర్ పనులును ఆపి, సిరిసిల్లకు రూ.1కోటి 27లక్షలతో పనులు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఆగిన రూ.40కోట్ల నిధులను సిరిసిల్ల అభివృద్ధికి తీసుకరావాన్నారు. మాజీ తెలంగాణ టెక్స్టైల్, పవర్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ గుడూరి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గత ప్రభుత్వం ఫిబ్రవరి నెలలోనే బతుకమ్మ చీరల అర్డరులు ఇచ్చేదని, ఇప్పుడు ఆర్డర్లు రాక నేతన్న లకు ఉపాధి కోల్పోయారాన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రఘువరెడ్డి ,కుంబాల మాల్ల రెడ్డి, సత్తార్, పూర్ణచందర్, అందె సుభాష్, అన్నారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం

**నవతెలంగాణ - బోయినిపల్లి :** బోయిన్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. బోయినపల్లి మండల కేంద్రంతోపాటు తడగొండ, స్తంభంపల్లి, గుండన్నపల్లి, కోరెం, బూరుగుపల్లి, గ్రామాల్లో నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.35లక్షల నిధులతో సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మెడిపల్లి సత్యం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. మండలంలోని పలు గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు పూలబోకెలతో శాలువాలతో మేడిపల్లి సత్యంకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, తహసీల్దార్ పుష్పలత, నాయకులు ఏనుగుల కనుకయ్య, నాగుల వంశీ, బండి శ్రీనివాస్, శాలివాహన శ్రీనివాస్, కత్తెర పాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెద్దగుట్టను దర్శించుకున్న ఆది శ్రీనివాస్

### సాదుల్ల బాబా దర్గాలో మొక్కు చెల్లింపు


సాదుల్ల బాబా దర్గాలో మొక్కు చెల్లిస్తున్న ఆది శ్రీనివాస్

**నవతెలంగాణ - వేములవాడ :** శాసన సభ ఎన్నికల్లో వేములవాడ నియోజక వర్గం ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందాలని కొనరావుపేట మండలం బావుసాయిపేట ఎంపీటీసీ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషాలు నిజామాబాద్ జిల్లా వర్ని మండలం పెద్దగుట్ట సయ్యద్ షాదుల్లా బాబా దర్గాకు మొక్కుకున్నారు. ఆది శ్రీనివాస్ అఖండ విజయం సాధించడంతో యాస్మిన్ ఫిరోజ్ పాషాలు బావుసయిపేట గ్రామం నుంచి పెద్దగుట్ట వరకు పాదయాత్ర నిర్వహించారు. గురువారం పాద యాత్ర సాదుల్లా బాబా క్షేత్రానికి చేరుకున్నారు. శుక్రవారం రోజున మొక్కు చెల్లించే కార్యక్రమంలో భాగంగా వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా సాదుల్లా బాబాకు చాదర్ సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పెద్దగుట్టలో ప్రాంతంలో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, చింతపంటి రామస్వామి, ప్రభాకర్, పులి సత్యం, అబ్దుల్ రషీద్, కనికరపు రాకేష్, దేవరాజు, వేములవాడ, కొనరావుపేట, చందుర్తి, మండలాల కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలలో 6,7,8,9వ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నడుస్తున్న 23 ఏకలవ్య పాఠశాలలో 6వ తరగతికి ప్రవేశాలు కల్పిస్తున్నది. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రతి పాఠశాలలో 60ప్రవేశాలు ఉన్నాయయి. వీటిలో బాలురకు 30సీట్లు, బాలికలకు 30సీట్లు ఉన్నాయి. 7వ, 8వ, 9వ తరగతిలో గల బ్యాక్‌లాగ్ ఖాళీలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎల్లారెడ్డిపేట ఈఎంఆర్ఎస్ ప్రధానోపాధ్యాయులు రామారావు కోరారు. ఎస్టీ బాలబాలికలు, ఆదివాసీ, సంచార గిరిజనులు తదితరులు అర్హులని వివరాల కొరకు https://tsemrs.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మార్చి 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి, ఏప్రిల్ 21న పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూ, స్పోర్ట్స్ డ్రెస్స్, అనేకమైన వస్తువులు వారికి ఇవ్వబడుతున్నాయన్నారు. సీబీఎస్ పద్ధతిలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు తెలిపారు.

# నిఘా నేత్రం నీడలో ఫజుల్ నగర్ గ్రామం

- నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్..


నిఘా నేత్రాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్


సమావేశానికి విచ్చేసిన గ్రామస్తులు

**నవతెలంగాణ - వేములవాడ రూరల్ :** వేములవాడ రూరల్ మండలం ఫజుల్ నగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 10సీసీ కెమెరాలను, పోలీస్ అధికారులు, సీసీ కెమెరాల దాతలు, ప్రజాప్రదినిధులతో కలసి జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ప్రారంభించారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా ఎస్పీకి గ్రామస్తులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన దాత గొడుకు రాజ్ కుమార్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అభినందించారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, గ్రామంలో ఏ చిన్న ఘటనా జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని, గ్రామాల్లో సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయన్నారు. ఒక సీసీ కెమెరా 100పోలీస్‌లతో సమానం అని, సీసీ కెమెరాల ద్వారా ఈ మధ్యకాలంలో చాలా కేసులు ఛేదించినట్టు తెలిపారు. కేసుల ఛేదన సమయంలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలో రాత్రింబవళ్లు 24గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు లేని గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి ముందుకు వచ్చి పోలీస్ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ మధ్య కాలంలో జిల్లా పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారు జైలు శిక్షలు అనుభవించారన్నారు. జిల్లా పోలీస్ శాఖ మాధకద్రవ్యాల నిర్మూలానే లక్ష్యంగా పని చేస్తుందని, మాధకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. డ్రగ్స్ తీసుకుంటున్న, విక్రయిస్తున్న వారి వివరాలు అందిస్తే వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. జిల్లాలో మాధకద్రవ్యాలకు అలవాటు పడిన వారిని సన్మార్గంలో నడిపించడానికి డి-ఆడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా వేములవాడ ను అభివద్ధి చేసుకుందాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పలు సంఘాల ఆత్మీయ సమ్మేళనలో పాల్గొన్న ఆది


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

**నవతెలంగాణ - వేములవాడ :** కలిసికట్టుగా వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని 14 కుల సంఘ భవన నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఎమ్మెల్యేగా గెలిచి మొట్టమొదటిసారి కుల సంఘాల్లోకి వచ్చినందుకు ప్రభుత్వ విప్‌ను ఘనంగా సన్మానించారు. మహాలక్ష్మి వీధిలోని శాలివాహన సంఘం, శ్రీ మహాలక్ష్మి ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పలు కుల సంఘ భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో నా విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. మీరు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రభుత్వ పెద్దలు నాకు ప్రభుత్వ విప్‌గా అవకాశం కల్పించారన్నారు. నా ఎమ్మెల్యే పదవిని వేములవాడ నియోజకవర్గ ప్రజలకు అంకితం చేశానన్నారు. మనమందరం కలిసికట్టుగా ఉంటూ వేములవాడ పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగారం వెంకటస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, బైరి సతీష్, పుల్కం రాజు, తూ మధు, పులి రాంబాబు గౌడ్, ముంజ ఉమేందర్, పిల్లి రాజేందర్ వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సిరిసిల్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె.మహేందర్‌రెడ్డి
- రూ.20లక్షలతో ఎస్‌పీడీ పనులకు భూమి పూజ


శంకుస్థాపన చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** సిరిసిల్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె.మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామంలో రూ.20లక్షలతో ఎస్‌పీడీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కేకే మహందర్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధికి రూ.9కోట్ల 50లక్షల స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద ముఖ్యమంత్రి నిధి నుంచి మంజూరు చేసినట్టు తెలిపారు. రూ.2కోట్లతో ఉపాధి హామీ కింద సీసీ రోడ్లు, అదనపు తరగతి గదులు, శ్మశాన వాటికల అభివృద్ధి కోసం కేటాయించామన్నారు. ముఖ్యమంత్రి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద బండలింగంపల్లి గ్రామంలో మురికి కాలువ నిర్మాణానికి రూ.5లక్షలు, సింగారం గ్రామంలో మురికి కాలువ నిర్మాణానికి రూ.5లక్షలు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాదిగ దండోరవర్గం శ్మశాన వాటికకు రూ.5లక్షలు, గౌడ సంఘం శ్మశాన వాటికకు రూ.5లక్షలతో పనులకు భూమి పూజ చేసినట్టు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6గ్యారెంటీలకు కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ లేనిపోని అబద్దాలు చెబుతూ ప్రజలను గందరగోళంలోకి నెట్టుదామని ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల పూర్తి నమ్మకంతో ఉన్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మరోసారి కాంగ్రెస్‌ను ఆదరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు కొత్తపల్లి పద్మ, మధు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, బండలింగంపల్లి మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి దేవయ్య, నాయకులు లింగం గౌడ్, ఎల్లాగౌడ్, అంజిరెడ్డి, దేవయ్య, గఫార్, మల్లేశం, బుచ్చాగౌడ్, రాంరెడ్డి, చెన్నిబాబు, హనుమయ్య, ఎల్లయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# జిల్లాలో 3న పల్స్ పోలియో చుక్కల పంపిణీ

- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు
- జిల్లాలో ఐదేండ్లలోపు పిల్లలు 44,770మంది


మాట్లాడుతున్న కలెక్టర్

**నవతెలంగాణ - సిరిసిల్ల :** ఈ నెల 3వ తేదీన ఆదివారం జిల్లాలో పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. వైద్య శాఖ అధికారులు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో పోలియో వాక్సిన్లు అందుబాటులో ఉంచారు. జిల్లాలో మొత్తం 44,770 మంది ఐదేండ్ల లోపు పిల్లలు ఉన్నారు. 394 కేంద్రాల్లో... అప్పుడే పుట్టిన పాప నుంచి ఐదేండ్లలోపు పిల్లల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 3వ తేదీన (ఆదివారం) జిల్లాలో పోలియో చుక్కలు వేయనున్నారు. జిల్లాలో మొత్తం ఐదేండ్లలోపు పిల్లలు 44,770 మంది ఉన్నారు. జిల్లాలో 2 సీహెచ్ సీ, 15పీహెచ్ సీలు కలిపి మొత్తం 17ఉండగా, 89సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 394 పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేశారు. 3వ తేదీన పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన స్థలాల్లో పల్స్ పోలియో చుక్కలు పంపిణీ చేయనున్నారు. అలాగే 25 మొబైల్ టీంలు అందుబాటులో ఉండనున్నాయి. అలాగే పట్టణాలు, గ్రామాలకు దూరంగా ఉన్న ఇండ్లలోని పిల్లలకు, ఇంకా ఎవరైనా పిల్లలు మిగిలి ఉంటే వారికి 4, 5వ తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వేయనున్నారు.

**పల్స్ పోలియో చుక్కలు వేయించాలి : అనురాగ్ జయంతి, కలెక్టర్**

ఐదేండ్లలోపు వయసు ఉన్న పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. దగ్గరలోని కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

# కేటీఆర్ మేడిగడ్డకు ఎందుకు వెళ్లాడు


సిరిసిల్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి

**నవతెలంగాణ - సిరిసిల్ల :** కేసీఆర్ నోటితో పలికిన బొందలగడ్డ మేడిగడ్డకు కేటీఆర్ ఎందుకు వెళ్లాడని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె.మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ మేడిగడ్డ సందర్శన కూల్చే రాయి తీయనోడు యేట్ల రాయి తీసినట్లుందని ఎద్దేవా చేశారు. 10సంవత్సరాలు కాలేశ్వరం ప్రాజెక్టుపై పడి దోచుకున్నదంతా దాచుకున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి చెయ్యకపోతే అసెంబ్లీకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిలువదని ముందుగానే అనుభవజ్ఞులు చెప్పారని, ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంపై చట్టసభలో ఎందుకు చర్చకు రాలేదని మండిపడ్డారు. మేడిగడ్డ సందర్శనకు రావాలని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పినా ఎందుకు రాలేదని విమర్శించారు. అసెంబ్లీకి రాని కెసిఆర్ నల్గొండకు వెళ్లి అసత్యాలు పలికారని, ఆంధ్ర సీఎంతో కలిసి పంచభక్ష పరమాన్నాలు తిని కృష్ణ నీటిని ఆంధ్రకు వదిలారన్నారు. ఓట్ల రాజకీయాల కోసమే కేటీఆర్ ఇలాంటి ప్రయాణాలు చేస్తున్నాడని ఆరోపించారు. సిరిసిల్ల లో 9వ ప్యాకేజీ పనులను ఆపడం వల్ల ఎగువ మానేరు ఇప్పుడు ఎండిపోయి ప్రాంత ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లాను అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న కేటీఆర్, అసెంబ్లీలో పద్మశాలీల బకాయిల గురించి ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ నాయకులపై అనుచిత వాక్యాలు మానుకొని ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సి సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పద్మశాలి సెల్ అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు స్వరూపా, రాగుల జగన్, నాయకులు గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, కోడం శ్రీనివాస్ శరణ్య గుండ్ల పెల్లి గౌతం గోనె ఎల్లప్ప కోడం అమర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీసీలు

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** మండలంలోని ఆవునూరు గ్రామంలో ఎంపీ నిధుల నుండి రూ.12లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం జెడ్పీటీసీ నరసయ్య, ఎంపీటీసీ లలిత, నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఆవునూరు గ్రామానికి ఎంపీ నిధులు మంజూరు చేసిన బండి సంజయ్ కు ఎంపీటీసీ లలిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డ బోయిన గోపి, మండల అధ్యక్షులు మెరుగు అంజగౌడ్, మాజీ సర్పంచ్ బద్ది కళ్యాణి భాను, రెడ్డి సంఘం, గౌడ సంఘం అధ్యక్షులు ధమ్మా సత్యం రెడ్డి, పొట్టి నర్సగౌడ్, మాజీ వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు కనేమేని శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ సభ్యులుజక్కుల లావణ్య నర్సింహులు, బూత్ అధ్యక్షులు నక్కల రాజు, కసారపు రవి, నర్ర పోశిరెడ్డి నాయకులు మల్లారెడ్డి, వేణు, క్రాంతి కుమార్, శంకరయ్య, పర్శరములు, గణేష్, నరేష్, శివ శ్రీకాంత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్ ఉత్సవాలు


ముస్తాబాదులోని రాఘవేంద్ర పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఉత్సవాలు

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** మండలంలోని రాఘవేంద్ర పాఠశాలలతో పాటు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్ ఉత్సవాలు పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాల యాజమాన్యం నిర్వహించారు. విద్యార్థులు చేసిన పలు ప్రయోగాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నరేష్, మంజుల, పద్మ, అపర్ణ, రిజ్వాన లతా సంధ్య భాను ప్రసాద్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం


రేవంత్ రెడ్డి చిత్ర పాలాభిషేకం చేస్తున్న పలువురు

**నవతెలంగాణ - గంభీరావుపేట :** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలంలో గల నిరుద్యోగులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, నిరుద్యోగులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ కల్పనలో భాగంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్ చేయడం జరిగిందని, తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాల వల్ల ఉద్యోగుల తెలంగాణగా మారుతుందన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు పాపా గారి రాజు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగి స్వామి, మైనారిటీ జిల్లా కార్యదర్శి తాజుద్దీన్, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మెడ భాస్కర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మేడ రమ, నిరుద్యోగులు వెంకటేష్, రాజు, శ్రీకాంత్, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

### సిరిసిల్ల ఇన్‌చార్జి కెకె మహేందర్ రెడ్డి



**నవతెలంగాణ - గంభీరావుపేట :** అభివృద్ధి, ప్రజా సంక్షేమం సమపాల్లల్లో నడిపిస్తూ ప్రభుత్వం ముందుకేళుందని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గంభీరావుపేట మండల పరిధిలోని లింగన్నపేట గ్రామంలో బీసీ కాలనీలో రూ.10లక్షల వ్యయంతో ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా సీసీ రోడ్ మంజూరు చేయడంతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని సంక్షేమాన్ని సమానంగా నడిపిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామని ప్రస్తుతం నాలుగు గ్యారంటీలను అమలుపరచామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అమలు చేసి చూపెట్టిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో లింగన్నపేట స్థానిక నేతలు, మండల అధ్యక్షుడు హమీద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోమిరిశెట్టి తిరుపతి, రాజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పథకాలను విమర్శించిన వ్యక్తిపై కేసు

**నవతెలంగాణ - గంభీరావుపేట:** ప్రభుత్వ పథకాలను విమర్శిస్తూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టిన ఓ వ్యక్తిపై కేసు నమోదైన ఘటన గంభీరావుపేట పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాంమోహన్ తెలిపిన వివరాల ప్రకారం మల్లుపల్లె గ్రామానికి చెందిన మరాటి రాజయ్య కుమారుడు భూదయ్య స్థానికంగా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఐతే జనవరి 13న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తులను అవమానాపరిచేలా, ప్రజల దృష్టిలో హేళన చేస్తూ కించపరిచేలా మరాటి రవికుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడం జరిగింది. దీంతో ఫిబ్రవరి 26న కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో పిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం అధికారులు గ్రామానికి వచ్చి వెళ్లిపోయారు. అనంతరం నుంచి నన్ను నా కుటుంబాన్ని చంపుతామని బెదిరింపులకు పాల్పడటంతో గంభీరావుపేట పోలీసులను ఆశ్రయించి పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక




# పెద్దపల్లి-జగిత్యాల

శనివారం | మార్చి 02, 2024 | www.navatelangana.com

## తోటి విద్యార్థి వైద్యంకోసం చిన్నారి ఆర్థిక సహాయం



**నవతెలంగాణ-పెద్దపల్లి :** బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తోటి విద్యార్థి వైద్యం కోసం కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బులను అందించి మానవత్వాన్ని, తమ స్నేహాన్ని చాటు కుందో చిన్నారి. పెద్దకల్వల గ్రామంలోని నోబెల్ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న వర్షిత్ అనే బాలుడు ఇటీవల బ్లడ్ క్యాన్సర్ బారినపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ.17లక్షలు వరకు అవసరమవు తాయని వైద్యులు తెలపడంతో బాలుడి తల్లి దండ్రులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రెండవ తరగతి చదువుతున్న బొంకూరి స్వర్ణవర్షిణి తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న పదకొండువందల ఒక్కరూపాయిని వర్షిత్ వైద్యం కోసం అందించి మానవత్వాన్ని చాటుకుంది. చిన్నారి స్వర్ణవర్షిణి, చిన్నారి తండ్రి బీఎస్పీ నాయకుడు బొంకూరి అన్వేష్ ల గొప్ప మనసును మాచర్ల స్రవంతిశ్రీనివాస్, రామంచ పావనిఅరుణ్, బెజ్జాల మౌనిక లక్ష్మణ్ తో పాటు పలువురు అభినందిచారు.

## ప్రతిమ పౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



**నవతెలంగాణ-కథలాపూర్ :** కథలాపూర్ మండలంలోని మోడల్ స్కూల్‌లో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను చెన్నమనేని వికాస్‌రావు దీప శుక్రవారం ప్రారం భించారు. ఎండాకాలం లో విద్యార్థులు డిహైడ్రేషన్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రహించి వాటర్ ప్లాంట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు.

## బూత్ వైజ్ పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



మెడికల్ ఆఫీసర్ బండి నీలిమ

**నవతెలంగాణ-యైటింక్లైన్‌కాలనీ :** మార్చ్3 ఆదివారం 8వ కాలనీలో జరిగే బూత్ వైజ్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూపీహెచ్‌సి అల్లూరు మెడికల్ ఆఫీ సర్ డాక్టర్ బండి నీలిమ శుక్రవారం తెలిపారు. 0 నుండి 5 సంవత్సరాలున్న పిల్లలకి పోలియో చుక్కలు వేయడానికి 8వ కాలనీలోని మారేడుపాక స్కూల్, పోతనకాలనీ డిస్పెన్సరీ, పోతన కాలనీ ఏటీఎం, అల్లూరు స్కూల్,స్పందన మాడల్ స్కూల్, హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్, సీఈఆర్ క్లబ్, పోస్ట్ ఆఫీస్ ఏరియా, సంతోష్‌నగర్, శ్రీవానీ స్కూల్, సింగరేణి సేవా సమితి, ఎస్టీ కాలనీలలో 12 బూత్‌లు ఏర్పాటు చేసామని ఒక్కో బూత్‌కు 4 మెంబర్స్ చొప్పున ఉంటారని స్థానిక ప్రజలు ఇప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుండి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించడానికి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పిల్లలను ఈ బూత్ ల వద్దకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని ఆమె కోరారు.

## పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు గాలికుంటు టీకాను అందిస్తున్న డాక్టర్ అజారుద్దీన్

**నవతెలంగాణ-జూలపల్లి :** జూలపల్లి మండలంలో ఈనెల 30వ తేదీ వరకు అన్ని గ్రామాలలో పశువులకు గాలి కుంటువ్యాధి, నివారణ కోసం, టీకాలను అందిస్తామని జూలపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ అజారుద్దీన్ తెలిపారు. అబ్బాపూర్ గ్రామంలో 243 ఆవులకు, 233 గేదెలకు టీకాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు దండే వెంకటేశం, గోపాలమిత్ర మోహన్ రెడ్డి, రైతులు శంకర్, రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఎలిగేటి మండలంలోని ముప్పిరి తోట గ్రామంలో 152 గేదెలకు, 54 ఆవులకు ,29 ఎడ్లకు టీకాలు వేశామని ఎలిగేడు మండల పశువైద్యాధికారిని ఝాన్సీ తెలిపారు. వారి వెంట సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో అవగాహన

**నవతెలంగాణ-జూలపల్లి :** జూలపల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల వైద్యాధికారి డాక్టర్ సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన సదస్సును నిర్వహించారు. పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల వరకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఐదు సంవత్సరాల పిల్లలకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే, వారికి పోలియో ఇవ్వకూడదని తెలిపారు. ఆది, సోమ, రెండు రోజులలో ఇంటింటికి పల్స్ పోలియో చుక్కలను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, ఎంపీఓ కిరణ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి, ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు ,అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వార్షికోత్సవం విజయవంతం చేయాలి

**నవతెలంగాణ-జగిత్యాల టౌన్ :** ఈ నెల 3వ తేదిన హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఆడిటోరి యంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పం చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు ఎలాంటి భంగం కలిగిన సహించేది లేదని, మానవ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టాల పైన సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులందరూ ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై, తెలంగాణ స్టేట్ మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఐలనేని శ్రీనివాస రావు, తెలంగాణ పోలీస్ అకాడమీ ఫ్యాకల్టీ రజిత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం



**నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :** జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను జగిత్యాల అర్బన్ రూరల్ మండలం ఆర్ఎంపి, పి.ఎం.పి వెల్ఫేర్ అసోసి యేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్ఎంపి, పిఎంపి సంఘం భవనానికి 10 గుంటల స్థలం కేటాయించడం జరిగిందని, ఆర్ఎంపి, పిఎంపి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతుగా కషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బుదారపు జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడు కొండబత్తిని గణేష్, సెక్రటరీ కోల మహేందర్ ట్రెజరర్ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ గోపి, కార్యవర్గ సభ్యులు మోహన్, బి.రాజేష్, రాజారాం, ఎండి అబ్దుల్లా, భూమరాజం, టి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల వాడకంపై అవగాహనా సదస్సు

**నవతెలంగాణ-మేడిపల్లి :**

ప్యాక్స్ వల్లంపల్లి ఆధ్వర్యంలో ఇఫ్కో ఎరువుల కంపెనీ సహకారంతో సంఘ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కల్పించనున్నట్టు చైర్మన్ మేనేని రవీందర్రావు, సీఈవో తూర్తి గోపి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, ఇఫ్కో స్టేట్ మేనేజర్, జిల్లా సహకార అధికారి, వ్యవ సాయ శాస్త్రవేత్తలు, ఏడిఏ, మండల వ్యవసాయ అధికారి, ఇఫ్కో జిల్లా మేనేజర్ పాల్గొననున్నట్లు తెలిపారు. డ్రోన్ పైనా అవగాహన సదస్సు నిర్వ హించనున్నట్లు తెలిపారు. వల్లంపల్లి సహకార సంఘం పరిధిలోని రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైతులను సమన్వయం చేస్తూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**నవతెలంగాణ-పెద్దపల్లి :** జిల్లాలోని రైతులతో సమన్వయం చేసుకుంటూ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎస్సారెస్పీ డీ 83, డీ 86 కాల్వల కింద 5వ తడి నీటి విడుదలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ యాసంగి సాగులో నీటి విడుదలపై రైతులలో ఉన్న అపనమ్మకాలను పూర్తిస్థాయిలో తొలగించే విధంగా నీటిపారుదల, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, సాగు నీటి విడుదలపై రైతులలో విశ్వాసం కలిగించాలని అన్నారు. ఎస్సారెస్పీ నుంచి 5వ తడి కింద మన జిల్లా అధికార యంత్రాంగం అందించిన నివేదిక ప్రకారం 7 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారని, మన జిల్లాలో ఉన్న డీ 83, డీ 86 కాల్వల కింద 2500 క్యూసెక్కుల నీరు అందుబాటులో ఉంటుందని, దీనిని సమర్థవంతంగా వినియోగిస్తూ పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న వ్యవసాయ, సాగునీటి అధికారులు వెంటనే ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధి గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగునీటి విడుదలకు సంబంధించి అవలంబిస్తున్న విధానాన్ని రైతులకు తెలియజేసి, రైతులను సమన్వయం చేస్తూ ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా కషి చేయాలని, వారంలో 3 రోజుల పాటు (సోమ,బుధ,శని వారం) సాగునీటి విడుదలపై సమన్వయ సమావేశం నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధికారులు సమాచారం అందించాలని, జిల్లాలో ఏ రైతు అవస్థ పడకుండా అందరికీ సమానంగా అవసరమైన మేర సాగునీరు విడుదల అవుతుందని, ప్రతి డీఈ తన డివిజన్ పరిధిలో ప్రణాళికాబద్ధంగా సాగునీరు వచ్చే విధంగా కషి చేయాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిలో నమ్మకం కలిగించాలని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు , వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**వారం రోజుల్లో పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను 7 రోజుల్లో పరిష్కరించి పెండింగ్ జీరో చేయాలని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారించి డిస్పోజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పెండింగ్ ధరణి దరఖాస్తుల డిస్పోజల్‌పై అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత తహసిల్దార్, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పెండింగ్ ధరణి దరఖాస్తులను డిస్పోజ్ చేయాలని, దీని కోసం మండలంలో రెవెన్యూ అధికారులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుందన్నారు.

## పెరిగిన వేతనాలు మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు**



వినతి పత్రం ఇస్తున్న ముత్యంరావు, నాయకులు

**నవతెలంగాణ- సుల్తానాబాద్ :** పెరిగిన వేతనాలను మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన గాజుల లక్ష్మీ రాజమల్లును మున్సిపల్ యూనియన్ నాయకత్వంతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు అమలు చేయాలని వినతిపత్రం ఇచ్చారు, అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ.. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు 1000 రూపాయలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2న మెమో జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సుల్తానాబాద్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల వేతనాలు ఈ నెల నుండి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా గతంలో పెంచిన వేతనాల ఎరియర్స్ మూడు నెలలు బకాయి ఉన్నాయని, సుమారు రెండు సంవత్సరాల నుంచి సబ్బులు, బట్టలు, చెప్పులు, నూనె, పనిముట్లు ఇవ్వలేదని, రెండు నెలల వేతనాలు బకాయి ఉన్నాయని, వీటన్నింటినీ వెంటనే చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకొని పేద కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాక మహేష్, నాయకులు మహంకాళి మల్లేష్, న్యాతరి రమేష్, బాబు, నరసింగం, రాజేష్, క్యాదాసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్‌తో అధికారుల వీడియో కాన్ఫరెన్స్

**నవతెలంగాణ- పెద్దపల్లిటౌన్ :**

హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు ఎవరు సెల్ ఫోన్ తీసుకొని రావద్దని, ఈ అంశాన్ని మరోసారి స్పష్టం చేస్తూ ప్రతి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఇంటర్, 10వ తరగతి పరీక్షలు జిల్లాలో సమర్థవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరగవద్దని తెలిపారు. ప్రభుత్వం మరో రెండు గ్యారెంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలను అమలు చేస్తుందని, ఇందుకోసం లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేసిందని అన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ సంఖ్య, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ ప్రజా పాలన దరఖాస్తుల్లో సమర్పించిన వారందరికీ పథకాలు అమలు అవుతాయని, ఇప్పటి వరకు సదరు సమాచారం ప్రజాపాలన దరఖాస్తులలో సమర్పించని వారు ప్రజా పాలన సేవా కేంద్రాలలో తమ వివరాలు అప్డేట్ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో ఒక ప్రజా పాలన సేవ కేంద్రం, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అవసరం మేరకు 3 లేదా 4 ప్రజా పాలన సేవా కేంద్రాలను అనువైన స్థలాలలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పి సి.ఈ.ఓ. కె.నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతర భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాం

**కోరుట్ల, జగిత్యాల డిపో మేనేజర్లు విజయ మాధురి, సునీత**



**నవతెలంగాణ-పెద్దపల్లి :** గత నెల 18 నుంచి 25 వరకు పెద్దపల్లి బస్టాండ్ నుండి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామని కోరుట్ల, జగిత్యాల ఆర్టీసి డిపో మేనేజర్లు విజయ మాధురి, సునీత తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రీజనల్ పరిధిలో 7 పాయింట్ల ద్వారా మేడారం జాతరకు ప్రయాణికులను ఆర్టీసి తరలించిందని అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ నుండి 180 బస్సులు నడిపించామని, పెద్దపల్లి - మేడారం 822 ట్రిప్పుల ద్వారా 22,272 మంది ప్రయాణికులను, మేడారం - పెద్దపల్లికి 794 ట్రిప్పుల ద్వారా 24,141 మంది ప్రయాణికులను తరలించినట్లు వివరించారు. 2,78,322 కిలోమీటర్లు బస్సులు నడిపినట్లు తెలిపారు. పెద్దపల్లి పాయింట్ ద్వారా 180 బస్సుల్లో ప్రయాణికులను తరలించగా 1,99,56,200 రూపాయల ఆదాయం సమకూరిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణికులను జాతరకు తరలించడంలో సహకరించిన స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, వివిధ శాఖల అధికారులు, ఆర్టీసి అధికారులు, ఉద్యోగులు, మీడియాకు కతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ కెఆర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## 3న గురుకుల పాఠశాల 6, 7, 8వ తరగతి ప్రవేశ పరీక్ష

**మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్ చెరుకు సుస్మిత**

**నవతెలంగాణ-పెద్దపల్లి :**

మార్చి 3న మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల 6, 7, 8వ తరగతుల నందు అడ్మిషన్ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని మహాత్మ జ్యోతిబాఫులా గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్ చెరుకు సుస్మిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మ జ్యోతిబాఫలే గురుకుల పాఠశాలలో 6, 7, 8వ తరగతుల బ్యాక్ లాగ్ సీట్లు ప్రవేశం కోసం మార్చి 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ప్రవేశ పరీక్ష యొక్క హాల్ టికెట్స్ mjptbcwreis.telangana.gov.in అనే వెబ్ సైట్ నుండి విద్యార్థులు డౌన్లోడ్ చేసుకోవాలని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్ చెరుకు సుస్మిత ప్రకటనలో పేర్కొన్నారు.

## వయోధికులకు చట్టం ఆసరా

**సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్‌కుమార్.**



**నవతెలంగాణ-కోరుట్ల :** సీనియర్ సిటీజన్స్(వయోవృద్ధుల) కోసం చట్టం ఆసరాగా ఉందని, వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలుకు సీఎం ఆదేశాలు జారీ చేయడం పట్ల తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ కౌన్సెలింగ్ కేంద్రంలో వయోధికుల రక్షణ, పోషణ సంక్షేమ చట్టంపై వయోధికులకు అవగాహన కల్పించారు. వయోవృద్ధులు తమను నిరాదరిస్తున్న కొడుకులపై పెట్టిన కేసుల్లో కౌన్సెలింగ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ ముఖ్య అతిథిగా,ప్రధాన వక్తగా హాజరయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు,కౌన్సెలింగ్ అధికారి పి.సి.హన్మంత్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు కౌన్సెలింగ్ అధికారులు పబ్బా శివానందం,కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్, కోశాధికారి ఎస్.లక్ష్మీ నారాయణలు, ఉపాధ్యక్షుడు ఎం.డి.సైఫోద్దీన్, సంయుక్త కార్యదర్శులు లక్ష్మీకాంతం, రాజయ్య, చిలుక గంగారాం, మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి, కార్యదర్శి సౌడాల కమలాకర్, మాచాపూర్ వెంకటేశ్వరరావు, సాజిద్ అలీ, కతలాపూర్ అధ్యక్షుడు అల్లూరి బాపురెడ్డి, మేడిపల్లి అధ్యక్షుడు ఒద్దినేని గోవర్ధన్ రావు, కార్యదర్శి ఎండి.బురాణోద్దీన్, మండలాల, గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య గర్ ముఫ్త్ బిజ్లి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్**



**నవతెలంగాణ-పెద్దపల్లి :** పీఎం సూర్య గర్ ముఫ్త్ బిజ్లి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోజు రోజుకి పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి, సహజ వనరులను కాపాడుకోవడానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించిందని అన్నారు. ఇప్పటికే సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తోందని, ఇందులో భాగంగా వినియోగదారులు పక్కా ఇల్లు ఉన్న ఇంటి పైకప్పులపై సోలార్ ప్లేట్లను అమర్చ నున్నారని, తద్వారా సౌర విద్యుత్తును వినియోగించుకోవడంతో పాటుకరెంటు బిల్లుల భారం కూడా తగ్గుతుందని అన్నారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి సామాన్య పౌరులపై కరెంట్ ఛార్జీల భారం తగ్గించడం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య గర్ ముఫ్త్ బిజ్లి యోజన పథకానికి శ్రీకారం చుట్టిందని,ఈ స్కీమ్ దేశవ్యాప్తంగా ఇళ్లకు సబ్సిడితో సోలార్ రూఫ్ ప్లాంట్లను నిర్మించి ఇచ్చి, నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు.

## ఐపీఎస్ పాఠశాలలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత

- డైరెక్టర్ సంజీవ్ కుమార్
- ఆకట్టుకున్న అన్యువల్ స్పోర్ట్స్ మీట్



**నవతెలంగాణ-సుల్తానాబాద్ :** ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గ్రామీణ క్రీడాకారులు సైతం రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారని పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్‌కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు. స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో అన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు.విద్యార్థులకు కబడ్డీ, కోకో, వాలీబాల్, రన్నింగ్ డాడ్జుబాల్, స్కిప్పింగ్, మొదలైన క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల పై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్గత సిసి రోడ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్

**నవతెలంగాణ-ఓదెల :** మండలంలోని పిట్టల ఎల్ల య్యపల్లి గ్రామంలో శుక్రవారం ఎంఎస్ఆర్ఇజి ఎస్‌లో భాగంగా రూ.10 లక్షల అంతర్గత సిసి రోడ్లకు మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్ శంకు స్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిట్టల సరిత,మాజీ సర్పంచ్ పుప్పాల శంకర్, యాదగిరిస్వామి, యాదగిరి రంజిత్, కందుల అశోక్,కందుల రమేష్, పెద్దిరెడ్డి రఘుపతి రెడ్డి, అనిల్‌రెడ్డి, రాజ్ కుమార్ రెడ్డి, యాదగిరి సమ్మయ్య,దొడ్ల బాబురావు, ప్రశాంత్, జక్కయ్య, ముఖిస కృష్ణారెడ్డి, బండి శ్రీధర్, శ్రీనివాస్,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ2 వకీల్‌పల్లి మైన్‌లో గని ప్రమాదం



ప్రమాదంలో గాయ పడ్డ వినయ్ రెడ్డి

**నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ :** ఆర్జీ2 వకీల్‌పల్లి గనిలో ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పని స్థలాల్లో సేఫ్టీ నియమ నిబంధనలు పాటించకపోవడం వల్ల అనేక మంది కార్మికులు ప్రమాదాల భారిన పడుతున్నారు. వీకేపి మైన్‌లో శుక్రవారం తెల్లవారు జామున ఆర్/బిలో 3వ సిం.టాప్ సింలోని రిలే బి 74 లెవెల్ ఆఫ్ 40డిప్ సౌత్‌లో బంపింగ్ అండ్ హీవింగ్ జరగడం వల్ల సైడ్ ఫాల్ అయింది. ఈ ప్రమాదంలో కంటిన్యూస్ మైనర్‌లో కేబుల్ బాయ్‌గా విధులు నిర్వహించే వినయ్‌రెడ్డి అనే గని కార్మికునికి తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన సింగరేణి ఆసుపత్రికి తరలించగా సరైన సిబ్బంది సౌకర్యాలు లేక కరీంనగర్ ఆసుపత్రికి తరలిం చినట్టు తెలిసింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కార్మికులకు అలాగే వారి కుటుంబ సభ్యులకు వైద్యం అత్యవసరమయితే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందని ఆసుపత్రులను మెరుగు పరచాల్సిన అవసరం ఉందని యూనియన్ నాయకులు అంటున్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐటీయూ నాయకులు ఉల్లి మొగిలి మాట్లాడుతూ పని స్థలాలను సేఫ్టీ అధికారులు పర్య వేక్షించడం లేదని సేఫ్టీ అధికారి అసమర్థత వల్లే,సేఫ్టీ నియమ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తేట తెల్లం అయ్యిందని అన్నారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

**ఇబ్రహీంపట్నం ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకట్**



భూమి పూజ చేస్తున్న వెంకట్

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని ఇబ్రహీంపట్నం ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పొనకంటి వెంకట్ అన్నారు. ఇబ్ర హీంపట్నం మండలంలోని వర్షికొండ గ్రామంలో శుక్రవారం హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. 20 లక్షల రూపాయలతో ఈ నిర్మాణం చేస్తున్నట్లు వెంకట్ తెలిపారు. ఆయనతో పాటు దొంతుల తుకారం, పంచాయతీ కార్యదర్శి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో చైర్మన్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సింగరావు

**నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ భాసశ్రావణ్‌ను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్ర హీంపట్నం మండలం అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, తీపిరి అశోక్ జెట్టిలింగం పాల్గొన్నారు.

## భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**నవతెలంగాణ-పెద్దపల్లి :** పెద్దపల్లి శివారులోని తమ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి పట్టణం మొఘల్ పురకు చెందిన ఎండీ అజారోద్దీన్ అధికారులను కోరారు. సర్వే నెంబర్ 898, 898/3,898/4లో తనకు గల 2-02 ఎకరాల భూమిని లక్కాకుల జయప్రద, ఉనుకొండ శ్రీనివాస్, మధు, సామ తిరుపతి, కృష్ణలు కబ్జాకు యత్నిస్తున్నారని పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అజారోద్దీన్ తెలిపారు. తనకు అనుకూలంగా కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ, సదరు వ్యక్తులు భూమిని కబ్జాకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఆ భూమి తనదేనని బోర్డు ఏర్పాటు చేశారు. మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ కబ్జాకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి వేడుకున్నారు.

## ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షకు (5177) మంది హాజరు

**ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన**

**నవతెలంగాణ-పెద్దపల్లి :** జిల్లాలో ఇంటర్ పరీక్ష 3వ రోజు ప్రశాంతంగా జరిగిందని, శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్ -1 పరీక్ష జరగగా (5177)మంది పరీక్షకు హాజరు కాగా, (300) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జనరల్, వొకేషనల్ కలిపి జిల్లాలో (5477) మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాయాల్సి ఉండగా, జనరల్ అభ్యర్థులు (4331) మందికి గాను (4138) మంది హాజరు కాగా, (193) మంది గైర్హాజరు అయ్యారని, అలాగే వొకేషనల్ (1146) మందికి గాను (1039) మంది హాజరు కాగా (107) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు. మొత్తంగా జిల్లాలో శుక్రవారం 94.52 శాతం హాజరయ్యారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్ష జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ప్రకటనలో తెలిపారు.

## పోటీ పరీక్షలపై ఆసక్తి కలిగించాలి

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

**నవతెలంగాణ-కరీంనగర్ :** విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల ఆసక్తి కలిగించాలని, విజయం పొందేటట్లుగా ప్రోత్సాహం అందించాలని తద్వారా వారు వివిధ అంశాలలో నిపుణులు అవుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో విద్యార్థుల అభినందన సభ ఏర్పాటుచేశారు. ఇటీవల ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ వారైన నవార్స్ ఎడ్యుటెక్ వారు నిర్వహించిన అష్టనావి సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పాఠశాలకు చెందిన కె.సుచిత్ రెడ్డి 5వ తరగతి, ఎస్పీ క్రిష్ణ చైతన్య 6వ తరగతి మొదటి దశలో చాలా అద్భుతంగా రాణించారని, రెండో దశకు కూడా ఎంపికయ్యారని హర్షం వ్యక్తం చేవారు. ఇద్దరు విజేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసి, భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలను సాధించాలని శుభాబినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంటనే వేతనాలు చెల్లించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

**నవతెలంగాణ - కరీంనగర్**



నాలుగు నెలలుగా ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు చెల్లించక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించక పోవడం వల్ల వారి కుటుంబ పోషణ భారం అయ్యిందని, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని కల్పించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని సజావుగా నడిపించడంలో, ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానకర్తలుగా ఉపాధి హామీ సిబ్బంది పని చేస్తూ పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో వారి నిధులను కేటాయించిన వాటిని సక్రమంగా విడుదల చేయక ఇతర అవసరాలకు మళ్లింపు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ ల వేతనాలు సకాలంలో అందకపోవడం వల్ల ఆయా కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా ఇంట్లో పని చేసి మీ ఇంట్లో భోజనం చేయమంటే కుదరదని, క్షేత్రస్థాయిలో కుటుంబాల పోషణను ఉపాధిహామీ సిబ్బంది ఆర్థిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

## ఆపదమిత్ర వాలంటీర్ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**నవతెలంగాణ-కరీంనగర్ :** ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, అనుకోకుండా ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను కాపాడేందుకు ఉపయోగపడే ఆపదమిత్ర వాలంటీర్ల ఎంపిక ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆపదమిత్ర వాలంటీర్ల ఎంపిక ప్రక్రియపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వాలంటీర్ల ఎంపికపై అన్ని శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కరీంనగర్ జిల్లాలో 300 మంది ఆపదమిత్ర వాలంటీర్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు, గజ ఈతగాళ్లు, క్రీడాకారులు, జీపీ వర్కర్లు, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ టీచర్లకు వాలంటీర్ల ఎంపిక సందర్భంగా ప్రాధాన్యం కల్పించాలన్నారు. అలాగే మిగతా వారిని డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీ నుంచి ఎంపిక చేయాలని చెప్పారు. మార్చి మూడో తేదీలోగా ఎంపిక చేసిన వాలంటీర్ల లిస్ట్ తయారు చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వాలంటీర్లకు 12 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, 18-40 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఆపద సమయంలో బాధితులను రక్షించే అంశంపై శిక్షణ ఇస్తారని తెలిపారు. అధికారులందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ ఏ ఆపద వచ్చినా వాలంటీర్స్ సేవలు అందిస్తారని చెప్పారు. డీఆర్ఓ పవన్ కుమార్ వాలంటీర్ల ఎంపిక, శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్డీఓ శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, స్పోర్ట్స్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ ఎన్సీసీ ఆఫీసర్ రాజు, ఎన్సీసీ 9 బెటాలియన్ సుబేదార్ ద్రోవ్, కలెక్టరేట్ ఈ సూపరిండెంట్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధే ధ్యేయం : మేయర్ సునీల్ రావు

**నవతెలంగాణ-కరీంనగర్ :** కరీంనగర్ అభివృద్ధే ధ్యేయంగా మా పాలకవర్గం పని చేస్తుందని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. శుక్రవారం 21వ డివిజన్ ఆరెపల్లిలో పర్యటించారు. కార్పొరేటర్ జంగిలి సాగర్‌తో కలిసి నగరపాలక సంస్థకు చెందిన నిధులతో ఎస్‌డబ్ల్యూజీ డ్రయినేజీ పైపులైన్ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. చేపట్టిన పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

## 535 గ్రాముల గంజాయి పట్టివేత

**నవతెలంగాణ - కరీంనగర్ క్రైం**


గంజాయి పట్టుకున్న పోలీసులు

డిప్యూటీ కమిషనర్, ప్రోహిబిషన్ ఎక్సైజ్ టీ.డేవిడ్ రవికాంత్, డీపీఈఓ కరీంనగర్ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు, వచ్చిన సమాచారం మేరకు కరీంనగర్‌లోని భగత్ నగర్‌లో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, కరీంనగర్ సీఐ, కే.నాగేశ్వరరావు అధ్వర్యంలో దాడులు చేశారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆర్.శశికుమార్ శాంతినగర్, పి.రామకృష్ణ పెగడపల్లి, బి.జయంత్ వరంగల్ ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 535 గ్రాముల ఎండు గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీన పర్చుకున్నారు. ముగ్గురు వ్యక్తులను బైండోవర్ కోసం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ కరీంనగర్ అర్బన్‌కి అప్పగించారు. ఈ దాడులలో హెచ్‌సీ మోసిన్, ఈసీలు కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల్లో 3మాల్ ప్రాక్టీస్ కేసులు

**నవతెలంగాణ-కరీంనగర్ :** శుక్రవారం కరీంనగర్ జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో జనరల్‌లో 15202 మంది విద్యార్థులకు 14736 మంది, ఒకేషనల్‌లో 1660 మందికి 1140 మంది మొత్తం 16862 మంది విద్యార్థులకు 15876 మంది హాజరైనట్లు ఇంటర్మీడియట్ అధికారి జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. 3 మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ అయినట్లు తెలిపారు.

## యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా తిరుపతి

**నవతెలంగాణ - చొప్పదండి**



కాంగ్రెస్ పార్టీ యువజన చొప్పదండి మండల ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన రాజన్నల తిరుపతిని అధ్యక్షుడు పెద్ది రాజేందర్ నియమించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ముద్దసాని రంగన్న, గాలిపెల్లి రమణ, జక్కుల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు, ఫోన్ లకు దూరంగా ఉండాలి

### చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్

**నవతెలంగాణ-కరీంనగర్**

మత్తు పదార్థాలకు, ఫోన్ లకు పిల్లలు దూరంగా ఉండాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ అన్నారు. నగరంలోని పద్మనగర్‌లో గల ప్రభుత్వ పాఠశాలలో స్నేహిత, మహిళా దినోత్సవ వారోత్సవాల అవగాహన సదస్సు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ..స్మార్ట్ ఫోన్‌కు పెట్టుకొనే పాస్‌వర్డ్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ ఎలా వాడాలి, వాటి ద్వారా ఏ విధంగా మోసపోతున్నారని, సోషల్ మీడియాలో ఫోటోలు, మెసేజ్‌లు పెట్టడం ద్వారా వచ్చే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. బాల్య వివాహల గురించి ఆడపిల్లల రక్షణ, ఆరోగ్యం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ కృపరాణి, సీడీపీఓ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ అరుణ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ సాయికిరణ్, షీ టీం పోలీస్ కానిస్టేబుల్ స్వప్న, సఖీ సంధ్య, ప్రిన్సిపాల్, టీచర్స్, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# చదువులో హీరోయిజం చూపించండి

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

**నవతెలంగాణ-కరీంనగర్**


మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థులు చదువులో హీరోయిజం చూపించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ముక్రాంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పురాతన)లో స్నేహిత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంచిగా చదువుతేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ఎవరినుంచైనా శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడ్డ, అన్యాయానికి గురైనా విద్యార్థులు అధికారులకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు ఆపద సమయంలో 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జనార్ధన్‌రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృపారాణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత, పాఠశాల హెచ్ఎం ఎస్కే చాంద్ తదితరులు పాల్గొన్నారు.

### మ్యూజియాన్ని ఆధునీకరించండి..

ప్రభుత్వం ఉన్నత పాఠశాల (పురాతన)లో ఉన్న మ్యూజియాన్ని ఆధునీకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. శుక్రవారం మ్యూజియం భవనాన్ని పరిశీలించారు. పురాతన మ్యూజియం భవనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకు తగిన అంచనాలను రూపొందించాలని, దీంతో నిధులు మంజూరు చేస్తానని అధికారులను ఆదేశించారు.

# గెలుపే ధ్యేయంగా పని చేయాలి

### యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్

**నవతెలంగాణ - కరీంనగర్**




కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో రాబోయే ఎన్నికల్లో తప్పనిసారిగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శుక్రవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు యువజన కాంగ్రెస్ పార్లమెంట్ రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువజన కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి కృష్ణ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పడాల రాహుల్ మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో రాబోయే ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. జాతీయ నాయకత్వం, రాష్ట్ర అధ్యక్షులు శివ సేన రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండల, గ్రామ అధ్యక్షుల, సభ్యుల నియామకం రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారెంటీల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని తిప్పి కొట్టి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రచారం వేగవంతం చేయాలని కోరారు. బీజేపీ చేస్తున్న విద్వేష రాజకీయాలు తిప్పి కొట్టి ప్రజలకు నిజానిజాలు తెలిసేలా కాంగ్రెస్ తరపున పని చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ యువత పక్షాన నిలబడి కొట్లాడిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ సేన రెడ్డిని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అవసరమైతే భువనగిరి పార్లమెంట్ స్థానం కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల జిల్లా యువజన్ కాంగ్రెస్ జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## దోమల బెడదను నియంత్రించండి

### సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు

**నవతెలంగాణ - కరీంనగర్ :** దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నగరంలోని అన్ని వాడల్లో పాగింగ్ చేసి ప్రజలను రక్షించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు కార్పొరేషన్ అధికారులను కోరారు. నగరంలోని అన్ని వాడల్లో దోమల నియంత్రణ మందు స్ప్రే చేయకపోవడం వల్ల ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయడంతో పాటు అన్ని వాడల్లో పరిశు భ్రతపై దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్న వేళ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. మూడు ఫాగింగ్ మిషన్లు ఉన్న మూలనే పడి ఉంటున్నాయని, ఏనాడూ సరిగా వాడలో తిరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ అధికారులు దోమల నివారణ, పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

## పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం

**నవతెలంగాణ - జమ్మికుంట :** జమ్మికుంట మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వావిలాల పరిధిలో మార్చి 3నుండి మూడు రోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ చందు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 40 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 0 నుండి 5 సంవత్సరాల వయసులోపు 5048 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. మార్చి 4, 5వ తేదీలలో పోలియో చుక్కలు వేసుకోలేని పిల్లలకు ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్వైజర్స్ స్వరూప, రత్నకుమారి, అరుణ, సదానందం పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ పంపిణీ

**నవతెలంగాణ - జమ్మికుంట :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు గుర్రం పరుశురామ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉజ్వల పథకం లబ్దిదారులు పదిమందికి వారి వారి ఇంటి వద్దకే తీసుకువెళ్లి శుక్రవారం ఉచిత గ్యాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరుశురాం మాట్లాడారు. పిఎం ఉజ్వల పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై ఫిర్యాదు

**నవతెలంగాణ - రామడుగు :** కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రామడుగు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, వారి మాతృమూర్తిపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ రామడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసామని తెలిపారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ చొప్పదండి అసెంబ్లీ ఉపాధ్యక్షుడు మామిడి దిలీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వర్కొలు మనోహర్, గణేష్ ఉన్నారు.

## జూపాక సమ్మక్క జాతర ఆదాయం లెక్కింపు

**నవతెలంగాణ - హుజురాబాద్ :** హుజురాబాద్ మండలం జూపాక గ్రామంలో జరిగిన సమ్మక్క, సారలమ్మ జాతర హుండీ ఆదాయం లెక్కింపు శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. మొత్తం ఆదాయం 5,53,855 రూపాయలు వచ్చాయని జాతర కమిటీ చైర్మన్ దాసరి సదయ్య గౌడ్ తెలిపారు. టికెట్ ద్వారా 71000, వేలంపాట ద్వారా 72000చ హుండీ ఆదాయం 4,10,855 వచ్చినట్లు తెలిపారు.

## హుజురాబాద్ జాతర ఆదాయం15 లక్షలు

హుజురాబాద్ రంగనాయకుల గుట్ట వద్ద జరిగిన సమ్మక్క జాతర ఆదాయం 15,61,516 రూపాయలు వచ్చినట్లు జాతర కమిటీ చైర్మన్ మూగల రాజిరెడ్డి తెలిపారు. టికెట్ల ద్వారా 3,53,075 రూపాయలు, వేలంపాట ద్వారా 1,58,500, హుండీ ఆదాయం రూ.10,49,941 వచ్చినట్లు తెలిపారు.

## ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ

**నవతెలంగాణ - చొప్పదండి :** చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలోని గృహ యజమానులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఆర్టీ నెంబర్101 27.2.2024 ద్వారా ఆర్థిక సంవత్సరం 2022-2023 వరకు పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, ఇంటి పన్నులు బకాయిలు చెల్లించి వారికి మీరు చెల్లించవలసిన బకాయిలపై వడ్డీకి 90శాతం రాయితీని కల్పించినట్లుగా మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సూర్య ఘర్ కోసం దరఖాస్తు చేసుకోండి

**నవతెలంగాణ - హుజురాబాద్ :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకం కోసం అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని హుజురాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం అధికారి యు.మహేందర్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి పక్కా ఇల్లు (గ్రౌండ్ ఫ్లోర్) గలవారు, ఒకటవ రెండు అంతస్తులు గలవారు వారి ఇంటి పైకప్పులపై సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. 1కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.30వేలు, 2కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.60వేలు, 3కి.వా లేదా అంతకన్నా ఎక్కువ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.78వేలు గరిష్ఠ రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ పథకం రిజిస్ట్రేషన్ కోసం ఆసక్తి కలిగిన వినియోగదారులు ఇంటి నెంబర్, కరంటు బిల్ నకలు అందజేస్తే వారి వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తారు. నమోదైన తరువాత సంబంధిత అధికారులు సోలార్ ప్లాంట్‌లను మీ ఇంటికే వచ్చి ఇంస్టాల్ చేస్తారని తెలిపారు.

## పిండ లింగ నిర్ధారణ నిషేద చట్టంపై అవగాహనా సదస్సు

**నవతెలంగాణ-కరీంనగర్**

కరీంనగర్ టౌన్‌లోని కిసాన్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో గర్భాస్థ పిండ లింగ నిర్ధారణ నిషేద చట్టం 1994, రూల్స్ 1996పై అంగన్వాడీ టీచర్లకు, అంగన్వాడీ ఆయాలకు అవగాహన కల్పించారు. గర్భాస్థ దశలోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేయుంచుకోవడం చట్టరీత్యా నేరం అన్నారు. ఇలాంటి పరీక్షలు ప్రోత్సహించిన వారికి, పరీక్షలు చేయించుకున్న వారికి, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్.రంగా రెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్ఓకి వినతి

**నవతెలంగాణ-కరీంనగర్**



గ్రామం నుంచి పూటం కప్స్ పీహెచ్‌సీకి ఆశా తీసుకరావాలని అధికారుల ఒత్తిడి, లెప్రసీ సర్వే, కార్యక్రమాల పెండింగ్‌లో ఉన్న రెండు సంవత్సరాల బకాయిలు ఇప్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)కి వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. వెల్‌నెస్ సెంటర్లలో ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. రిజిస్టర్లు ఇవ్వాలని, యూనిఫాం ఇవ్వగలరని తెలిపారు. ఆశాలు పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారని, పని భారం తగ్గించాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ అయిన ఆశాలకు ఏఎన్ఎం పోస్టులలో వెయిటేజీ ఇవ్వాలని, ఆశా కేసుకు డెలీవరికి తీసుకవెళ్లినప్పుడు ఏరియా హాస్పిటల్ ఎంసీహెచ్‌లో భోజన సౌకర్యం కల్పించాలన్నారు. ఒకటో తేదీన పారితోషకాలు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఎండీ రభియా బేగం, ప్రధాన కార్యదర్శి దొండపాటి సరిత పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను జయప్రదం చేయండి

### డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు

**నవతెలంగాణ - హుజురాబాద్**

ఈ నెల 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని హుజురాబాద్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ చందు నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. హుజురాబాద్ డివిజన్ పరిధిలోని సైదాపూర్, శంకరపట్నం, హుజురాబాద్ అర్బన్, చెల్పూర్, చల్లూరు, వీణవంక, ఇల్లందకుంట, వావిలాల, జమ్మికుంట అర్బన్ ప్రాంతాల పరిధిలో అప్పుడే పుట్టిన శిశువు నుండి 5సంవత్సరాల వయసుగల పిల్లల అందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పిల్లలకు వేసే రెండు చుక్కలు శిశువులకు జీవితాంతం శిశు పక్షవాతం రాకుండా ఉంటుందని చెప్పారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలో ఐదు సంవత్సరాలలోపు 22,653మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరందరికీ మూడవ తేదీ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి 185 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు, 800 మంది సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. పల్స్ పోలియో పర్యవేక్షణకు 20 రూటులను 9 మొబైల్ టీములు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డివిజన్ పరిధిలో దాదాపు 42 ఐ రిస్క్ ఏరియాస్‌లో పిల్లలందరికీ చుక్కలు వేస్తామని తెలిపారు. మూడవ తేదీ నుండి 5వ తేదీ వరకు బస్టాండ్లూ రైల్వే స్టేషన్లలో కూడా సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. 4, 5వ తేదీలలో సిబ్బంది అందరూ ఇంటింటికి తిరిగి అర్హులైన పిల్లలకు చుక్కలు వేస్తారని తెలిపారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిద్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయం కోసమే భక్తిని చాటుకుంటున్న బండి

### భూ అక్రమార్కులపై ఎంపీ ఎందుకు నోరు విప్పడంలేదు

### కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

**నవతెలంగాణ - కరీంనగర్**



రాజకీయం కోసమే భక్తి ముసుగులో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రజలను మభ్య పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర సప్తమ బ్రహ్మోత్సవాలను రాజకీయాలకు అతీతంగా ఘనంగా నిర్వహించినా భక్తి ఉన్న బండి సంజయ్ ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. కనీసం శోభయాత్రలో కూడా స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బండి సంజయ్ దేవుని దర్శించుకలేదంటే వారికి దైవభక్తి ఎంతో ఉందో ప్రజలు గమనించారని తెలిపారు. గతంలో ఎన్నడులేనంతగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతనిధులు భూ ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. కరీంనగర్ ఎంపీగా భూ అక్రమార్కులపై ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నిం చారు. ఎంపీ కరీంనగర్ అభివృద్ధికి కోసం నయా పైసా తీసుకరాలేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు సమద్‌నవాబ్, మల్లేషం పాల్గొన్నారు.

## పరీక్షా ప్యాడ్లు పంపిణీ



**నవతెలంగాణ - తిమ్మాపూర్ :** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మన్నెంపల్లి మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ జన్మదినం సందర్భంగా పొన్నం యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ సహకారంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేశారు. అంతకు ముందు కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, సామగ్రి అందించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు దరిపల్లి వేణుకుమార్, సుధగోని సదయ్య గౌడ్, కామేర నిరంజన్, బీనపల్లి సంపత్, గీకురు రమేష్, గొల్లే సాయి కుమార్, గొదరి నాగేంద్ర, నాంపల్లి సాయి కుమార్, గుంటి నవీన్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహనా సదస్సు

**నవతెలంగాణ - తిమ్మాపూర్ :** మండలంలోని మన్నెంపల్లి, మొగిలిపాలెం గ్రామాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్నేహిత కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా బాల్య వివాహేల గురించి, మహిళా సాధికారత, న్యూట్రిషన్ ఫుడ్, 1098 హెల్ప్ లైన్‌వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, నరసింహారెడ్డి, మెడికల్ ఆఫీసర్ పుల్లారావు, ఏసిడిపిఓ అరవింద, సఖి కౌన్సిలర్ పద్మావతి, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో ఎక్కడినుంచైనా పోటీ చేయగలరా?

- కేటీఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో ఎక్కడినుంచైనా పోటీ చేయగలరా అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గత నాలుగు రోజులుగా సీం రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు మధ్య జరుగుతున్న సవాళ్ల ప్రతి సవాళ్ల నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద పొన్నం మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌పై ఈ సందర్భంగా ఆయన ఘాటైన వ్యాఖ్యాలు చేశారు. కరీంనగర్ లోకసభ పరిధిలో ఉన్న ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి పోటీ చేస్తారనీ, దమ్ముంటే కేటీఆర్ బరిలో నిలవాలని సూచించారు. నల్లగొండ నుంచి రాజీనామా చేసి సిరిసిల్ల నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగిన అవినీతిపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో శిక్ష తప్పదేమోననే భయంతోనే కేటీఆర్ ఈ విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మేడిగడ్డకు చెందిన 40,50 పిల్లర్లలో రెండు పిల్లర్లు కుంగిపోతే నష్టమేంటని అనడాన్ని పొన్నం తప్పు పట్టారు. జపాన్ ఆపరేటివ్ ఇంటర్నేషనల్ నుంచి అప్పు తీసుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని ఎందుకు నాణ్యతగా నిర్మించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలతో ఉనికి కోల్పోతామని భయపడుతున్నారని విమర్శించారు. నీళ్ళ వదిలి ప్రాజెక్ట్ కొట్టుకుపోకుండా కాపాడుతున్నామే తప్ప కూల్చే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం వైట్ ఎలిఫెంట్ అని గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు ఋజువు కాబోతున్నాయని పేర్కొన్నారు. డ్యాం సేఫ్టీ అధికారుల సలహా మేరకు ముందుకు వెళ్తామనీ, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. గతంలో కాంగ్రెస్ నేతలను హౌజ్ అరెస్టులు చేసినట్టు ఇప్పుడు బీఆర్ఎస్ నేతలను చేయమని చెప్పారు. తమ ప్రభుత్వం ఎవరి పర్యటనలనూ అడ్డుకోదనీ, కాళేశ్వరం రావాలని బీఆర్ఎస్, బీజేపీ నేతలను తామే ఆహ్వానించామని గుర్తు చేశారు.

## కాళేశ్వరంపై చర్చకు సిద్ధమా?



- ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతిష్టాత్మక నిర్మాణంగా బీఆర్ఎస్ సర్కార్ చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రణాళిక, నాణ్యత, డేసైన్, నిర్వహణ లోపం కారణంగా రాష్ట్రంలో సాగు, ఇంజినీరింగ్, ఆర్థిక సంక్షోభం తలెత్తిందని తెలిపారు. కేవలం మూడు పిల్లర్లకు సంబంధించిన సమస్యగా దీన్ని బీఆర్ఎస్ నమ్మించే ప్రయత్నం చేస్తున్నదనీ, కానీ ఆ ప్రాజెక్టుకు తలకాయ వంటి మేడిగడ్డ దెబ్బతినడమంటే మొత్తం ప్రయోజనమే ప్రశ్నార్థకంగా మారినట్టేనని విమర్శించారు. 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే దుకు ఉద్దేశించిన ప్రాజెక్టుకు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వం సీడబ్ల్యూసీ హెచ్చరికలను బేఖాతరు చేసిందని వాపోయారు. రాష్ట్రం ఉత్పత్తి చేసే విద్యుత్ లో 60 శాతం ఒక్క కాళేశ్వరానికే ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. మిలియన్ మార్చ్ దినోత్సవమైన మార్చి 10న నీళ్లు - నిధులపై టీజేఎస్ ఓపెన్ డిబేట్ నిర్వహిస్తున్నదని తెలిపారు. చర్చకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా కోదండరాం సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 1,509 దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1509 దరఖాస్తులు అందాయి. అందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి 275, రేషన్ కార్డుల కోసం 107, ఇందిరమ్మ ఇండ్ల కోసం 396 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నా రెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి, సీడీఎంఏ దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. కేవలం వ్యక్తిగత దరఖాస్తులే కాకుండా వివిధ ఉద్యోగ సంఘాల నుంచి కూడా అర్జీలు అందాయి. డీయస్సీ 2008 బీ.ఈడీ మెరిట్ అభ్యర్థుల సంఘం నాయకులు చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. తమకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పు అమలు చేయాలని కోరారు. డీయస్సీ 2008 నోటిఫికేషన్ ప్రకారం కామన్ మెరిట్‌లో ఎంపికై నష్టపోయిన తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యను విన్న ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మానసిక వికలాంగులైన విద్యార్థులకు బోధన చేస్తున్న ( ఐఈఆర్పీ) కాంట్రాక్ట్ టీచర్ల సంఘం ప్రతినిధులు సైతం తమ సమస్యలను విన్నవించారు. గత 20 ఏండ్లుగా ప్రభుత్వ పాఠశాలలో మానసిక వికలాంగులైన విద్యార్థులకు పాఠాలు చెబుతున్న తమ పోస్టులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని వారు కోరారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి ప్రజాభవన్ లో ఏర్పాటు చేసిన 16 కౌంటర్ల పనితీరును, స్వీకరించిన అప్లికేషన్లను సంబంధిత శాఖలకు పంపిస్తున్న తీరును ఈ సందర్భంగా చిన్నారెడ్డి పరిశీలించారు.

## సిరిసిల్లలో పోటీచేసి గెలుస్తా

- కారు షెడ్డు మూసేస్తావా ?
- కేటీఆర్‌కు కోమటిరెడ్డి సవాల్
- నేనైతే రాజీనామా చేసేవాడిని:ఉత్తమ్
- ఎంపీ ఎన్నికల తర్వాత పిచ్చిలేసిపోతరు: మంత్రి పొన్నం
- మీడియాతో మంత్రుల చిట్‌చాట్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ విసిరారు.తాను నల్లగొండ ఎమ్మెల్యే సీటుకు రాజీనామా చేస్తాననీ, కేటీఆర్ కూడా రిజైన్ చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో తానుపోటీ చేసి గెలుస్తాననీ, అలా అయితే కారు షెడ్డు మూసుకుంటారా ? అని ప్రశ్నించారు. కేటీఆర్ ఓడితే పార్టీ క్లోజ్ చేస్తానని ప్రకటించేందుకు కేసీఆర్ సిద్ధమా ? అని ప్రశ్నించారు. తాను సిరిసిల్లలో ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. కేటీఆర్‌కు సాంకేతిక పరిజ్ఞానం లేదని చెప్పారు. ఆయన ఓ చిన్న పిల్లగాడనీ, తనస్థాయి కేటీఆర్‌ది కాదన్నారు. కేటీఆర్‌కు క్యారెక్టర్ లేదనీ, లక్షల కోట్లు ఉన్నాయని విమర్శించారు. నాకు క్యారెక్టర్ ఉందనీ, డబ్బులు లేవని చెప్పారు. కేటీఆర్ రూ.200 కోట్లు ఖర్చుపెట్టి కేవలం 30 వేల మెజార్టీతో గెలిచారని, తానైతే రాజీనామా చేసేవాడినని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మరో పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ బండి సంజయ్, అర్వింద్ పెద్ద లీడర్లు అనుకుంటున్నారనీ, ఎంపీ ఎన్నికల తర్వాత వారికి పిచ్చిలేస్తుందన్నారు. వీళ్లిద్దరూ పొలిటికల్ లీడర్లు కాదనీ, గాల్లో గెలిచారన్నారు. బ్రేకింగ్ కోసం మాత్రమే మాట్లాడుతున్నారని విమర్శించారు ఆ నలుగురు ఎంపీలు రాష్ట్రం కోసం ఎప్పుడూ పార్లమెంటులో మాట్లాడలేదన్నారు. శుక్రవారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు.

## ఉత్తర్ ప్రదేశ్‌లో నకిలీ మందుల తయారీ

- తెలంగాణకు సరఫరా చేస్తున్న ముఠా
- డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడిలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కల్తీ పెద్ద సమస్యగా మారింది. ఆహార వస్తువులు మొదలుకుని మందుల వరకు ప్రతి దాన్నీ కల్తీ చేసేందుకు వెనుకాడటం లేదు. ఇక్కడ సరఫరా అవుతున్న కల్తీ మందుల కూపీ లాగితే ఉత్తర్ ప్రదేశ్‌లో తయారీ కేంద్రం తతంగం బయటపడింది. ఎలాంటి అనుమతులు లేకుండా మందులను తయారు చేసి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (టీడీసీఏ) అధికారులు అదుపులోకి తసుకున్నారు. గత నెల 27న మలక్‌పేటలోని పలు డ్రగ్స్ కంపెనీలపై అధికారులు దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే, అక్కడ లభించిన ఆధారాల మేరకు అధికారులు ఉత్తర ప్రదేశ్‌లోని కోట్ద్వారలో తనిఖీలో చేపట్టారు. 'ఆపరేషన్ జై' పేరుతో టాస్క్ ఫోర్స్, మలక్ పేట పోలీసుల సహకారంతో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల నకిలీ మందులు, మిషనరీని స్వాధీనం చేసుకున్నారు.

# పగ, కోపం ఉంటే మాపై తీర్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

విస్తీర్ణం గల బ్యారేజ్‌లో 50 మీటర్ల పరిధిలో మాత్రమే ఒక సమస్య వచ్చిందని చెప్పారు. 85 పిల్లర్‌లలో ఒక పిల్లర్‌లో సమస్య ఉందన్నారు. నిపుణులు బ్యారేజ్‌ని రిపేర్ చేయొచ్చని చెబుతున్నారన్నారు. కానీ చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టే కొట్టుకపోయిందని రాష్ట్ర ప్రభుత్వం చిల్లర ప్రచారం చేస్తోందని ఆరోపించారు. సత్వరమే బ్యారేజి మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వచ్చే వానాకాలం లోపల మరమ్మతు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. నీళ్ల లేక ఇప్పటికే కరీంనగర్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోండని సూచించారు.

అధికారులు, నిపుణులతో కమిటీ వేయాలన్నారు. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ను సందర్శించామని, కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేస్తామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బరాజ్ అన్నట్టు కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారన్నారు. మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల టన్నెల్స్, 1500 కిలోమీటర్ల కెనాల్స్ కలిపితే కాళేశ్వరం అని తెలిపారు. మూడు పిల్లర్ల వద్ద సమస్య వస్తే మొత్తం ప్రాజెక్టు వృధా అన్నట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో పంటలు ఎండి పోకూడదంటే కామధేనువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

తమ పార్టీపై బురద జల్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా జాప్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయాయని, నాగార్జున సాగర్, శ్రీశైలంలోనూ లీకేజ్‌లు వచ్చాయని.. తాము ఏనాడూ రాజకీయం చేయలేదని చెప్పారు.

### మేడిగడ్డను కూల్చేందుకు కుట్ర : హరీశ్‌రావు

కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో దేశానికి అన్నం పెట్టే రైతును రాజు చేయడం లక్ష్యంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మేడిగడ్డ ప్రాజెక్టును నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కూల్చేందుకు కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. అన్నారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు మానుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులతో రాజకీయం చేయరాదని అన్నారు. మేడిగడ్డ పర్యటనతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి మేడిగడ్డను త్వరలోనే రిపేర్ చేస్తామనడంతో తమ పర్యటన విజయవంతమైందన్నారు. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు రాగానే మేడిగడ్డ పిల్లర్లు రిపేరు చేయిస్తామని మంత్రి చెబుతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలలో బద్‌నామ్ చేసి ఎన్నికలలో రెండు సీట్లు సాధించడం కోసం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. వర్షాకాలంలో ప్రాజెక్టును దెబ్బతీయాలనే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్టు అర్థమవుతోందన్నారు. నల్లగొండలో కేసీఆర్ మీటింగ్ పెట్టగానే.. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పబోమని అసెంబ్లీలో తీర్మానం చేశారని అన్నారు. తాము మేడిగడ్డ అనగానే కాంగ్రెస్ పార్టీ నేతలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల యాత్ర చేపట్టారని విమర్శించారు. మెగా ప్రాజెక్టులు కట్టినప్పుడు ఇలాంటి సమస్యలు తలెత్తడం సహజమని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన కడెం ప్రాజెక్ట్ కొట్టుకపోలేదా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని గోబెల్స్ ప్రచారం చేయడం సరికాదన్నారు. వెంటనే రాజకీయాలు మానుకొని రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని రాబోయే వర్షాకాలంలోపు మరమ్మతులు చేయించాలని కోరారు. కావర్ డ్యామ్‌ను ఏర్పాటు చేసి మేడిగడ్డలో నీరు నింపి రైతులను ఆదుకోవాలన్నారు.

### టైర్ బ్లాస్ట్ కలకలం

బీఆర్ఎస్ తలపెట్టిన 'చలో మేడిగడ్డ' టూర్‌లో బస్సు టైర్ బ్లాస్ట్ కావడం కలకలం రేపింది. మేడిగడ్డకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల బస్ టైర్ మార్గ మధ్యలో బ్లాస్ట్ అయింది. ఆ సమయంలో బస్‌లో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులు ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటన జనగామ దగ్గరలో జరిగినట్టు సమాచారం.

# ఈసారి భగ భగే!



### తెలుగు రాష్ట్రాలు సహా పలుచోట్ల వడగాడ్పుల ఉధృతి
### భారత్‌లో ఎల్‌నినో పరిస్థితులపై వాతావరణ శాఖ అంచనాలు

న్యూఢిల్లీ : ఈ ఏడాది దేశంలో ఎండలు మరింతగా మండుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ వేసవి కాలమంతా కూడా ఎల్‌నినో పరిస్థితులు కొనసాగే అవకాశం వుంటుందని అంచనా వేసిందని, ఫలితంగా మరింత వేడిమి పెరుగుతుందని శుక్రవారం పేర్కొంది. సాధారణంగా ఊహించిన దానికన్నా ఈశాన్య భారతంలో, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్నాటక ప్రాంతాల్లో, మహారాష్ట్ర, ఒడిశాల్లో పలుచోట్ల మరింత ఉధృతంగా వడగాడ్పులు వీస్తాయని వెల్లడించింది. మార్చిలో సాధారణం కన్నా అధికంగా (సుదీర్ఘ కాల సగటు 29.9 మిలీమీటర్ల కన్నా 117శాతం ఎక్కువ) వర్షపాతం వుండవచ్చని పేర్కొంది. మార్చి నుంచి మే మధ్య కాలంలో దేశంలో అధిక ప్రాంతాల్లో సాధారణం కన్నా గరిష్టంగా, కనిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం కూడా వుందని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్రో ఒక పత్రికా సమావేశంలో తెలిపారు. ఉత్తర, మధ్య భారతంలో మార్చి మాసంలో వడగాడ్పుల పరిస్థితులు వుండవని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులు ఈ వేసవి అంతా కొనసాగుతాయని, ఆ తర్వాత తటస్థ పరిస్థితులు వృద్ధి చెందే అవకాశం వుందని అన్నారు. ఆ తర్వాత వర్షాకాలం సీజన్‌లో రెండో అర్ధభాగంలో లా నినా పరిస్థితులు నెలకొనే అవకాశం వుందని, దీనివల్ల దేశంలో మంచి వర్షాలు పడవచ్చని తెలిపారు.

## నిమిషం నిబంధన ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాల్లోకి అనుమతించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు దీన్ని అమలు చేయాలని సూచించారు. నిమిషం నిబంధన వల్ల ఆలస్యమైన ఓ విద్యార్థి ఆదిలాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆ నిబంధన పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్ బోర్డు అధికారులు ఆ నిర్ణయాన్ని సమీక్షించి విద్యార్థులకు తీపికబురు అందించారు. ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని నిర్ణయించారు.

**20,394 మంది గైర్హాజరు**

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షను నిర్వహించామని శృతి ఓజా తెలిపారు. ఈ పరీక్షకు 5,00,936 మంది దరఖాస్తు చేయగా, 4,80,542 (95.93 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 20,394 (4.07 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో ముగ్గురు, నిజామాబాద్‌లో ఒకరు కలిపి నలుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు సెట్ బి ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. ఆదిలాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, వనపర్తి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతం గా, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని పేర్కొన్నారు.

## ఎలివేటేడ్ కారిడార్లకు లైన్‌క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

మేర ప్రతిపాదించామనీ, అందులో 12.68 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి, నాలుగు ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలకు, భవిష్యత్తులో డబుల్ డెక్కర్ (మెట్రో కోసం) కారిడార్, ఇతర నిర్మాణాలకు మొత్తంగా 56 ఎకరాల రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజప్తి చేసిన సంగతి తెలిసిందే. కేంద్రం ఇచ్చిన అను మతులతో ఉత్తర తెలంగాణ దిశగా రవాణా మార్గాల అభివద్ధికి మార్గం సుగమ మైంది. అటు నిజామాబాద్, ఆదిలాబాద్, ఇటు కరీంనగర్. రామగుండం వెళ్లేందుకు సికింద్రాబాద్ ఏరియాలో ట్రాఫిక్ ఇబ్బంది తొలగిపోనుంది. హైదరాబాద్ నుంచి శామీర్‌పేట, హైదరాబాద్ నుంచి కండ్లకోయ వరకు ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణంతో గ్రేటర్ సిటీ ఉత్తర దిశగా అభివద్ధి పరుగులు తీయనుంది. జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించి అడ్డంకిగా మారిన రక్షణ శాఖ భూముల అడ్డంకులు తొలిగిపోయాయి. గత ప్రభుత్వం కేంద్రంతో అనుసరించిన అహంకార పూరిత వైఖరితో సంవత్సరాల తరబడి ఎలివేటేడ్ కారిడార్ల అనుమతి ప్రక్రియ నిలిచింది.

**సంతోషంగా ఉంది:సీఎం**

ఎనిమిదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించటం పట్ల సీఎం రేవంత్ ఆనందం వ్యక్తం చేశారు. కేవలం 80 రోజుల కొత్త ప్రభుత్వం ఈ అనుమతులు సాధించటం తమ చిత్తశుద్ధిని చాటిందని చెప్పారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా తెలంగాణ రాష్టానికి సాధించుకోవాల్సిన అవసరాల కోసం కేంద్ర మంత్రులను కలిసి లేఖలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరినైనా, ఎన్నిసార్లయినా కలిసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్ర అభివద్ధి కోసం కేంద్రంతో సన్నిహిత, స్నేహ సంబంధాలను కొనసాగిస్తామని చెప్పారు. రాజకీయ వైషమ్యాలు, పార్టీల సిద్ధాంతాలేవైనా తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు. కేంద్ర రక్షణ శాఖ సూచనల మేరకు త్వరలోనే ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణాలు చేపడతామని ప్రకటించారు.

## ఇంటర్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే ఎంత పెద్ద స్థాయిలో ఉన్న వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హెచ్చరించారు. ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు పై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్పీలతో శుక్రవారం ఆమె హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ రవీ గుప్తా, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, ఎస్.ఏ.ఎం.రిజ్వి, నదీమ్ అహ్మద్ తదితర ఉన్నతాధికారులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.

కామారెడ్డి జిల్లాలో ఇంటర్ పరీక్షా పేపర్ లీకేజీకి ప్రయత్నించిన పలువురు అధ్యాపకులు, సిబ్బందిని గుర్తించి వారిని అరెస్టు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇంటర్ మొదటి, రెండోసంవత్సరపు పరీక్షలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,521 పరీక్షా కేంద్రాల్లో సుమారు 9,80,000 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ పరీక్షా కేంద్రాల్లోకి ఉన్నతాధికారులతో సహా ఏ ఉద్యోగి కూడా సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో అన్ని రకాల పరీక్షలను సజావుగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రతీ రోజూ పరీక్ష పూర్తయిన అనంతరం జిల్లాలోని సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాలనీ, వాటి నిర్వహణపై సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటర్ పరీక్షల అనంతరం పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయనీ, వాటి నిర్వహణకు కూడా ఇదే విధమైన నియమ నిబంధనలు పాటించాలని సీఎస్ సూచించారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లడిగే నైతిక హక్కు లేదు

### గత ప్రభుత్వం కంటే రేవంత్‌రెడ్డి సర్కారు నయమే : మాజీ ఎంపీ కొండా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదనీ, బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోడీ కృషి వల్ల మూడు నెలల్లో మనదేశ జీడీపీ వృద్ధిరేటు 8 శాతానికి పెరిగిందన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి తప్ప కులాల వారీగా ఉచితాలు సరిగాదని అభిప్రాయపడ్డారు. గత కేసీఆర్ సర్కార్‌తో పోలిస్తే ప్రస్తుతమున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొంత నయమేనని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీలో బూతులు వాడే వారని, ఈసారి కొంత హుందాగా నడిచిందని తెలిపారు. గత ప్రభుత్వం చేతిలో చిప్పపెట్టిపోయిందనీ, రైతుబంధు, ఇతర పథకాలకు డబ్బులు లేవని చెప్పారు. కేసీఆర్ ఏడు లక్షల కోట్లు అప్పు చేసి వెళ్తే, ప్రజలు ఇబ్బందులు పడకూడదని కేంద్రం నిధులిస్తోందన్నారు. తెలంగాణలో 14, 15 ఎంపీ సీట్లు గెలిపిస్తే రూ.9 లక్షల కోట్లు కాదు, 25 లక్షల కోట్లు తీసుకొస్తామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న ప్రచారాన్ని కొట్టిపడేశారు. కాళేశ్వరం మొత్తాన్ని విడిచిపెట్టి మేడిగడ్డ ఒక్కదాన్ని మాత్రమే పట్టుకుంటున్నారని విమర్శించారు. చేవెళ్లతో తానే గెలుస్తానని స్పష్టంచేశారు. అయితే, ఇప్పటి వరకూ టికెట్ తనకు ఇస్తున్నట్టు ఎవ్వరూ చెప్పలేదన్నారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం మాట్లాడుతూ ..కాంగ్రెస్ ఇస్తానన్న గ్యారెంటీలు సరిగ్గా అంద జేయాలని సూచించారు. కృష్ణా, గోదావరి జలాలు రంగారెడ్డి జిల్లాకు అందలేదన్నారు. ఇప్పుడున్న ఎంపీ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చేవెళ్ల ఎంపీ నియోజకవర్గ పరిధిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. సమావేశంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బి.రంగారెడ్డి, నేతలు ప్రభాకర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, అజ్మీరా బాబీ, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ విదేశీ విద్య స్కాలర్షిప్ నిధులు విడుదల చేయాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డికి ఎంపీ ఆర్ కృష్ణయ్య వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ విదేశీ విద్య స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని రాజ్య సభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి. చిన్నారెడ్డితో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలపై చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. వారికి అందజేస్తున్న విదేశీ విద్య స్కాలర్‌షిప్‌ల సంఖ్యను 300 నుంచి కనీసం 1000 మందికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో బీఇడీ, డీఇడీ పూర్తిచేసిన సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులకు టెట్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. అందుకోసం నోటిఫికేషన్ జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెట్ పరీక్ష పాస్ అయితే తప్ప డీఎస్సీ పరీక్షకు అర్హత ఉండదని ఆయన గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ ఈబీసీ విద్యార్థులకు గత మూడేండ్ల నుంచి ఫీజు రియంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం మంజూరు చేయడం లేదని తెలిపారు. దీంతో ఫీజులు చెల్లించాలంటూ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ వేధింపులకు గురి చేస్తున్నారని వివరించారు. మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 4వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్‌బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ భేటీలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

# "అణుయుద్ధంతో పశ్చిమ దేశాల సరసాలు"

- పుతిన్



పాశ్చాత్య దేశాల నాయకులు తాము అణుయుద్ధ భూతాన్ని ఆహ్వానిస్తున్నామన్న విషయాన్ని గ్రహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం మాస్కోలో శాసనసభ్యులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో హెచ్చరించాడు. ఉక్రెయిన్ వివాదాన్ని పశ్చిమ దేశాలు ప్రేరేపిస్తున్నాయని ఆయన మరోసారి ఆరోపించాడు. పుతిన్ తన వార్షిక స్టేట్ ఆఫ్ ది నేషన్ ప్రసంగ ప్రారంభ నిమిషాలలో ఈ అంశాన్ని ప్రస్తావించాడు. పుతిన్ తన ప్రణాళికలను, ప్రాధాన్యతలను రష్యా ఫెడరల్ అసెంబ్లీ, జాతీయ శాసనసభకు చెందిన ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రకటించాడు..

నాటో దేశాలపై దాడి చేయాలని రష్యా యోచిస్తోందని పాశ్చాత్య నాయకులు ఇటీవల చేస్తున్న వాదనలు "అర్థం లేనివి" అని అధ్యక్షుడు పుతిన్ నొక్కి చెప్పాడు. అదే సమయంలో అవే దేశాలు "మా భూభాగంపై దాడులు చేయడానికి లక్ష్యాలను ఎంచుకుంటు న్నాయి" అని రష్యా దేశాధినేత ఆరోపించాడు. ఇప్పుడు "నాటో సైనిక దళాలను ఉక్రెయిన్‌లో మోహరించడం" గురించి చర్చ జరుగుతోంది. రష్యాను జయించటానికి గతంలో చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని పుతిన్ గుర్తు చేశాడు. "ఇప్పుడు సంభావ్య ఆక్రమణ దారులకు పరిణామాలు చాలా విషాదకరంగా ఉంటాయి" అని ఆయన హెచ్చరించాడు. రష్యాలో భారీ అణు ఆయుధాగారం ఉందని, అది ఎల్లవేళలా "ఉపయోగించు కోవటానికి పూర్తి సంసిద్ధత"లో ఉంటుందని ఆయన అన్నాడు.

బాధ్యతారాహితంగా ఇటువంటి తీవ్ర వ్యాఖ్యలను చేసే పాశ్చాత్య రాజకీయ నాయకులు "యుద్ధం అంటే ఏమిటో ఇప్పటికే మర్చిపోయారు" అని రష్యా అధ్యక్షుడు అన్నాడు. ఇటీవలి దశాబ్దాలలో "కఠిన పరీక్షలను" ఎదుర్కొన్న రష్యన్ల మాదిరిగా కాక, పాశ్చాత్యులు "యుద్ధం అంటే కొన్ని కార్టూన్లు మాత్రమే అని అనుకుంటున్నారు" అని అధ్య క్షుడు పుతిన్ అభిప్రాయపడ్డాడు."పరిస్థితులను బట్టి చూస్తే మేము దేనినీ మినహాయించ లేము" అని సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యు యేల్ మక్రాన్ ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాల సైన్యాలను పంపటం గురించి మాట్లాడిన తరువాత పుతిన్ అలా వ్యాఖ్యానించాడు.

అయితే నాటో దేశాల నాయకులు మక్రాన్ అభిప్రాయంతో ఏకీభవించలేదు. "ఉక్రెయిన్‌లో నాటో సైన్యాన్ని ప్రవేశపెట్టే ఆలోచనగానీ, అందుకు సంబంధించి ఎటు వంటి ప్రణాళికలుగానీ లేవు" అని నాటో సెక్రటరీ-జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ నొక్కి చెప్పాడు. వర్తమానంలోనే కాదు భవిష్యత్తులో కూడా "ఉక్రేనియన్ గడ్డపై నాటో దేశాల సైనికులు ఉండరని, వారిని యూరోపియన్ దేశాలు అక్కడికి పంపవు" అని జర్మన్ ఛాన్స లర్ ఓలాఫ్ స్కోల్జ్ ప్రకటించాడు. పోలాండ్, చెక్ రిపబ్లిక్, స్వీడన్, ఫిన్లాండ్ దేశాల నాయ కులు కూడా ఇదే విధమైన ప్రకటనలను చేశారు.

ఉక్రెయిన్ యుద్ధంలో నాటో సైనిక దళాలు పాల్గొనటాన్ని తోసిపుచ్చలేమని మక్రాన్ చేసిన వ్యాఖ్యలపై వ్యాఖ్యానిస్తూ "అటువంటి పరిణామంతో నాటో, రష్యాల మధ్య పూర్తి స్థాయి సైనిక ఘర్షణ జరిగే సంభావ్యత గురించి కాక దాని అనివార్యత గురించి మాట్లాడవలసి ఉంటుంది" అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ హెచ్చరించాడు.

ప్రపంచం

### ట్రంప్ "విచారణ నుంచి మినహాయింపు" హక్కును
# సమీక్షించనున్న సుప్రీంకోర్టు




అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఫెడరల్ ఎన్నికల జోక్యం కేసులో న్యాయమూర్తులు తీర్పు ఇచ్చే వరకు విచారణను నిలిపివేస్తూ న్యాయం వరవాళ్లైన మినహాయింపును పొందాలా వద్దా అనే దానిపై వాదనలు వినడానికి అమెరికా సుప్రీం కోర్టు అంగీకరించింది. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను రద్దు చేయటానికి ప్రయత్నించాడని ట్రంప్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి విచారణను ఎదుర్కోవచ్చా లేదా అనే విషయాన్ని సమీక్షిస్తామని కోర్టు తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించింది. మాజీ కమాండర్-ఇన్-చీఫ్ కూడా అయిన అమెరికా మాజీ అధ్యక్షుడు తనకు ప్రెసిడెన్షియల్ ఇమ్యూనిటీ ద్వారా రక్షణ కల్పించాలని పట్టుబట్టాడు. ఈ వాదనను ఫెడరల్ ప్రాసిక్యూటర్లు తిరస్కరించారు.

ట్రంప్ ఒక సోషల్ మీడియా పోస్టులో ఈ చర్యను ప్రశంసించి, సుప్రీంకోర్టుకు "చాలా కతజ్ఞతలు" అని చెప్పాడు. "ప్రెసిడెన్షియల్ ఇమ్యూనిటీ లేకుండా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రయోజనాల కోసం అధ్యక్షుడు సరిగ్గా పనిచేయలేడు లేదా నిర్ణయాలు తీసుకోలేడు" అని ఆయన ఆ పోస్టులో రాశాడు. "అధ్యక్షులు పదవిని విడిచిపెట్టిన తర్వాత తప్పుడు ప్రాసిక్యూషన్, ప్రతీకారాల గురించి ఎల్లప్పుడూ ఆందోళన చెందుతారు, ఒక్కోసారి పక్షవాతానికి కూడా గురయ్యే అవకాశం ఉంటుంది. ఇది వాస్తవంలో ప్రెసిడెంట్‌ను దోపిడీ చేయటానికి, బ్లాక్ మెయిల్ చేయటానికి కూడా దారితీయొచ్చు" అని ట్రంప్ రాశాడు. వేగవంతమైన షెడ్యూల్‌ను సెట్ చేసిన సుప్రీంకోర్టు ఏప్రిల్ 22 నుండి మౌఖిక వాదనలను వింటుంది. జూన్‌లో కోర్టు తీర్పు రావచ్చని భావిస్తున్నారు.

ఒక మాజీ అధ్యక్షుడు పదవిలో ఉన్నప్పుడు చేసిన చట్టవిరుద్ధమైన చర్యల నుండి రక్షణ ఉంటుందా లేక ఉండదా అనే దానిపై దేశ అత్యున్నత న్యాయస్థానం అమెరికా చరిత్రలోనే మొదటి సారి ఒక నిర్ణయం తీసుకోబోతోంది. ఆ విధంగా డోనాల్డ్ ట్రంప్ అమెరికా చరిత్రలోనే వైట్ హౌస్‌ను విడిచిపెట్టిన తర్వాత నేరారోపణలు ఎదుర్కొంటున్న మొట్టమొదటి మాజీ కమాండర్-ఇన్-చీఫ్ అవుతాడు.

గతంలో మాదిరిగా ఇప్పుడు పిల్లలకు త్వరగా పెళ్ళిళ్లు చేయడం లేదు. బాగా చదువుకొని జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహ బంధంలోకి అడుగు పెడుతున్నారు. ఏది మంచి, ఏది చెడు, సమస్య వస్తే ఎలా ఎదుర్కోవాలి? అనేది తెలుసుకుంటున్నారు. ఇదంతా అర్థం చేసుకోకుండా కొంత మంది పెద్దలు ప్రతి చిన్న విషయంలో కలగజేసుకుంటుంటారు. సలహ ఇస్తే పరవాలేదు. కానీ తాము చెప్పిందే సరైనది. మీకు ఎలాంటి అనుభవం లేదు. మేము చెప్పినట్టు చేస్తేనే మీ జీవితాలు బాగుంటాయి అంటుంటారు కొందరు. దీని వల్ల అనేక సమస్యలు వస్తాయి. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...




# పెద్దల జోక్యం పెరిగితే

శృతికి 24 ఏండ్లు ఉంటాయి. పెండ్లయిన వెంటనే ఇద్దరు పిల్లలు పుట్టారు. భర్త అమర్ మంచి ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రెండు లక్షల జీతం. అమర్‌కి అన్న, తమ్ముడు, చెల్లెలు కార్తీక ఉన్నారు. అందరూ కలిసే ఉంటారు. అన్నయ్యకు ఇద్దరు పిల్లలు. తల్లి పొలానికి పోతుంది. అన్నయ్య కూడా ఉద్యోగం చేస్తాడు. ఇంట్లో పనులు చేయడానికి పని అమ్మాయి ఉంటుంది. శృతికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటారు. ఆమె అక్కడ చాలా సంతోషంగా ఉంది. అయితే సమస్య ఏమిటి అంటే శృతి తల్లి కూతురు సంసార జీవితంలో ఎక్కువగా కలగజేసుకునేది.

శృతికి ఇంట్లో వంట చేసే పని కూడా లేదు. వంట మొత్తం తోడి కోడలు నందిని చేస్తుంది. శృతి పెండ్లయిన రెండు నెలలకే నెల తప్పడంతో నందిని ఆమెను ఏ పనీ చేయనిచ్చేది కాదు. మొదటి బాబు పుట్టిన తర్వాత ఆమె మళ్ళీ నెల తప్పింది. దాంతో ఇంట్లో అందరూ ఆమెను చాలా బాగా చూసుకునే వారు. వాళ్ళ అత్తయ్య అయితే శృతి అడగక ముందే అన్నీ తెచ్చి పెట్టేది. పొలం పనులకు వెళ్ళినా మధ్యాహ్నం ఫోన్ చేసి అన్నం తిన్నావా? అని అడిగేది.

తన కూతురితో అత్త అలా చనువుగా ఉండడం శృతి తల్లి సుమిత్రకు నచ్చేది కాదు. కూతురు తన మాట వినదనే భయం కూడా పట్టుకుంది. దాంతో కూతురితో 'నువ్వు ఆ ఇంట్లో వాళ్ళందరితో ఎందుకు అంత మంచిగా ఉంటావు. ఎంతలో ఉండాలో అంతలో ఉండు. ఇంటికి వచ్చిన వాళ్ళను పలకరించడం, మంచి నీళ్ళు ఇవ్వడం ఇవేమీ చెయ్యకు. ఎలాంటి పనులు ముట్టుకోవద్దు. నీ రూమ్‌లోనే ఉండు. అలా కాకుండా అందరితో కలిసి ఉంటే నీ భర్త నీ మాట అసలు వినడు. సంపాదించిన డబ్బులు మొత్తం వాళ్ళకే ఇచ్చేస్తాడు' అంటూ గొడవలు పెట్టడం ప్రారంభించింది.

ప్రతి రోజు శృతికి ఫోన్ చేసి అక్కడ జరిగే విషయాలన్నీ తెలుసుకునేది. ఏదో ఒక విధంగా గొడవలు జరిగేలా చేసేది. బాబు పుట్టిన తరువాత కొన్ని రోజులు వాళ్ళ అమ్మతో ఉండటానికి వెళ్ళింది. అప్పటి నుండి శృతిలో బాగా మార్పు వచ్చింది. ఇంటికి ఎవరైనా బంధువులు వచ్చినా, స్నేహితులు వచ్చినా తన రూం నుండి బయటకు వచ్చేది కాదు. అత్తతో దురుసుగా మాట్లాడడం మొదలుపెట్టింది. ఆమెను అస్సలు గౌరవించేది కాదు. ఆనంద్‌కు ఇంట్లో వాళ్ళను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. నాన్న లేకపోయినా వాళ్ళ అమ్మనే కష్టపడి పిల్లల్ని పెంచింది. ఈ రోజు వాళ్ళంతా ఈ స్థాయికి వచ్చారంటే దానికి కారణం వాళ్ళ అమ్మనే. చివరకు కూతురు పెండ్లి చేయడానికి కూడా కొడుకుల దగ్గర డబ్బు తీసుకోలేదు. 'నాకు ఓపిక ఉంది, పని చేయగలిగినన్ని రోజులు చేసుకుంటాను' అనేది. అలాంటి తల్లిని భార్య ఇబ్బంది పెడుతుంటే ఏం చేయాలో తెలియక ఐద్వా అదాలత్‌కు వచ్చాడు.

వచ్చే వారం శృతిని కూడా తనతో తీసుకు రమ్మని చెప్పి పంపించాము. మేము చెప్పినట్టుగా ఇద్దరూ కలిసి వచ్చారు. ఆమెతో మాట్లాడిన తర్వాత తల్లి ప్రభావం ఆమెపై బాగా ఉందని అర్థమయింది. చిన్నప్పుడే శృతి తండ్రి చనిపోయాడు. సుమిత్ర కూడా తన పెండ్లయిన రెండేండ్లకే భర్తను ఉమ్మడి కుటుంబం నుండి తీసుకొచ్చి వేరు కాపురం పెట్టించింది. భర్తను తన కుటుంబంతో కలవనిచ్చేది కాదు. పైగా అమ్మమ్మ వచ్చి వాళ్ళ ఇంట్లోనే ఉండేది. అమ్మమ్మ చెప్పినట్టుగా అమ్మ చేసేది. ఇప్పుడు తను చెప్పినట్టు తన కూతుర్ని చేయమంటుంది.

ఆనంద్ గురించి నీ అభిప్రాయం ఏంటని అడిగితే 'ఆనంద్ చాలా మంచివాడు. మా పెండ్లి ఖర్చులు కూడా సగం భరించాడు. నా మొదటి డెలివరీ మొత్తం తనే చూసుకున్నాడు. అమ్మకు అవసరమైనా సాయం చేస్తాడు. నాకు ఒక పది తులాల బంగారం కూడా కొనిచ్చాడు. అయితే ఆయనకు వచ్చిన జీతం మొత్తం తల్లికి, అన్నకు, వాళ్ళ పిల్లలకే ఖర్చు చేస్తాడు, నువ్వు జాగ్రత్తగా ఉండాలి అని చెప్పింది మా అమ్మ. నన్ను వాళ్ళతో మాట్లావద్దని చెప్పింది. వాళ్లు నాపై చూపించే ప్రేమ మొత్తం నటన అంటుంది. అమ్మ చెప్పినట్టు నేను చెయ్యకపోతే నాతో మాట్లాడదు. ఇప్పటికి మూడు నెలల నుండి నాతో మాట్లాడడం లేదు. నా పిల్లకు బాగా జ్వరం వచ్చింది. అయినా వచ్చి చూడలేదు. పైగా 'నీకు నాకంటే వాళ్ళే ఎక్కువయ్యారు, ఇక నేను ఎందుకు రావాలి? ఎందుకు మాట్లాడాలి' అంటుంది. దాంతో నేను ఇంట్లో వాళ్ళతో గొడవ పెట్టుకోవడం మొదలుపెట్టాను. అలా అయితేనే అమ్మ నాతో మాట్లాడతాను అని చెప్పింది.' అన్నది శృతి

ఆమె చెప్పింది విన్న తర్వాత 'శృతి నీకు మంచి కుటుంబం దొరికింది. నిన్ను ఇంత బాగా చూసుకుంటున్న కుటుంబాన్ని మీ అమ్మ కోసం బాధపెడుతున్నావు. దీని వల్ల నీ జీవితం నాశనం అయిపోతుంది. ఆనంద్‌తో, వాళ్ళ కుటుంబంతో కలిసి పోయి హాయిగా ఉండు. నందిని నిన్ను సొంత చెల్లెల్లా చూసుకుంటుంది. అనవసరంగా సమస్యలు తెచ్చుకోకు. అంతకు ముందులా అందరితో కలిసి మెలసి ఉండు. నీవు సంతోషంగా ఉంటే మీ అమ్మనే నీ దగ్గరకు వస్తుంది' అని చెప్పాం.

'మేడం నేను అత్తగారింట్లో ఉంటేనే చాలా సంతోషంగా ఉంటాను. ఎవరిపైనా ఎలాంటి కోపం రాదు. మా ఇంటికే వెళ్ళితే అక్కడ అమ్మ, అమ్మమ్మ చెప్పే మాటలు వింటే వీళ్ళపై చాలా కోపం వస్తుంది' అన్నది. 'అయితే కొన్ని రోజులు నువ్వు అక్కడికి వెళ్ళకు' అని చెప్పాం. తర్వాత శృతి తల్లి సుమిత్రను పిలిపించి మాట్లాడితే 'నా కూతురు నా మాట అసలు వినడం లేదు. వాళ్ళకు నా కూతురిపై నిజంగా ప్రేమ లేదు, నటిస్తున్నారు. నా కూతురిని నాకు కాకుండా చేస్తున్నారు. నేను ఇప్పటికీ మా అమ్మ మాట వింటాను. కానీ శృతి అలా చేయడం లేదు. పైగా అత్త, భర్త చెప్పిన మాటలే వింటుంటుంది' అని చెప్పుకొచ్చింది.

'చూడండి! సుమిత్ర! మీరు శృతికి పెండ్లి చేసి పంపించారు. ఇక ఆమె జీవితం ఆమెను బతకనివ్వండి. ఏది మంచి, ఏది చెడు ఆలోచించే స్థితిలో ఆమె ఉంది. నిజంగా మీ అవసరం ఆమెకు ఉంది అనుకుంటే ఆమెనే మిమ్మల్ని సలహా అడుగుతుంది. అప్పటివరకు మీరు ఆమె జీవితంలో జోక్యం చేసుకోకండి. శృతి జీవితం సంతోషంగా, సుఖంగా ఉండాలి అనుకుంటే మీరు ఆమె జీవితంలో ఏ మాత్రం జోక్యం చేసుకోవడానికి వీలు లేదు' అని చెప్పి పంపించాము.



సుమిత్ర! మీరు శృతికి పెండ్లి చేసి పంపించారు. ఇక ఆమె జీవితం ఆమెను బతకనివ్వండి. ఏది మంచి, ఏది చెడు ఆలోచించే స్థితిలో ఆమె ఉంది. నిజంగా మీ అవసరం ఆమెకు ఉంది అనుకుంటే ఆమెనే మిమ్మల్ని సలహా అడుగుతుంది. అప్పటివరకు మీరు ఆమె జీవితంలో జోక్యం చేసుకోకండి. శృతి జీవితం సంతోషంగా, సుఖంగా ఉండాలి అనుకుంటే మీరు ఆమె జీవితంలో ఏ మాత్రం జోక్యం చేసుకోవడానికి వీలు లేదు

- వై. వరలక్ష్మి, 9948794051

## జుట్టు రాలకుండా...

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న సమస్య హెయిర్ ఫాలింగ్... సరైన జీవనశైలి లేకపోవడం, ఆహార నియమాలు లేకపోవడంతో జుట్టు రాలుతుంది. దీని నుంచి బయట పడేందుకు చాలా రకాల రెమెడీస్ ప్రయత్నిస్తూనే ఉంటారు. అందుకోసం ఆయిల్స్ ఉపయోగిస్తారు. కొన్ని రకాల హెయిర్ ప్యాక్‌లను కూడా ప్రయత్నించి ఉంటారు. జుట్టు పెరుగుదలకు, జుట్టు రాలకుండా ఉండేందుకు కరివేపాకును ఉపయోగించవచ్చు. దీనితో చేసే కొన్ని ప్యాక్స్ జుట్టు రాలే సమస్యను తగ్గిస్తాయి. అయితే దీన్ని ఎలా వాడాలో తెలుసుకుందాం..

రోజుకు 30 నుంచి 80 వెంట్రుకలు రాలడం సహజం. కానీ కొందరికి అధికంగా జుట్టురాలుతుంది. విపరీతమైన జుట్టు రాలడం చివరికి బట్టతలకి దారితీస్తుంది. ఈ సమస్య నుంచి బయటపడేందుకు కరివేపాకు చాలా ఉపయోగపడుతుంది. ఈ ఆకు వంట రుచిని పెంచడమే కాకుండా జుట్టుకు కూడా ఎంతో మేలు చేస్తుంది. తెలుసుకోవాలి.

**మెంతికూరతో...**

మెంతికూరను కరివేపాకుతో కలిపి జుట్టుకు పట్టించడం వల్ల అద్భుతమైన ఫలితాలు వస్తాయి. దీని కోసం ఒక గిన్నెలో ఉసిరికాయ రసం, మెంతి పేస్ట్ తీసుకోండి. దానికి కరివేపాకు రసం కలపండి. తర్వాత ఈ పేస్ట్‌ను జుట్టుకు పట్టించాలి. కాసేపటి తర్వాత కడుక్కోవాలి. ఇలా చేస్తే జుట్టు రాలడం, చుండ్రు సమస్య నుంచి బయటపడొచ్చు.

**పెరుగుతో...**

కరివేపాకును పెరుగుతో కలిపి జుట్టుకు పట్టించడం వల్ల మేలు జరుగుతుంది. ఈ రెండు పదార్థాలు జుట్టుకు చాలా మేలు చేస్తాయి. ఒక గిన్నెలో పెరుగు తీసుకుని అందులో కరివేపాకు కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. ఈ హెయిర్ ప్యాక్ జుట్టు పెరిగేందుకు చాలా సాయపడుతుంది.

**ఉల్లిపాయతో...**

ఉల్లిపాయ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. జుట్టు రాలకుండా ఉండేందుకు చాలా మంది ఉల్లిపాయ రసాన్ని అప్లై చేస్తుంటారు. దానితో కరివేపాకు కలుపుకొంటే మంచి ఫలితం ఉంటుంది. ముందుగా కరివేపాకును రుబ్బుకోవాలి. తర్వాత ఉల్లిపాయ రసంతో కలపాలి. ఈ మిశ్రమాన్ని మీ జుట్టుకు పట్టించి 30 నిమిషాల పాటు అలాగే ఉంచి తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి.

ఈ హెయిర్ ప్యాక్స్ వారానికి రెండు సార్లు ఉపయోగించాలి. జుట్టు రాలడం సమస్య తగ్గుతుంది. అంతేకాదు జుట్టు పెరుగుదల కూడా ఉంటుంది.



## దేశానికే కేరళ ఆదర్శం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహితమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడాన్ని, కేంద్ర బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన సభలో కేసీఆర్ ఆహ్వానం మేరకు విజయన్ పాల్గొనడాన్ని రేవంత్‌రెడ్డి తప్పుపట్టారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ అవినీతిపరుడనీ, ఆయన్ను కలిసిన విజయన్ కూడా అవినీతిపరుడనీ, అందుకే కేసీఆర్‌ను కలిసారంటూ నోరు పారేసుకున్నారని పేర్కొన్నారు. ఒక ముఖ్యమంత్రి మరొక రాష్ట్రానికి వెళ్లినప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడం సంప్రదాయమన్న విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. అంతేకాదు కేంద్ర ప్రభుత్వ విధానాల మీద పోరాడే క్రమంలో కేసీఆర్ ఆహ్వానం మేరకు వచ్చి సభలో పాల్గొని విజయన్ ఏం మాట్లాడారో రేవంత్‌రెడ్డి మరిచిపోవడం ఆశ్చర్యకరమని తెలిపారు. దేశ రాజకీయాల్లో ప్రస్తుతం సీపీఐ(ఎం) పాత్ర ఏంటో కూడా మరిచిపోయి, బాధ్యత మరచి, తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. అభివృద్ధి సూచికల్లో దేశానికే కేరళ ఆదర్శమని వివరించారు. కరోనాను ఎదుర్కోవడంలో, ప్రజలను ఆదుకోవడంలో ఐక్యరాజ్య సమితి అభినందనలను అందుకున్న ప్రభుత్వమని ఆయన గుర్తు చేశారు. విద్య, వైద్యం, అధికార వికేంద్రీకరణ, ప్రజాసంక్షేమం, ప్రజా పంపిణీ వ్యవస్థ, సహకార రంగం అభివృద్ధిలోనూ, మహిళలకు, సామాజికంగా వెనకబడిన తరగతులకు భద్రత కల్పించడంలోనూ కేరళ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందున్నదని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కుల కోసం, అధికారాల కోసం కేంద్రంతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నదని వివరించారు. లౌకిక విలువల పరిరక్షణ కోసం, బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ల మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్నదని తెలిపారు. ఇవి తట్టుకోలేకనే మోడీ ప్రభుత్వం కక్షతో కేరళ ముఖ్యమంత్రి విజయన్ మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు అభ్యంతరకరమని తెలిపారు.

## ముగ్గురు కార్మికుల ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

శానిటేషన్ వర్కర్లుగా, బోడ జానకి పేషంట్ కేర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా యూనియన్ తరఫున.. ఇటీవల ఆస్పత్రికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి తమ సమస్యలపై చెప్పారు. జీతాలు సమయానికి ఇవ్వటం లేదని, వచ్చే తక్కువ జీతంలో కూడా కోతలు విధిస్తున్నారని, సెలవులు ఇవ్వడం లేదని వాపోయారు. స్పందించిన మంత్రి.. నిబంధనల మేరకు సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రికి చెప్పారన్న కక్షతో ఏజెన్సీ నిర్వాహకులు ఆ కార్మికులను విధుల నుంచి తొలగించారు. రెండు నెలలుగా సిబ్బంది ఎవరికీ వేతనాలు ఇవ్వని ఏజెన్సీ.. ఈ ముగ్గురికి మాత్రం 29వ తేదీన జీతాలు వేసి.. అనంతరం విధుల నుంచి తొలగించింది. అయినా వారు రోజువారి విధుల్లో భాగంగా శుక్రవారం ఉదయమే డ్యూటీకి వచ్చారు. అయితే, హాజరు రిజిస్టర్‌లో వారి పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని యూనియన్ సభ్యులతో చెప్పగా.. వారంతా కలిసి క్యాజువాలిటీ ఎదుట ధర్నాకు దిగారు. గంటకుపైగా ధర్నా చేసినా ఎవరూ స్పందించకపోవడంతో ముగ్గురు కార్మికులు సిట్రిజన్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. తోటి కార్మికులు వెంటనే వారిని అదే ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వారికి చికిత్స చేస్తున్నారు. ఏడాది కిందట ఓ



ఉద్యోగిని విధుల నుంచి తొలగించారని, అతన్ని విధుల్లోకి తీసుకోవాలని మంత్రి ద్వారా ఒత్తిడి తేవడం కూడా ఈ ముగ్గురిని తొలగించడానికి ప్రధాన కారణంగా ఆస్పత్రి సిబ్బంది చర్చించుకుంటున్నారు.

**మంత్రి ఆదేశాలు పక్కన పెట్టి**

ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూపరింటెండెంట్‌కు, ఏజెన్సీ నిర్వాహకులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయినా ఏజెన్సీ నిర్వాహకులు తమకేమీ పట్టనట్టు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి సిబ్బంది ఒక్కరికి మొత్తం జీతం 15,600 రూపాయలు. అందులో రూ.12093 సిబ్బంది ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. రూ.3023 పీఎఫ్, 484కు పైగా ఈఎస్ఐ కట్టాల్సి ఉంది. కానీ సదరు ఏజెన్సీ నిర్వాహకులు నెలకు రూ.11,000 మాత్రమే జీతంగా ఇస్తున్నారు. సుమారు రూ.1000 మాత్రమే పీఎఫ్ కడుతున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. మొబైల్‌కు ఎప్పుడూ మెసేజ్ రాలేదని, ఈ మధ్యనే మెసేజ్ వస్తుండటంతో అసలు ఎంత మొత్తం చెల్లిస్తున్నారో వెల్లడైందని చెబుతున్నారు.

**ఏజెన్సీని వెంటనే తొలగించాలి**

మునగ వెంకన్న (యూనియన్ నాయకులు)

అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్న ఏజెన్సీని వెంటనే తొలగించాలి. జీఓ ప్రకారం వేతనాలను సరైన సమయంలో అందించాలి. సీఎల్స్ ఇవ్వడం లేదు. మాకు సెలవులు ఇవ్వాలి. డ్యూటీ డ్రెస్ ఇవ్వటం లేదు. వాటిని వెంటనే ఇప్పించాలి.

**కలెక్టర్ దృష్టికి విషయం**



మొదటగా ఏజెన్సీ నిర్వాహకులు వెంకన్న నాకు కాల్ చేసి సిబ్బంది ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. ఏమైనా ఉంటే మాట్లాడదాం.. మొదట డ్యూటీలోకి వెళ్లాలని చెప్పాలని నేను చెప్పాను. ఉదయం 9:15 గంటలకు నేను రౌండ్స్‌కి వెళ్లే సమయం. ఆ సమయంలో ముగ్గురు సిబ్బంది సిట్రిజన్ టాబ్లెట్స్ మింగేశారు. అక్కడే ఉన్న డాక్టర్ చికిత్స అందించారు. వారి ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉంది. మిగతా సిబ్బందికి ఎమర్జెన్సీ సర్వీసులు ఆపొద్దని.. సమస్యలు ఏమైనా ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పాను. విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశాను.

-డాక్టర్ నిత్యానంద్ సూపరింటెండెంట్

## మళ్లీ బండ బాదుడు

న్యూఢిల్లీ : వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.25 పెరిగింది. పెరిగిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు చమురు సంస్థలు ప్రకటించాయి. తాజా ధరల పెంపుతో .. ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ రిటైల్ ధర రూ. 1,795కి చేరింది. ముంబయిలో సిలిండర్ ధర రూ.1,749, చెన్నై, కోల్‌కతాలో వరుసగా రూ.1,960, 1,911కి పెరిగింది. హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ ధర రూ.2,027లకు చేరింది.వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను పెంచడం వరుసగా ఇది రెండోసారి కావడం గమనార్హం. నెలరోజుల వ్యవధిలోనే రూ. 39 పెరిగింది. గతేడాది డిసెంబర్‌లో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ.21 పెంచింది. అయితే నూతన సంవత్సరం సందర్భంగా 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను సిలిండర్‌కు రూ. 39.50 తగ్గించినట్టు ప్రకటించింది. ఫిబ్రవరి 1న గ్యాస్ సిలిండర్‌పై రూ.14 పెంచుతున్నట్టు ప్రకటించింది. శుక్రవారం రూ.25 ను పెంచుతున్నట్టు చమురు సంస్థలు ప్రకటించాయి. దీంతో జనవరిలో తగ్గింపును నెలరోజుల వ్యవధిలో రెండు సార్లు పెంచుతూ సరిసమానం చేశాయి.గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ (14.2) ధర యథాతథంగానే కొనసాగుతుందని చమురు సంస్థలు తెలిపాయి. ఢిల్లీలో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ. 903, కోల్‌కతాలో రూ. 929, ముంబయిలో రూ.902.50, చెన్నైలో రూ. 918.50గా ఉంది.

## ఇజ్రాయిల్ ఆర్మీ హత్యాకాండ

న్యూఢిల్లీ : గాజా నగరంలో ఇజ్రాయెల్ సేనలు జరిపిన కాల్పుల్లో 112 మంది పాలస్తీనియన్లు మరణించడం, అనేక మంది గాయపడడం పట్ల సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. ఆకలితో మలమలమాడుతున్న ప్రజలు ఆహార ప్యాకెట్ల కోసం ఆ ప్రాంతంలోకి ప్రవేశించిన సహాయక ట్రక్కుల వద్ద గుమికూడినప్పుడు, వారిపై ఇజ్రాయిల్ సేనలు కాల్పులు జరిపి నెత్తుటేరులు పారించడం అత్యంత హేయమైన చర్య అని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమంలో ఇప్పటివరకు 30,000 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారని పొలిట్‌బ్యూరో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. .ఇంతటి ఘోర మారణకాండ జరిగినా భారత ప్రభుత్వం నోరు మెదపకపోవడం అత్యంత శోచనీయమని పేర్కొంది. గాజాపై జరుగుతున్న ఇజ్రాయెల్ యుద్ధంపై అమెరికాకు వంతపాడే వైఖరిని మోడీ ప్రభుత్వం విడనాడాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. భారత ప్రభుత్వం దక్షిణాఫ్రికా, బ్రెజిల్ అరబ్ దేశాల వంటి గ్లోబల్ సౌత్ దేశాలతో సమన్వయం చేసుకుని గాజాలో తక్షణ , శాశ్వత కాల్పుల విరమణ కోసం తగు యత్నాలు వెంటనే చేపట్టాలని పొలిట్‌బ్యూరో కోరింది.

## బీఆర్ఎస్ పాపాల్లో బీజేపీకీ పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఢిల్లీ వెళుతున్నాననీ, మేడిగడ్డ అంశంపై పలువురు నిపుణులు, అధికారులను కలుస్తానని మంత్రి చెప్పారు. నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ప్రాణహిత-చేవెళ్లను పూర్తిచేస్తే కాంగ్రెస్‌కు క్రెడిట్ వస్తుందనే కుట్రతోనే కేసీఆర్ రీడిజైన్ చేశారని వ్యాఖ్యా నించారు. ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వానివి భారీ తప్పులని చెప్పారు. బీఆర్ఎస్ తీరు హాస్యాస్పదమని చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నట్టు తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై సత్వర విచారణ జరగాలనీ, ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం భారీతప్పులు చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం జియాలాజి కల్ సర్వే చేయలేదనీ, అందుకే ఆ సమాచారాన్ని ఎన్డీఎస్ఏకు పంపలేద న్నారు. గత ప్రభుత్వం పనితీరు సరిగ్గా లేకపోవడం వల్లే ప్రాజెక్టుల్లో భారీ అవినీతి, తప్పులు జరిగాయని చెప్పారు. విజిలెన్స్ నివేదికపై న్యాయసలహా తీసుకుని కేసులు పెడతామని ప్రకటించారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసీఆర్ ఇప్పటివరకు మేడిగడ్డ ఘటనపై మాట్లాడ లేదని చెప్పారు.రాష్ట్రానికి రూ.లక్ష కోట్లు నష్టం చేశారని విమర్శించారు. ప్రాజెక్టు పూర్తయినట్టు కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ప్లానింగ్, డిజైన్.నిర్వహణలో బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థత కనిపించిందన్నారు. పాత ప్రాణహితకు రూ.1000 కోట్ల కరెంటు బిల్లు వస్తే, కాళేశ్వరం విషయంలో రూ. 10,500 కోట్ల బిల్లు వస్తుందని గుర్తుచేశారు. విజిలెన్స్ నివేదిక ప్రకారం ఇద్దరు అధికారులపై వేటు వేశామనీ, ఒకటి, రెండు రోజుల్లో మరికొంత మందిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. వర్షాకాలానికి ముందే మరమ్మత్తులు చేస్తామని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## మారణహోమం

గాజా : ఆకలితో అలమటిస్తున్న పిల్లలను, మహిళలతో సహా 112 మందిని ఇజ్రాయిల్ అమానుషంగా పొట్టనబెట్టుకున్నది. ఈ పాశవిక చర్యను ప్రపంచ దేశాలు ఖండించాయి. పాలస్తీనీయులను ఊచకోత కోసిన ఇజ్రాయిల్ దాష్టీకం పట్ల ఐరాస ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెరస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాలస్తీనీయులకు మానవతా సాయం అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఖతార్, యూరోపియన్ యూనియన్, సౌదీ అరేబియా ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి.

ఇజ్రాయిల్ మారణకాండపై చైనా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సాయం కోసం ఎదురుచూస్తున్న వారిని చంపడాన్ని తీవ్రంగా పరిగణించాలని చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ అన్నారు.

ఇజ్రాయిల్ ఆర్మీ సాగించిన హత్యాకాండ మానవాళిపై జరిగిన మహా నేరమని టర్కీ వ్యాఖ్యానించింది. "మానవతా సాయం కోసం క్యూలైన్లలో ఎదురుచూస్తున్న అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం, వారిని ఉద్దేశపూర్వకంగా సామూహికంగా అంతం చేయాలన్నదాంతో చేసిందేననిటర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

గాజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఖండించారు. "ఆహారం అడిగిన 100 మందికి పైగా పాలస్తీనియన్‌లను ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహూ చంపేశారు. ఇది నరమేథం, మారణహోమం" అని ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు.

ఇజ్రాయిల్ నుండి ఆయుధాల కొనుగోళ్లను రద్దుచేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. కాల్పుల విరమణ ఆవశ్యకతను ఈ ఘటన నొక్కి చెబుతోందని స్పానిష్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బరెస్ పేర్కొన్నారు. తక్షణమే కాల్పుల విరమణ కోసం పిలుపునివ్వాలని ఇటలీ డిమాండ్ చేసింది. అమెరికా అధ్యక్షుడు బైడెన్ తేలికగా స్పందించారు. కాల్పుల విరమణ చర్చలను ఇది క్లిష్టతరం చేస్తుందని ఆయన అన్నారు.

సాయం కోసం ఎదురుచూస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పులు సమర్థనీయం కాదని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలని, పౌరులకు సాయం అందించేందుకు రక్షణ కల్పించాలని ఒక ప్రకటనలో పేర్కొంది.

## జెండా పాటకు భిన్నంగా ధర

నవతెలంగాణ-
ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కార్పొరేషన్

ఖమ్మం మిర్చి మార్కెట్లో వ్యాపారులు వ్యవహారంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా జెండా పాటకు భిన్నంగా కొనుగోళ్లు జరుపుతున్నారు. జెండాపాటకు అనుగుణంగా ఒకటి, రెండు లాట్లు రేటు పెట్టాక.. మిగిలిన సరుకునంతా నాణ్యత, ఎగుమతులు లేకపోవడం, డిమాండ్‌కు మించి సరుకు రావడం, ఇతరత్ర కారణాలు చూపుతూ క్వింటాకు రూ.4వేలకు పైగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. జెండాపాటలో నలుగురైదుగురు వ్యాపారులే పాల్గొని ధర నిర్ణయించడం గమనార్హం. దీనిపై రైతులు పలుమార్లు మార్కెట్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నారు. అయినప్పటికీ వ్యాపారులు అదే రీతిన వెళుతుండటంతో శుక్రవారం మార్కెట్ ప్రధాన గేటు వద్ద ఆందోళన నిర్వహించారు.

**మంత్రి, కలెక్టర్ చెప్పినా తీరు మారట్లే..!**

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొద్దిరోజుల కిందట మార్కెట్‌ను సందర్శించారు. ఆ సమయంలోనూ వ్యాపారులపై రైతులు ఏకరువు పెట్టుకున్నారు. రెండు, మూడ్రోజుల కిందట జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ కూడా మార్కెట్‌కు వచ్చారు. ధర విషయంలో వ్యాపారులను హెచ్చరించారు. జెండా పాటకు భిన్నంగా ధర పెడితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. అయినా వ్యాపారుల వైఖరిలో ఏమాత్రం మార్పు రాలేదు. శుక్రవారం రైతులు ఆందోళన చేయడంతో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర కల్పించాలని, అప్పటి వరకు కొనుగోళ్లు నిలిపివేయాలని, గేట్లు మూసివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో మార్కెట్లో కొద్దిపాటి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొనుగోళ్లు నిలిచిపోయాయి. వ్యాపారులతో అదనపు కలెక్టర్, మార్కెట్‌శాఖ అధికారులు చర్చలు జరిపారు.

**నిత్యకృత్యం..**

మిర్చి కొనుగోళ్లు ముమ్మరమైనప్పటి నుంచి జెండా పాటకు విరుద్ధంగా ధర చెల్లిస్తున్నారు. శుక్రవారం జెండా పాట క్వింటాకు రూ.20,800 ప్రకటించగా.. వ్యాపారులు రూ.16వేల నుంచి రూ.14వేల మధ్యనే కొనుగోలు చేయడంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబికింది. ముఖ్యంగా పది వేలకు పైగా బస్తాల సరుకు వచ్చిన సందర్భంలో రేటు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం 16,215 బస్తాలు మార్కెట్‌కు రాగా, గరిష్ఠ ధర రూ.20,800, కనిష్ఠం రూ.14,000, మోడల్ ధర రూ.19,000 నిర్ధారించారు. కానీ అధిక మొత్తం సరుకును సగటున రూ.15వేలకే కొనుగోలు చేశారని రైతులంటున్నారు. వ్యాపారులతో అదనపు కలెక్టర్ చర్చల అనంతరం ఇక మీదట సరైన ధర చెల్లించేందుకు వ్యాపారులు ఒప్పుకున్నట్టు చెప్పారు. అధికారులు దగ్గరుండి గిట్టుబాటు ధర పెట్టేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

**జెండా పాట రేటు పెట్టాలి**

**రాందాసునాయక్, అందనాలపాడు, సీరోలు, మహబూబాబాద్ జిల్లా**

ఎన్నో ఏండ్ల నుంచి మిర్చి తోట వేస్తున్నా.. ఈ ఏడాది తెగుళ్లతో సగం తోట చచ్చిపోయింది. మొత్తం రూ.8లక్షల పెట్టుబడి పెడితే 20 బస్తాల దిగుబడి వచ్చింది. మొత్తం సరుకు పది క్వింటాలైనా ఇక్కడున్న రేటు ప్రకారం నాకు వచ్చేది రూ.1.50 లక్షలే. జెండా పాట ఎంత పాడితే అంత ధర మాకు చెల్లిస్తే కొద్దోగొప్పైనా న్యాయం జరుగుతుంది.

# 1న జీతాలు పడ్డాయ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ నాలుగేండ్ల తర్వాత ఒకటో తారీకున జీతాలు పడ్డాయి. పెన్షనర్లకు పింఛన్ జమ అయ్యింది. గతంలో బీఆర్ఎస్ హయాంలో జిల్లాల వారీగా జీతాలు జమయ్యేవి. అది కూడా ఒకటో వారం నుంచి మూడో వారం వరకు ఆలస్యంగా వచ్చేవి. కొన్ని జిల్లాల్లోని కొన్ని శాఖలకు చెందిన ఉద్యోగులకు నెలాఖరున జీతాలు జమయ్యే పరిస్థితి ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు జీతాల చెల్లింపులో మార్పు వచ్చింది. ఫిబ్రవరి జీతాలను మార్చి ఒకటిన చెల్లించడం గమనార్హం. డిసెంబర్ జీతాలను జనవరి ఆరు, జనవరి జీతాలను ఫిబ్రవరి ఏడు తేదీల్లో జమ చేసింది. అయితే బీఆర్ఎస్ హయాంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో గతేడాది జనవరి 13న, ఫిబ్రవరి 13న, మార్చి 13న చెల్లించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి ఆరున, ఫిబ్రవరి ఏడున, మార్చి ఒకటిన జీతాలు చెల్లించింది. బీఆర్ఎస్ హయాంలో గతేడాది నవంబర్ 13న నాటి ప్రభుత్వం జీతాలిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో డిసెంబర్ ఏడున ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఆ నెలలో 15న జీతాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆలస్యంగా జీతాలు ఇచ్చే పద్ధతికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. ఫిబ్రవరి జీతాలను ఒకటో తేదీన చెల్లించడమే అందుకు నిదర్శనం. రాష్ట్రంలోని 3,69,200 మంది ఉద్యోగులకు జీతాలు, 2,88,000 మంది పెన్షనర్లకు పింఛన్ చెల్లించింది. 2019, అక్టోబర్ ఒకటో తేదీన చివరిసారిగా ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పింఛన్ జమ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఒకటో తేదీన జీతాలివ్వడం ఇప్పుడే కావడం గమనార్హం. అయితే ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలివ్వడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి. ఇదే పద్ధతిని ప్రతినెలా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరాయి.

**ఉద్యోగుల్లో ఆందోళన పోయి...ఆనందం**

ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు రాకపోవడంతో ఇంతకాలం ఉద్యోగులు ఎంతో ఆందోళన చెందారు. ప్రభుత్వ తీరు పట్ల అసంతృప్తితో ఉన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న ఇంటి రుణం, విద్యారుణం, వ్యక్తిగత రుణం, వాహన రుణాలకు సంబంధించి ఐదో తేదీలోపు ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. కిరాయి ఇండ్లలో ఉండే వారు అయితే ఇంటి అద్దె కట్టాలి. పిల్లల ఫీజులు, కరెంటు బిల్లు, పాల బిల్లు, కిరాణా బిల్లు ఇలా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం సకాలంలో జీతాలు జమ చేయకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉండేది. బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలు చెల్లించేందుకు కొందరు అప్పులు చేసేవారు. సిబిల్ స్కోర్ తగ్గడంతో కొత్తగా ఎవరైనా రుణం తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. బ్యాంకులు ఇచ్చేందుకు నిరాకరించేవి. అందుకే ఒకటో తేదీన జీతాలివ్వాలంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు గత ప్రభుత్వాన్ని పలుమార్లు డిమాండ్ చేశాయి. అయినా ఇవ్వలేదు. అధికారంలోకి వస్తే ఒకటో తేదీన జీతాలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీన జీతాలు చెల్లించింది.

**ఇదే ఒరవడి ప్రతినెలా కొనసాగించాలి : టీఎస్‌యూటీఎఫ్**

మొదటి తేదీన జీతాలు చెల్లించే ఒరవడిని ప్రతినెలా కొనసాగించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దాదాపు నాలుగేండ్ల తర్వాత ఒకటో తేదీన జీతాలను జమ చేయడం హర్షణీయమని తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి వేతనాలను ఫిబ్రవరి రెండు, మూడు తేదీల్లో చెల్లించారని పేర్కొన్నారు. ఫిబ్రవరి జీతాలను మార్చి ఒకటిన జమ చేయడం సానుకూల అంశమని వివరించారు. అదే విధంగా ట్రెజరీల్లో ఆమోదం పొంది రెండేండ్లుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ తదితర బిల్లులన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2022, జులై నుంచి గతేడాది జనవరి, జులై మూడు వాయిదాల కరువు భత్యం (డీఏ) పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా వెంటనే మూడు విడతల డీఏను మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులకు ఉపశమనం కలిగించాలని సూచించారు. రాష్ట్ర విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పడాలని కోరారు. కార్పొరేట్ విద్యావ్యాపారాన్ని నియంత్రించాలని పేర్కొన్నారు. పిల్లలందరికీ సమానమైన, నాణ్యమైన విద్యనందించేందుకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.

**ప్రభుత్వానికి కృతజ్ఞతలు : టీఎన్జీవో**

ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలు చెల్లించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకు ధన్యవాదాలు పేర్కొన్నారు.

**హర్షణీయం : టీఎస్‌సీపీఎస్ఈయూ**

రాష్ట్రంలో ఒకటో తేదీన జీతాలు రావడం హర్షణీయమని టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని నిరూపించుకుందని పేర్కొన్నారు. ఒకటో తేదీన జీతాలను జమ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఛాంపియన్ పుణెరి పల్టాన్

- ఫైనల్లో హర్యానా స్టీలర్స్‌పై గెలుపు
- ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్

నవతెలంగాణ- హైదరాబాద్



ప్రొ కబడ్డీ లీగ్‌కు కొత్త చాంపియన్ వచ్చేసింది. పుణెరి పల్టాన్ ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ చాంపియన్‌గా అవతరించింది. ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో హర్యానా స్టీలర్స్‌పై 28-25తో అద్భుత విజయం సాధించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని జీఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతిమ పోరులో పుణెరి పల్టాన్ అత్యుత్తమ ఆటతీరు కనబరిచింది. ఉత్తమ డిఫెన్స్ జట్ల నడుమ సాగిన టైటిల్ పోరులో హర్యానా స్టీలర్స్‌పై పుణెరి పల్టాన్ గెలుపు ఢంకా మోగించింది. పుణెరి పల్టాన్ తరఫున పంకజ్ మోహిత్ 9 రెయిడ్ పాయింట్లతో చెలరేగగా.. మోహిత్ గోయత్ (5), అస్లాం ఇమాందార్ (4), డిఫెండర్ గౌరవ్ ఖత్రి (4) రాణించారు. హర్యానా స్టీలర్స్ తరఫున శివం (6), సిద్దార్థ్ దేశాయ్ (4), వినయ్ (3), మోహిత్ రాణించారు. ఊహించినట్టుగానే ఫైనల్లో ఫలితాన్ని డిఫెన్స్ బలమే శాసించింది. పుణెరి పల్టాన్, హర్యానా స్టీలర్స్ రెయిడింగ్‌లో సమానంగా 17 పాయింట్లు సాధించాయి. డిఫెన్స్‌లో పుణెరి పల్టాన్ 9 పాయింట్లు సహా ఓ ఆలౌట్ బోనస్ దక్కించుకుంది. హర్యానా స్టీలర్స్ ఐదు ట్యాకిల్స్‌కే పరిమితమై టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో వరుసగా రెండో ఏడాది ఫైనల్‌కు చేరుకున్న పుణెరి పల్టాన్ పట్టు పట్టుదలతో టైటిల్ పట్టేసింది.

**ఆద్యంతం ఉత్కంఠ:**

పుణెరి పల్టాన్, హర్యానా స్టీలర్స్. ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్లో రెండు ఉత్తమ డిఫెన్స్ జట్లు. రెయిడింగ్‌లో, డిఫెన్స్‌లో రెండు జట్లు సమవుజ్జీలు. దీంతో సహజంగానే టైటిల్ పోరు ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. ఆరంభంలో పది నిమిషాల్లో రెండు జట్లకూ పెద్దగా పాయింట్లు లభించలేదు. ఇరు జట్లు బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థిని నిలువరించాయి. 7-7తో మ్యాచ్ రసపట్టులో సాగుతున్న దశలో పుణెరి పల్టాన్ రెయిడర్ పంకజ్ మోహిత్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చావోరేవో రెయిడ్‌లో పంకజ్ మోహిత్ కూతలో కేక పెట్టాడు. సూపర్ రెయిడ్‌లో నాలుగు పాయింట్లు సాధించిన పంకజ్ మోహిత్.. పుణెరి పల్టాన్‌ను ఆధిక్యంలో నిలిపాడు. 9-13తో హర్యానా ఆలౌట్ ప్రమాదంలో నిలువగా.. విశాల్ మెరుపు రెయిడ్‌తో ఆ జట్టును రేసులో నిలిపాడు. ప్రథమార్థం ఆట ముగిసే సరికి పుణెరి పల్టాన్ 13-10తో ముందంజ వేసింది.

**పుంజుకున్నప్పటికి..! :**

సెకండ్ హాఫ్‌లో హర్యానా స్టీలర్స్ పుంజుకునే ప్రయత్నం చేసినా ప్రయోజనం దక్కలేదు. ద్వితీయార్థం ఆరంభంలోనే రెయిడ్ పాయింట్ సాధించిన పుణెరి పల్టాన్ 14-10తో జోరు కొనసాగించింది. ఓ దశలో 18-11తో పుణెరి పల్టాన్ గెలుపు ఖాయం చేసుకుంది. శివం, సిద్దార్థ్ దేశాయ్, వినయ్, మోహిత్‌లు మెరవటంతో హర్యానా స్టీలర్స్ పుంజుకుంది. ఆఖరు పది నిమిషాల్లో పాయింట్లు సాధించిన హర్యానా స్టీలర్స్ పాయింట్ల అంతరం కుదించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ద్వితీయార్థంలో పుణెరి పల్టాన్‌తో సమానంగా హర్యానా స్టీలర్స్ సైతం 15 పాయింట్లు సాధించినా... తొలి 20 నిమిషాల్లో సాధించిన మూడు పాయింట్ల ఆధిక్యమే పుణెరి పల్టాన్‌ను ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్ చాంపియన్‌గా నిలిపింది.

# పదేండ్లుగా పోరాటం..

- తొలగించిన ఉద్యోగం ఇవ్వాలని ఆమరణ దీక్ష
- ఎనిమిది కేసులు పెట్టిన పోలీస్ శాఖ
- మాజీ మహిళా హోమ్‌గార్డు ఆవేదన

నవతెలంగాణ - రామగుండం

అధికారుల స్వార్థం, అవసరాలకు బలై ఉద్యోగం కోల్పోయిన ఓ మహిళా హోంగార్డు తన ఉద్యోగం తిరిగి ఇప్పించాలని పదేండ్లుగా పోరాడుతోంది. 2009లో గోదావరిఖనికి చెందిన మామిడి పద్మ హోమ్‌గార్డ్‌గా ఎంపికైంది. ఆమెకు మొదట వేములవాడ దేవస్థానంలో విధులు కేటాయించారు. కొంతకాలం అక్కడ విధులు నిర్వర్తించిన అనంతరం ఆమెను గోదావరిఖనికి బదిలీ చేశారు. ఇక్కడ ఏఎస్పీ విష్ణు వారియర్ ఇంట్లో ఆమెకు విధులు కేటాయించారు. ఈ క్రమంలో ఓ రోజు విష్ణు వారియర్ ఇంట్లో తన విధులకు సంబంధం లేని పనిని అప్పగించడంపై హోంగార్డు పద్మ తన వ్యతిరేకతను బహిర్గతం చేశారు. దీంతో ఆమెకు ట్రాఫిక్ విభాగంలో విధులు కేటాయించారు. ఈ విధులకు ఆమె యూనిఫార్మ్ చుడీదార్ ధరించడాన్ని కారణంగా చూపి కక్షపూరితంగా తనను 2014లో ఉద్యోగం నుంచి తొలగించినట్టు బాధితురాలు పద్మ వాపోతోంది.

**ఆగని పోరాటం..**

ఉద్యోగం నుంచి తొలగించడంతో 2014నుంచి పద్మ ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పిల్లల పోషణ కూడా భారమై మానసికంగా, ఆర్థికంగా కష్టాలు పడుతోంది. తన ఉద్యోగం తిరిగి ఇప్పించాలని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులను వేడుకుంటోంది. అందరికీ వినతిపత్రాలు సైతం ఇచ్చింది.



ప్రజాపాలనలో తనకు న్యాయం జరుగుతుందని ఆశించిన పద్మ దీక్షకు పూనుకుంది. ఫిబ్రవరి 17న నిరసనకు దిగి 19న అనారోగ్యానికి గురి కావడంతో పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంచెం ఆరోగ్యం కోలుకోవడంతో ఫిబ్రవరి 29న తిరిగి ఆమరణ దీక్ష ప్రారంభించింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తనకు న్యాయం చేయలని పద్మ కోరుకుంటోంది.

# సెమీస్‌లో అంకిత రైనా

**ఐటీఎఫ్ మహిళల ఓపెన్ 2024**



న్యూఢిల్లీ : భారత వర్థమాన టెన్నిస్ క్రీడాకారిణి అంకిత రైనా డబుల్ ధమాకా. మహిళల సింగిల్స్‌లో అద్భుత విజయంతో సెమీఫైనల్లో అడుగుపెట్టిన అంకిత రైనా.. మహిళల డబుల్స్‌లోనూ విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అంకిత రైనా 4-6, 6-2, 6-4తో మూడు సెట్ల మ్యాచ్‌లో పోరాట పటిమ కనబరిచింది. స్వీడన్ అమ్మాయి జాక్వలైన్ తొలి సెట్లో అంకితపై పైచేయి సాధించగా.. రెండో సెట్లో అంకిత రెచ్చిపోయింది. 5-1తో జాక్వలైన్‌పై పైచేయి సాధించింది. నిర్ణయాత్మక మూడో సెట్లో అంకిత రైనా ఆరంభంలో తడబడింది. 2-4తో వెనుకంజ వేసింది. సెమీఫైనల్ బెర్త్ చేజారుతున్న తరుణంలో పుంజుకున్న అంకిత రైనా.. ఆ తర్వాత వరుస గేముల్లో గెలుపొందింది. 6-4తో జాక్వలైన్‌ను చిత్తు చేసి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లోనూ అంకిత రైనా కజకిస్థాన్ అమ్మాయి జిబెక్‌తో కలిసి 7-5, 6-2తో రియా, ఒజెకి జంటపై వరుస సెట్లలో విజయం సాధించింది. ఇక మహిళల సింగిల్స్‌లో సహజ యమలపల్లి నిరాశపరిచింది. టాప్ సీడ్ డాలియ (స్లోవేకియా) చేతిలో 5-7, 6-3, 0-6తో సహజ పరాజయం పాలైంది.

# క్రీడలపై ప్రభుత్వం చిన్నచూపు!

**1600 పీఈటీ పోస్టులు మంజూరు చేయాలి**



హైదరాబాద్ : మెగా డీఎస్సీలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుల పోస్టులను 182 మాత్రమే భర్తీ చేయటం క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూడటమేనని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (తెలంగాణ) అధ్యక్ష, కార్యదర్శులు బి. రాఘవరెడ్డి, పి. కృష్ణమూర్తి గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలలో కనీసం 1600 పీఈటీ పోస్టులను మంజూరు చేసి ఈ మెగా డీఎస్సీలోనే భర్తీ చేయాలని పెటా టిఎస్ సంఘం నేతలు కోరారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ పట్టా పొందిన 90,000 మంది పీఈటీ నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు.

# నవచిత్రం

## ఆస్కార్ స్థాయిలో 1920 భీమునిపట్నం



అపర్ణాదేవి, కంచర్ల ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర, అపర్ణాదేవి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '1920 భీమునిపట్నం'. నరసింహ నంది దర్శకత్వంలో ఎస్.ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో జరిగింది.

అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ పోలీస్ అధికారి పాత్రలో హీరో కంచర్ల ఉపేంద్ర నటిస్తుండగా, స్వాతంత్ర సమరయోధుడి కుమార్తె పాత్రలో హీరోయిన్ అపర్ణా దేవి కనిపిస్తారు. వీరిద్దరిపై కాంగ్రెస్ వాలంటీర్ల నేపథ్యంలో తీసిన తొలి సన్నివేశానికి చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు క్లాప్ కొట్టారు.

ఈ సందర్భంగా నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, 'ఈ చిత్రంలోని సీతారాం, సుజాత పాత్రల మధ్య నడిచే ప్రేమకథను దర్శకుడు అద్భుతంగా తయారు చేశారు. ఆస్కార్ స్థాయికి తగట్టుగా తెరకెక్కించబోతున్నాం. సంగీతం, ఫోటోగ్రఫీ ఈ చిత్రానికి హైలైట్స్‌గా నిలుస్తాయి. సంగీత దర్శకుడు ఇళయరాజాకి కథ నచ్చి సంగీతాన్ని అందిస్తున్నారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం. రామోజీ ఫిలింసిటీలో పది రోజులపాటు చిత్రీకరణ చేసిన తర్వాత రాజమండ్రి, విశాఖపట్నం, అరకు, ఊటీలలో చిత్రీకరణ జరుపుతాం' అని అన్నారు. 'భారత స్వతంత్ర పోరాట నేపథ్యంలో చక్కటి భావోద్వేగాల మధ్య నడిచే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. పాత్రలన్నీ సహజసిద్ధంగా ఉంటాయి. నిజ జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రేరణగా తీసుకుని ఈ సినిమా చేస్తున్నాం. వాటికి ప్రాణప్రతిష్ట చేసే నటీ నటులను ఎంపిక చేసుకున్నాం. మంచి అభిరుచి కలిగిన నిర్మాత ఈ ప్రాజెక్టును చేస్తుండటంతో అద్భుతమైన చిత్రంగా రూపుదిద్దుకుంటుందన్న నమ్మకం ఉంది' అని దర్శకుడు నరసింహ నంది చెప్పారు. "తెలుగు సినిమా ఎప్పుడో ప్రపంచ స్థాయికి చేరింది. దానిని నిలబెట్టే స్థాయి కలిగిన సినిమా ఇది. నా కెరీర్‌లో విభిన్న చిత్రమవుతుంది' అని హీరో కంచర్ల ఉపేంద్ర తెలిపారు.

హీరోయిన్ అపర్ణాదేవి మాట్లాడుతూ, 'కెరీర్ తొలి దశలోనే ఇలాంటి మంచి చిత్రంలో, నటనకు ఎంతో స్కోప్ ఉన్న పాత్ర లభించడం అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు. ఇదే కార్యక్రమంలో నూతన చిత్రం 'విక్రమ్ దాస్' లోగో ఆవిష్కరణ జరిగింది. బాలు దర్శకత్వంలో నిర్మించనున్న మరో నూతన చిత్రమిది.





తమన్నా, సంపత్ నంది

## గ్రామాన్ని కాపాడే మల్లన్న..

ఓటీటీలో విడుదలై నయా క్రైమ్ థ్రిల్లర్‌గా 'ఓదెల రైల్వే స్టేషన్' మంచి విజయం సాధించింది. ఈ చిత్రానికి సంపత్ నంది కథ అందించగా, అశోక్ తేజ దర్శకత్వం వహించారు. తాజాగా దీనికి సీక్వెల్‌గా 'ఓదెల2' వస్తోంది. కథ, స్పాన్, కాస్టింగ్, ప్రొడక్షన్, సాంకేతిక ప్రమాణాల పరంగా ఇది మ్యాసివ్‌గా ఉండనుందని మేకర్స్ తెలిపారు.

లీడ్ రోల్‌లో తమన్నా నటిస్తున్న ఈ చిత్రాన్ని పలు భాషల్లో థియేటర్స్ ద్వారా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సంపత్ నంది క్రియేటర్‌గా ఉన్న ఈ చిత్రాన్ని అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్లపై డి.మధు నిర్మిస్తున్నారు.

ఈ చిత్ర ప్రారంభోత్సవం గురువారం కాశీలో జరిగింది. రెగ్యులర్ షఉటింగ్ కూడా ఈరోజు ప్రారంభమవుతుంది.

ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశంతోపాటు పలు థ్రిల్ చేసే విషయాలు చాలా అద్భుతంగా ఉండబోతున్నాయి. టైటిల్ పోస్టర్ చాలా క్రియేటివ్‌గా ఉంది. ఇది మల్లన్న స్వామిగా పూజించబడే శివుని త్రిశూలాన్ని చూపిస్తుంది. నెంబర్ 2 త్రిశూలం విభూతి, ఒక బిందీ శివలింగాన్ని చూడగలిగే విధంగా రూపొందించారు. ఇది ఆధ్యాత్మికంగా కనిపిస్తుంది.

హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: డి మధు, దర్శకత్వం: అశోక్ తేజ, డిఓపీ : సౌందర్ రాజన్. ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్.

## మళ్లీ పుట్టి వచ్చినవా..



ప్రతి భారతీయుడు చూడాల్సిన చిత్రంగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ బ్యానర్ పై చదలవాడ పద్మావతి నిర్మాతగా వ్యవహరిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'రికార్డ్ బ్రేక్'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన సెకండ్ సాంగ్ 'మళ్లీ పుట్టి వచ్చినవా..'ని రిలీజ్ చేశారు. ఈ పాటకి సాబు వర్గీస్ మ్యూజిక్ అందించగా, వరికుప్పల యాదగిరి రచయితగా, గాయకుడిగా వస్తున్న ఈ పాట సినిమాకి పెద్ద ఎసెట్‌గా నిలుస్తుంది. పాన్ ఇండియా సినిమాగా 8 భాషల్లో ఈ సినిమాను మేకర్స్ మన ముందుకు తీసుకురాబోతున్నారు. ప్రస్తుతం సెన్సార్ వర్క్ నడుస్తోంది. అతి త్వరలో సినిమా విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ సందర్భంగా చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'మా సినిమా నుంచి సెకండ్ సాంగ్‌గా 'మళ్లీ పుట్టి వచ్చినవా..' సాంగ్‌ని విడుదల చేశాం. ఇప్పటివరకు రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్‌కి మంచి స్పందన లభించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాని మంచి బ్యూటిఫుల్ లొకేషన్స్‌లో చిత్రీకరించాం. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మా ఆర్టిస్టులు, టెక్నీషియన్లు చాలా సపోర్ట్ ఇచ్చారు. అతి త్వరలో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేసి, రిలీజ్ డేట్ అనౌన్స్ చేయబోతున్నాం. ప్రేక్షకులందరికీ సినిమా ఖచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్య కృష్ణ, సంజన, తుమ్మల ప్రసన్న కుమార్, శాంతి తివారీ, సోనియా, కాశీ విశ్వనాథ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ : అంజిరెడ్డి శ్రీనివాస్, సంగీతం : సాబు వర్గీస్, ఎడిటింగ్ : వెలగపూడి రామారావు, డిఓపి : కంతేటి శంకర్.



ఇమ్రాన్ హష్మీ

## కావాలని ఆ పాత్రలను ఎంచుకోలేదు

షోటైమ్‌లో ఇమ్రాన్ హష్మీ యాంటీ-హీరో రఘు ఖన్నా పాత్రని పోషించారు. హాట్‌స్టార్ స్పెషల్‌గా మార్చి 8 నుండి ప్రత్యేకంగా ఈ 'షోటైమ్' డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది.

దీని గురించి ఇమ్రాన్ హష్మీ మాట్లాడుతూ, "నేను పూర్తిగా క్లీన్, నీతివంతమైన పాత్రను పోషించగలనని నమ్మాను. నా స్క్రీన్ ఇమేజ్‌ని బట్టి కాకుండా అందులో కొంత భాగం నేను కనిపించే తీరు వల్ల ప్రేక్షకులు నా గురించి కుట్ర లేదా మోసపూరిత భావాన్ని ఫీల్ అవుతారు. నా మొదటి చిత్రం నుండి నేను కావాలని ఈ పాత్రలను ఎంచుకోలేదు. నా కెరీర్ ప్రారంభంలో అలాంటి పాత్రలకు అవకాశాలు వచ్చాయి. కాలక్రమేణా ప్రేక్షకులు నన్ను గ్రే షేడ్స్ ఉన్న పాత్రల్లో ఆదరించారు' అని అన్నారు. ఇమ్రాన్ హష్మీ, మహిమా మక్వానా దర్శకత్వం వహించిన ఈ ధారావాహికలో మౌని రాయ్, రాజీవ్ ఖండేల్వాల్, శ్రియా శరణ్, విశాల్ వశిష్ఠ, నీరజ్ మాధవ్, విజయ్ రాజ్ మరియు నసీరుద్దీన్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## మహిళల శక్తిని తెలిపే నారీ శక్తి



శ్రీ శ్రీ క్రియేషన్స్ శ్రీ పద్మావతి ఫిలిమ్స్ పై సతీష్ చంద్ర నిర్మాతగా హర్షిత విప్పర్ల, మోహిత్ రాథోడ్ దర్శకత్వంలో సమ్మెట గాంధీ, గీత, కీర్తి, నీరజ లావణ్య, సౌజన్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'నారీశక్తి' షార్ట్ ఫిలింకి సంబంధించిన పోస్టర్ లాంచ్ ఫిలిం ఛాంబర్‌లో చాలా ఘనంగా జరిగింది. నేటి మహిళల్లో ఉండాల్సిన లక్షణాలను తెలియజేస్తూ కొత్త కాన్సెప్ట్‌తో ఈ షార్ట్ ఫిలిం మన ముందుకు రాబోతోంది.

దర్శకుడు మోహిత్ మాట్లాడుతూ, 'ఆడవాళ్లు అంటే ఓన్లీ ఇంటిపనికే కాదు ఉమెన్ ఎంపవర్మెంట్ అనేది అందరికీ తెలియాలి అనే కథతో వస్తోంది. ప్రేక్షకులు అందరూ చూసి మమ్మల్ని సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'డైరెక్టర్ కథ చెప్పినప్పుడు చాలా బాగా అనిపించింది. ఇలాంటి కథలు ఎంకరేజ్ చేస్తే మంచిది. స్త్రీ శక్తి గురించి చాలా చక్కగా వివరించారు' అని నిర్మాత సతీష్ చంద్ర చెప్పారు. డైరెక్టర్ హర్షిత మాట్లాడుతూ, 'మొదటి నుంచి సమ్మెట గాంధీ చాలా సపోర్ట్ చేశారు. చాలా మంచి కొత్త కాన్సెప్ట్‌తో మీ ముందుకు రాబోతున్నాం' అని అన్నారు.

## ప్రేక్షకుల్ని మెప్పించే సరికొత్త కథ





నాని మూవీ వర్క్స్, రామా క్రియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న 'కలియుగం పట్టణంలో'. కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీకి కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలను రమాకాంత్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈనెల 22న రాబోతోన్న ఈ మూవీలో చిత్రా శుక్లా ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను గురువారం నిర్వహించారు.

రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, "ఆ నలుగురు' సినిమాలో నాతో నటించిన విశ్వ కార్తికేయ ఇప్పుడు హీరోగా నటించాడు. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోంది. కలియుగం పట్టణంలో అనే టైటిలే కొత్తగా ఉంది. ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'నేను సినిమా పరిశ్రమకు కొత్త. మా మామ నీలకంఠంని సినిమాల గురించి ఎప్పుడూ అడుగుతుండేవాడిని. నాకు మూడు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. అక్కడ విద్యార్థులకు చాలా టాలెంట్ ఉంది. ఆ టాలెంట్‌ను బయటకు తీసుకు రావాలని, నా విద్యార్థులకు అవకాశం ఇవ్వాలని నాని మూవీ వర్క్స్ అనే బ్యానర్‌ను పెట్టాను. రమాకాంత్ నా టీంకు కథను చెప్పారు. మూడు, నాలుగు నెలల్లోనే సినిమా స్టార్ట్ చేశారు. రెండున్నర గంటలు అద్భుతంగా కథ చెప్పాడు. ప్రతీ సీన్ నా మైండ్‌లోకి ఎక్కించేశాడు. అజయ్ మ్యూజిక్, చంద్రబోస్, భాస్కర భట్ల పాటలు అద్భుతంగా వచ్చాయి. టీజర్, ట్రైలర్‌లను చూసి మా సినిమా కథను అంచనా వేయలేరు. ఈ స్టోరీ అంత కొత్తగా ఉంటుంది. ఈనెల 22న మా చిత్రం రాబోతోంది. అందరూ మా సినిమాను చూసి ఆదరించండి' అని నిర్మాత డా.కందుల చంద్ర ఓబుల్ రెడ్డి చెప్పారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.